https://prajakalam.com

RNI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

శుక్రవారం | 28-02- 2025 | సంపుటి: 15 , సంచిక: 330 నిజామాబాద్ పేజీలు : 12, వెల : 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

Circulated to Hyderabad,Ranagareddy,Nizamabad, Warangal, Mulugu, Shadnagar, Yadadri, Nalgonda, karimnagar, khammam, Medak, Sangareddy, Siddipet, Medchal, Jagityal,Vemulawada



ప్రజా కలం

Digital Editions

http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com




## ప్రతిజ్ఞకు న్యాయం చేయండి

### నిజాలు చెరపొద్దు.. డాక్యుమెంట్లు దాచొద్దు..

-నలుగురు ఈఎన్సీలను ప్రశ్నించిన కాళేశ్వరం కమిషన్

-అన్నారం, సుందిళ్ల లొకేషన్లను కేసీఆర్, హరీశ్ ఆదేశాల మేరకే మార్చమన్న ఈఎన్సీలు

-బ్యారేజీల్లో నీళ్లు నింపాలని కూడా వాళ్లిద్దరే ఆదేశించారని క్లారిటీ

- కాగ్ సభ్యులను కూడా ప్రశ్నించిన కమిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)

కాళేశ్వరం కమిషన్ విచారణ జోరందుకుంది. గురువారం నాడు నలుగురు ఈఎన్సీలను కమిషన్ విచారించింది. నల్లా వెంకటేశ్వర్లు, హరీరాం, మురళీధర్ రావు, నరేందర్ రెడ్డిని ఒకే వరుసలో కూర్చోబెట్టి క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

తరువాయి 2వ పేజీలో...



## మహాయజ్ఞం దిగ్విజయం

### అసౌకర్యానికి గురై ఉంటే క్షమించండి : ప్రధాని మోదీ



ఢిల్లీ ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)

కోట్లాది మంది భక్తుల విశ్వాసం, అఖాడాల ఆశీర్వాదాలతో హిందువులు పవిత్రంగా భావించే ప్రయాగ్‌రాజ్ మహా కుంభ మేళా శివరాత్రి పర్వదినమైన బుధవారం వైభవంగా ముగిసింది.

తరువాయి 2వ పేజీలో...

## మాదిగ అమరవీరుల త్యాగాల గుర్తుగా స్థూపాన్ని నిర్మించాలి

-మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా, గ్రామ మండల, జిల్లా, కేంద్రాలలో నిర్వహించాలని పిలుపు,

-హైదరాబాద్ సమీపంలో 5 ఎకరాలలో స్థలంలో మాదిగ అమరవీరుల గుర్తుగా ఒక మ్యూజియం నిర్మించాలి.

-ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ.



2లో



## తెలంగాణ, హైదరాబాద్ రైజింగ్.. ఇక ఆగదు

- మన రైజింగ్ను ఎవరూ ఆపలేరు
- దావోస్ పర్యటనల వల్ల భారీగా పెట్టుబడులు
- దిగ్గజ సంస్థలు మన వద్దకు వస్తున్నాయ్
- ఉద్యోగాల కల్పనలో మనమే నంబర్ 1
- ఇక్కడ అత్యధిక ఏపి, అత్యల్ప ద్రవ్యోల్బణం
- హెచ్సీఎల్ టెక్ కొత్త క్యాంపస్ ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్.. హైదరాబాద్ రైజింగ్.. అన్నప్పుడు మొదట్లో కొందరు సందేహాలు వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జరుగుతున్న పరిణామాలతో ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ప్రపంచమంతా ఒప్పుకుంటోంది. తెలంగాణ రైజింగ్.. హైదరాబాద్ రైజింగ్..

తరువాయి 2వ పేజీలో...

## పోలింగ్ ముగిసింది.. గెలిచేదెవరు.?

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)



తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ముగిసింది. మార్చి3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను లెక్కిస్తారు. బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించడంతో ఫలితాలు వెల్లడించడానికి రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు హోరాహోరీ ప్రచారం నిర్వహించారు. మొత్తం మూడు స్థానాలకు పోలింగ్ జరిగినప్పటికీ.. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం అందరిదృష్టి ఆకర్షిస్తోంది. మొత్తం 56 మంది అభ్యర్థులు ఇక్కడి నుంచి పోటీలో ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీతో పాటు మరో ఇండిపెండెంట్ అభ్యర్థి మధ్య తీవ్రపోటీ జరిగింది. ఎవరు గెలిచినా మూడో ప్రాధాన్యత ఓటుతోనే గెలిచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 56 మంది అభ్యర్థులు ఉన్నా.. నాలుగు, మూడు స్థానాల్లో నిలిచే అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియతోనే విజేత తేలే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇంతకీ పోలింగ్ ముగిసింది. విజేత ఎవరనేదానిపై ఎవరి అంచనాలు వారివి. ఓటింగ్ సరళి ఆధా రంగా ఎవరికి విజయవకాశాలు ఎక్కువగా ఉన్నాయో తెలుసుకుందాం.

**గెలుపు అవకాశాలు ఎవరికంటే..**

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటినుంచి బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీ ప్రచారం నిర్వహించింది. బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్ రెడ్డి పోటీచేశారు.

తరువాయి 2వ పేజీలో...

## టన్నెల్ ప్రమాదానికి కారణం బాధ్యత రాహిత్యమే

- 15 నెలల్లోనే ఐదు ప్రాజెక్టులలో ప్రమాదం
- దోమల పెంటను మంత్రుల బృందం టూరిస్ట్ ప్లేస్ గా ఎంచుకుంది
- ఆరు రోజులైనా తట్టెడు మట్టి తీయకపోవడం దురదృష్టకరం
- కార్మికుల కుటుంబాలను ఎందుకు దాస్తున్నారో చెప్పాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు



నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి).

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 15 నెలలు పూర్తికాకముందే రాష్ట్రంలోని సుమారు ఐదు ప్రాజెక్టుల్లో ప్రమాదం చోటు చేస్తుందని, ఇది ప్రభుత్వ బాధ్యత రాహిత్యమేనని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. గురువారం శ్రీశైలం ఎడమ గట్టు కాలువ టన్నెల్ ప్రమాద ఘటనను సందర్శించేందుకు వచ్చిన ఆయనను మొదట గా పోలీసులు తన రాకను అడ్డుకున్నారని, ఆ తర్వాత కొందరిని మాత్రమే లోనికి అనుమతించారన్నారు. అక్కడి పరిస్థితులను పూర్తిగా గమనించి రెస్క్యూటీమ్ లో మాట్లాడిన సందర్భంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో ఉందని గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రెండు రోజుల్లోనే రెస్క్యూ ఆపరేషన్ పూర్తి చేసి కార్మికులను కాపాడతామని గొప్పలు చెప్పు కుంటూ క్షేత్రస్థాయిలో మాత్రం 11 రకాల రెస్క్యూ టీం బృందాలు పనిచేస్తున్న ఎవ రికీ పూర్తిస్థాయి ఆదేశాలు ఇవ్వకపోవడం లేదన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## ముఖ్యమంత్రికి కేంద్రమంత్రి సవాల్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)


తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా తాను అడ్డుకుంటున్నాననే ఆరోపణను నిరూపించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. హైదరాబాద్ మెట్రో రైలు దశ–2కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా తాను ఆపుతున్నానని రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణకు కేంద్ర మంత్రి స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో అనధికారిక సంభాషణ సందర్భంగా ముఖ్యమంత్రి, కిషన్ రెడ్డి ప్రాజెక్టులకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి అజ్ఞానం వల్ల మాట్లాడుతున్నాడని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తెలంగాణ ప్రజల దురదృష్టమన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## రేవంత్ ఎందుకు అబద్దాలు చెబుతున్నారు?

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)

బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆరోపణలు చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీని కలిసి రేవంత్ రెడ్డి అంతులేని అబద్దాలు చెప్పారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయం పడిపోవడానికి ప్రధాన కారణం హైడ్ర అన్నారు. మోడీ డైరెక్షన్‌లో రేవంత్ పనిచేస్తున్నారు. ప్రతీ విషయంలో బీజేపీతో రేవంత్ కలిసి పనిచేస్తున్నారని కవిత వెల్లడించారు. ప్రధానిని కలిసిన తర్వాత కేసీఆర్, కేటీఆర్ లపై కేసులు పెడుతామని రేవంత్ అంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య భాగస్వామ్యం ఉంది కాబట్టే తాము వాస్తవాలు బయటపెట్టగానే బీజేపీ నాయకులు మమ్మల్నే విమర్శిస్తున్నారని తెలిపారు.

బీజేపీ – కాంగ్రెస్ మధ్య దోస్తీ బట్టబయలైంది..

రేవంత్ రెడ్డి నిన్న ప్రధానిని కలిసిన తర్వాత కేసీఆర్, కేటీఆర్ పై కేసులు పెడుతామని అంటున్నాడు అంటే బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేయడమే తప్పా ఇంకో ఆలోచన లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ. 6500 కోట్ల వడ్డీ కడుతున్నామని అబద్దాలు చెబుతుంది, కానీ కాగ్ నివేదిక ప్రకారం ఏ నెల కూడా రూ. 2600 కోట్లకు మించి వడ్డీ కట్టలేదని తెలింది. 6500 కోట్లు కడుతున్నామని రేవంత్ ఎందుకు అబద్దాలు చెబుతున్నారు? అబద్దాలు పదేపదే చెబితే నిజమవుతాయేమోనన్న భ్రమలో రేవంత్ రెడ్డి ఉన్నాడని కవిత ఎద్దేవా చేశారు. మరి ఈ అబద్ధపు లెక్కలు ఎందుకు చెప్తున్నట్లు? ఎవరిని మభ్యపెట్టడానికి చెప్తున్నట్లు? అని కవిత ప్రశ్నించారు.

## గాంధీభవన్‌లో ఇకపై కనిపించని ఫ్లెక్సీలు, బ్యానర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)




తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల నూతన బాధ్యురాలుగా మీనాక్షి నటరాజ్‌ను ఆ పార్టీ అధిష్ఠానం ఇటీవల నియమించింది. ఆమె శుక్రవారం అంటే ఫిబ్రవరి 28వ తేదీన హైదరాబాద్ రానున్నారు. అలాంటి వేళ.. కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఇకపై బ్యానర్లు, కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని ఆ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను ఆదేశించింది.అయితే గాంధీ భవన్ ఆవరణలో పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీతోపాటు రాహుల్ గాంధఈ ఫొటోలు మాత్రమే ఉండాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గాంధీ భవన్ ఆవరణలో ఉన్న ఇతర నేతల ఫొటోలు, కటౌట్లను సిబ్బంది తొలగించారు. ఇక మీనాక్షి నటరాజన్ రాకతో గాంధీ భవన్ రూపు రేఖలు మారనున్నాయనే ఓ చర్చ సైతం ప్రారంభమైంది. మరోవైపు ఫిబ్రవరి 28వ తేదీన.. అంటే రేపు.. గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మీనాక్షి నటరాజన్ హాజరుకానున్నారు. అలాగే పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు సీనియర్లు సైతం హాజరు కానున్నారు.

## నూతన సాంకేతిక పరిజ్ఞానాలు రెండు వైపులా పదునున్న కత్తిలాంటివి : కేటీఆర్




బెంగళూరు : నూతన సాంకేతిక పరిజ్ఞానాలు రెండు వైపులా పదునున్న కత్తిలాంటివి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడుకోకుంటే భారీ విధ్వంసం జరిగే అవకాశం ఉంటుందన్నారు. డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయానికి వాడుకోవచ్చు, యుద్ధానికి వాడుకోవచ్చు నిర్ణయించుకోవాల్సింది మనమే అని పేర్కొన్నారు. అందరికీ సాంకేతిక అక్షరాస్యత (డిజిటల్ లిటరసీ) లేకుంటే అందరికీ సమాన అవకాశాలు అందించలేమని తెలిపారు. దేశంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ జూదం ఘోరాలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు. కేవలం కాలర్ ట్యూన్ పెట్టి వీటిని అరికట్టలేం అని కేటీఆర్ స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఎంట్రప్రెన్యూర్ టెక్ అండ్ ఇన్నోవేషన్ సమిట్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. టెక్నాలజీ ప్రపంచాన్ని మలచడంలో ఉన్న అవకాశాలను వినియోగించుకునే విధంగా నూతన ఆవిష్కరణలు సాగాలని, సాంకేతికత అభివృద్ధి కావాలి, కానీ అది సమాజానికి మేలు చేయాలి. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, కానీ ప్రతి సాంకేతిక ఆవిష్కరణ వెనుక మానవ అవసరాలు, నైతిక విలువలు నిలకడగా ఉండాలి. ఆర్టిఫిషీయల్ జనరల్ ఇంటెలిజెన్స్ , క్వాంటమ్ కంప్యూటింగ్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ , ఇంటర్నెట్ ఆఫ్ బాడీస్ వంటి సాంకేతిక పరిణామాలు

తరువాయి 2వ పేజీలో

# ప్రతిజ్ఞకు న్యాయం చేయండి

మొదటి పేజీ తరువాయి...

నిజాలు చెరిపేయొద్దని, డాక్యుమెంట్లను దాచి పెట్టొద్దని సూచిస్తూనే.. చేసిన ప్రతిజ్ఞకు న్యాయం చేయాలని పేర్కొంది. ఇంజినీర్లు పలు డాక్యుమెంట్లు దాచారంటూ కమిషన్ కామెంట్ చేసింది. డిజైన్స్, డిపిఆర్, నిర్మాణ సంస్థకు ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందాలపై ప్రధానంగా ప్రశ్నించింది. అన్నారం సుందిళ్ల లొకేషన్లను ఎవరెవరి ఆదేశాల మేరకు మార్చారన్న కమిషన్ ప్రశ్నకు అప్పటి సీఎం కేసీఆర్, ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు ఆదేశాల మేరకే మార్చినట్టు చెప్పారు. బ్యారేజీల్లో నీళ్లు నింపాలని ఎవరు ఆదేశించారన్న ప్రశ్నకు కూడా ఆ ఇద్దరి పేరే సమాధానంగా చెప్పారు. ఈ ఎన్సీ మురళీధర్ రావు పలు ప్రశ్నలకు మౌనంగా ఉండటం, గుర్తుకు లేదని చెప్పడం గమనార్హం. డిపిఆర్ తయారీలో వ్యాప్ కాన్ సంస్థకు పనులు అలాట్ చేయాలని ఎవరు ఆదేశించారని అడుగగా.. గత ప్రభుత్వ పెద్దలేనంటూ సమాధానం వచ్చింది.



**తికమక.. మౌనం**

కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఈఎన్సీలు కొన్ని సందర్భాల్లో తికమక పడ్డారు. కొన్ని ప్రశ్నలకు మౌనం వహించారు. మూడు బ్యారేజీల కాస్ట్ ఎంత? అని ప్రశ్నించగా 9 వేల కోట్లు అని ఈఎన్సీలు సమాధానం చెప్పారు. దీనికి కమిషన్ డాక్యుమెంట్లు చూపుతూ.. కాదు 13 వేల కోట్లని చెప్పింది. జీవో నెంబర్ 28 పై ప్రశ్నించగా నలుగురు ఈ ఎన్సీలు మౌనం వహించారు. ప్రజల డబ్బులు వృథా అయ్యాయని మీరు భావిస్తున్నారా..? అన్న ప్రశ్నకూ ఎలాంటి సమాధానం రాలేదు.



# మహాయజ్ఞం దిగ్విజయం

మొదటి పేజీ తరువాయి...

ప్రజల భక్తి, ఐక్యత, సామరస్యాల సంగమంగా నిలిచిన ఈ వేడుకకు త్రివేణి సంగమం సాక్షిగా నిలిచింది. 45 రోజులపాటు జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్మాత్మిక వేడుకలో దాదాపు 66 కోట్ల మందికిపైగా భక్తులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఈ మహాకుంభమేళాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తాజాగా స్పందించారు. ఐక్యత కోసం జరిగిన ఈ మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసిందన్నారు.

భారతీయ ఐక్యతకు ఈ కుంభమేళా నిదర్శనంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించినట్లు చెప్పారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఎలాంటి ఆటంకాలూ లేకుండా విజయవంతంగా నిర్వహించడం అంత సులువు కాదన్నారు. అన్నిటినీ దాటుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, ప్రజలకు ఈ సందర్భంగా ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని గంగా, యమునా, సరస్వతి మాతాలను ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. అంతేకాదు ఏర్పాట్ల విషయం లోపాలున్నా, భక్తులెవరైనా అసౌకర్యానికి గురైనా అందుకు క్షమించాలని ప్రధాని కోరారు.

కాగా, జనవరి 13న ప్రారంభమై 45 రోజుల పాటు జరిగిన ఈ మేళాలో 66.21 కోట్ల మందికి పైగా పాల్గొని పుణ్య స్నానాలు చేశారు. ఇక ఆఖరి రోజు 1.44 కోట్ల మందికి పైగా భక్తులు హాజరైనట్టు అంచనా. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా ఇది రికార్డులకెక్కింది. దేశ, విదేశీ ప్రముఖులు ఈ కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేశారు. ఈ కుంభమేళాకు ప్రత్యక్షంగా హాజరు కాని భక్తులకు డిజిటల్ ఫొటో స్నానం చేయించడం విశేషం.

## మాదిగ అమరవీరుల త్యాగాల గుర్తుగా

# స్థూపాన్ని నిర్మించాలి




-మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా, గ్రామ మండల, జిల్లా, కేంద్రాలలో నిర్వహించాలని పిలుపు,

-హైదరాబాద్ సమీపంలో 5 ఎకరాలలో స్థలంలో మాదిగ అమరవీరుల గుర్తుగా ఒక మ్యూజియం నిర్మించాలి. -ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ.

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)

మాదిగ అమరవీరుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఫిబ్రవరి 11వ తేదీన రాతపూర్వకంగా ప్రభుత్వానికి సమర్పించడం జరిగింది. షమిము అక్తర్ కమిషన్ నివేదికలో లోపాలను సవరించాలి. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతలో లోపాలను సవరించి, ఎస్సీలను ఏబిసిడిలుగా గుర్తించాలి .అభివృద్ధి చెందని కులాలకు మొదటి ప్రాధాన్య ఇవ్వాలి డిమాండ్ . మార్చి 3 నుండి 10 వరకు మండల, నియోజకవర్గం, జిల్లా, కేంద్రాలలో డప్పుల ప్రదర్శన కళాకారులతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలి. మంత్రివర్గ విస్తరణ జరిపి మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలి డిమాండ్...10తేదీలోపు ఎస్సీలనుగా ఏ బి సి డి లుగా గ్రూపులుగా విభజించకుండా లోపాలను సవరించకుండా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తే 11వ తేదీ, నుంచి ఎమ్మార్పీఎస్, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం అని మంద కృష్ణ మాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, గోవిందు నరేష్ మాదిగ,మాదిగ ఎంఎస్పి, రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజన్ వెంకటస్వామి ,ఎమ్మార్పీఎస్, జాతియ అధికార ప్రతినిధి బోర్ర బిక్షపతి మాదిగ , కవి, రచయిత,మచ్చదేవేందర్ మాదిగ,హెూలియో దాసరి,హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జహంగీర్ ,హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్హోలియో దాసరి, ఎంఎస్పి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహా మాదిగ మాదిగ ఎంఎస్పి, హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్, మంథని సామెల్ మాదిగ ఎంఎస్పి, రాష్ట్ర నాయకులు, దుప్పల్లి అనీల్ మాదిగ ఎమ్మార్పీఎస్, రాష్ట్ర కార్యదర్శి,మునిరతి అరుణ్ మాదిగ ఎంఎస్పి, రాష్ట్ర నాయకులు, ఇటికే శ్రీకిషన్ మాదిగ ఎంఎస్పి,జిల్లా నాయకులు,కోద్రుపల్లి శివ మాదిగ ఎంఎస్పి,జిల్లా నాయకులుసురారం సుజాత మాదిగ , ఎం ఎం ఎస్, జిల్లా నాయకురాలు,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ, హైదరాబాద్ రైజింగ్.. ఇక ఆగదు

మొదటి పేజీ తరువాయి...

ఇక ఆగదు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ మాదాపూర్‌లో హెచ్‌సీఎల్ టెక్స్ గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను ముఖ్యమంత్రి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ప్రస్తుతం హైదరాబాద్, తెలంగాణ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా, రాష్ట్రంగా మారిందని చెప్పారు. హైదరాబాద్ పోటీ.. ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగుళూరు నగరాలతో కాదని, ప్రపంచ స్థాయి నగరాలతో తమ పోటీ అని అన్నప్పుడు అదో పెద్ద కలగా అభివర్ణించారు. కానీ ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్న తీరు నంబర్ 1 గా నిలిచినప్పుడు, రాష్ట్రాన్ని డేటా సెంటర్ల హబ్‌గా, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్, స్కిల్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ రంగాల్లో తెలంగాణను మార్గదర్శిగా మార్చినప్పుడు ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. బహుళజాతి కంపెనీలతో ప్రతి రోజూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం లేదా పెద్ద పెద్ద సంస్థలు హైదరాబాద్ కు రావడం లేదా గతేడాది కుదుర్చుకున్న ఎంఓయూల మేరకు సరికొత్త సౌకర్యాలతో సిద్ధమైన ఫెసిలిటీ సెంటర్లను ప్రారంభించడం గర్వకారణంగా ఉందన్నారు. కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణ అంతర్జాతీయ, దేశీయ అత్యధిక పెట్టుబడులను ఆకర్షించి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను ముందుగా అందిపుచ్చుకున్నాం. పైగా రాష్ట్రంలో తక్కువ ద్రవ్యోల్బణాన్ని కాపాడుకున్నామని తెలిపారు. తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన రాష్ట్రంగా మార్చుతామని చెప్పినప్పుడు కొందరు సాధ్యం కాదన్నారు. కేవలం దావోస్ లో జరిపిన రెండు వ్యాపార పర్యటనల్లో 40 వేల కోట్ల రూపాయల విలువైన ఒప్పందాలు, 1.78 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించా మని సూచించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ లైఫ్ సైన్సెస్ సంస్థల్లో ఒకటైన ఆమ్ జెన్ ను హైదరాబాద్‌కు ఆహ్వానించామన్నారు. ప్రపంచంలోనే అత్తుత్తమ జీవ వైవిధ్య సదస్సుల్లో ఒకటైన బయో ఆసియా-2025 ను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఇప్పుడు హెచ్‌సీఎల్ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. 60 దేశాల్లో డిజిటల్, ఇంజనీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో 2.2 లక్షల మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ దేశ గౌరవాన్ని పెంచిందన్నారు. 2007 లో హైదరాబాద్‌లో తొలిసారి ప్రారంభమైనప్పటి నుంచి అభివృద్ధి సాధిస్తూ ప్రస్తుతం 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 5 వేల మంది ఉద్యోగులతో ప్రపంచస్థాయి సరికొత్త సదుపాయాలతో హైదరాబాద్ హెచ్‌ఎసీఎల్ అద్భుతమైన విజయాలను సాధించబోతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎల్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సి. విజయ్ కుమార్, సీవీపీ, డిజిటల్ బిజినెస్ గ్లోబల్ హెడ్ పవన్ వాడపల్లి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# నూతన సాంకేతిక పరిజ్ఞానాలు రెండు వైపులా పదునున్న కత్తిలాంటివి : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి...

ప్రపంచాన్ని మార్చగలవని కేటీఆర్ తెలిపారు.

రేడియోలు మాయమయ్యాయి, టీవీలు వచ్చాయి, ఇప్పుడు పాడ్‌కాస్టుల హవా. ఫార్మాట్ మారుతుండొచ్చు, కానీ మానవ అవసరాలు ఎప్పటికీ మారవు. సాంకేతికతను బాధ్యతగా ఉపయోగించకపోతే అది ప్రమాదకరమవుతుంది. భవిష్యత్తు నిర్మాణం అంటే కేవలం రేపటి రోజుల్లో జీవించడం కాదు.. రేపటిని నిర్మించడం. ఇదే స్ఫూర్తితో సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని టెక్నాలజీ అభివృద్ధి జరగాలి. డ్రోన్స్ వ్యవసాయాన్ని సమర్థవంతంగా మార్చగలవు.. అదే డ్రోన్స్ విధ్వంసానికి ఉపయోగిస్తే అది ప్రమాదకరం. అందుకే ప్రతి టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది అని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితంతో పెనువేసుకుంటున్న కొద్దీ.. సాంకేతిక ప్రగతి పెరుగుతున్న కొద్దీ.. సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. టెక్నాలజీ సామర్థ్యం అధికంగా ఉన్న యువత సైబర్ నేరాలకు ఎందుకు పాల్పడుతున్నారో ఆలోచించాలి. సైబర్ నేరాలపైన కేవలం ఒక కాలర్ ట్యూన్ పెట్టి ఆపలేము. అంతేకాక, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వలన జరుగుతున్న దుష్పరిణామాలను ఆపడం ప్రభుత్వాలు నడిపే వారికి పెద్ద సవాలుగా మారిందని కేటీఆర్ అన్నారు.

సాంకేతిక అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ అంశాన్ని అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి రోజూ భారీ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వాటి విద్యుత్, వాటర్ వినియోగంపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. అంతేకాక, టెక్నాలజీ వల్ల పర్యావరణంపై కలిగే ప్రభావం గురించి తగిన అధ్యయనం లేకుండా ముందుకు వెళితే భవిష్యత్తు ఇబ్బందికరంగా మారుతుంది. ఐఓటీ, మొబైల్ యాప్‌లు, డేటా స్టోరేజ్ ఇవన్నీ పెరుగుతున్నాయి. కానీ, అవి ఎంతగా పర్యావరణ భంగాన్ని కలిగిస్తున్నాయో ఆలోచించాలి. ప్రస్తుతం తమ మాతృభాషల పట్ల జరుగుతున్న వివక్ష గురించి మాత్రమే కాకుండా టెక్నాలజీ తెలిసినవారు టెక్నాలజీ తెలవని వారు అని సమాజంలో ఏర్పడుతున్న సరికొత్త విభజనపైన దృష్టి సారించాలి. టెక్నాలజీ నిరక్షరాస్యత ఉన్న జనాభాకి ఏ విధంగా సహాయం చేయాలో ఆలోచించాలి. డిజిటల్ విభజన పెరుగుతున్నకొద్దీ సమాజంలో మరింత విభజన వస్తుంది.. టెక్నాలజీ అందరికీ సమానంగా అందినప్పుడే సమాన అవకాశాలు ఏర్పడతాయని కేటీఆర్ తెలిపారు.

# 11మంది రాజకీయ ఖైదీలతో జరిగిన సంభాషణ పుస్తకావిష్కరణ.

ముంబై,(ప్రజా కలం ప్రతినిధి) ఫిబ్రవరి 27:

గొప్ప రచయిత నీతా కోహ్లాట్కర్ రచించిన THE Feared: Conversations With 11 Political Prisoners (భయం: పదకొండు మంది రాజకీయ ఖైదీలతో జరిగిన సంభాషణ) అనే పుస్తకావిష్కరణ గురువారం ముంబైలోని ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణ, సీనియర్ న్యాయవాది ఆస్పీ చినోయ్, నాటక రచయిత, దర్శకుడు రాము రాంనాథ్ హాజరై మాట్లాడారు. సభకు వ్యాఖ్యాతగా సనోబర్ కేశ్వర్ చేశారు. మహారాష్ట్ర భీమ కోరేగావ్ ఘటనలో అరెస్టయిన అనేక మందిలోని 11మంది ఖైదీల సంభాషణను పుస్తక రూపంలో తీశారు. ఈ సందర్భంగా రచయిత నీతా మాట్లాడుతూ ఖైదీలు జైలులో మొదటి రాత్రి నుంచి వారి అత్యంత కష్టతరమైన జీవనం ప్రారంభం మౌతుందని "ది ఫియర్డ్ :11మంది





రాజకీయ ఖైదీలతో కొన్ని సందర్భాల్లో వారి ప్రియమైన వారితో చేసిన ఇంటర్వ్యూలను ఒకచోట చేర్చాననిన్నారు. ఐతే ఇందులో ఆమె దేశమంతట పలు జైళ్ల గోడల మధ్య ఇంటర్వ్యూ చేసిన వారి రోజువారీ జీవితాలను హైలైట్ చేశారు. భారతీయ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న వేలాది మంది అండర్ ట్రయల్‌కు గురై తీవ్ర అన్యాయానికి గురైన దాఖలాలు న్నాయన్నారు. ఈరోజు దేశ రాజకీయ జీవితంలో "ప్రజల అసమ్మతి"ని అణచివేయడంపై తక్షణ దృష్టి పెట్టాలని వక్తలు కోరారు. జైలు ఖైదీలు అనుభవించిన స్థలం, పరిశుభ్రత, వైద్యం, కనీస హక్కుల లేమి, ఆహారానికి సంబంధించిన దౌర్భాగ్య పరిస్థితులను బయటకు తీసిన ఆమెను కొనియాడారు. మరోవైపు జర్మనీ నాజి హిట్లర్ వ్యవహరించిన తీరు నేడు మన దేశ రాజకీయ ఖైదీలపై, సామాన్య జనంపై రాజ్యం క్రూరంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. ఈ పుస్తకం ద్వారా నేర్చుకునేది పీడిత జనం అసమ్మతి వ్యక్తపర్చాలి, అన్యాయానికి విరుద్ధంగా నిలబడాలాంటూ మేధావులు వెల్లడించారు.

## జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) ఫిబ్రవరి 27:

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు కాలనీలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ 12.5 MVA కారణంగా D2 సెక్షన్‌లో పవర్ కట్ D2 సెక్షన్‌లో 8.0 MVA ప్రాంతం స్థానంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఎరేక్షన్ చేయబడుతున్న నేపథ్యంలో ఉదయం 8.-గం.ల నుండి రాత్రి 7.-గం.ల వరకు 1) ఖలీల్ వాడి,2) గాంధీచౌక్,3) కుమార్‌గల్లి,4) ఆజం రోడ్డు,5) హతిగల్లీ,6) ఖాసబ్‌గల్లీ,7) పోచమ్మగల్లి,8) upparthekdi,9) చీర్ హన్మాన్,10) వీక్లీ బజార్,11) ఎల్లమ్మ గుట్ట, 12) పోలీసు లేన్,13) ప్రగతి నగర్,14) RP రోడ్డు, లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. వేసవి కాలం యాక్షన్ ప్లాన్ ప్రోగ్రామ్ లో భాగంగా విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకునెందుకు నూతన ట్రాన్స్ ఫార్మర్ల బిగిస్తున్నట్లు పేర్కొన్నారు.



## టన్నెల్ ప్రమాదానికి కారణం

# బాధ్యత రాహిత్యమే

మొదటి పేజీ తరువాయి...

మంత్రుల మాటలకి చేతలకి పొంతన లేకుండా ఉందని మండిపడ్డారు. గత పదేళ్ల కాలంలో ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేసేందుకు 3900 కోట్లు ఖర్చు చేసి కరోనా తీవ్రత వల్ల 12 కిలోమీటర్లు సొరంగాన్ని తవ్వినట్లు గుర్తు చేశారు. సొరంగం కుప్పకూలి 8 మంది కార్మికులు చిక్కుకున్నప్పటికీ కార్మికుల ప్రాణాల మీద ధ్యాస పెట్టకుండా ఎన్నికలపైనే శ్రద్ధ చూపడం దుర్మార్గమన్నారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించకుండా కనీసం సమీక్ష కూడా జరపకపోవడం బాధ్యత రాహిత్యం కాదా అని ప్రశ్నించారు. రోజురోజుకు శ్రీశైలంలో నీటి మట్టం తగ్గుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల ఆంతర్యమేంటో చెప్పాలన్నారు. ప్రాజెక్టు తిరిగి ప్రారంభించే క్రమంలో జాగ్రత్త చర్యలు చేపట్టలేదని అందులో భాగంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ప్రమాదం జరిగి ఆరు రోజులు అవుతున్న ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదని ఇప్పటికీ ఎన్ని రోజులు అవుతుందో కూడా స్పష్టత లేదని మండిపడ్డారు ప్రమాదం జరిగినప్పటికీ కార్మికులను కాపాడాలన్న లక్ష్యం పెట్టుకోలేదని ఇప్పటికైనా వేగంగా జాగ్రత్తగా పనులు పూర్తి చేసి కార్మికులను కాపాడాలని డిమాండ్ చేశారు అనంతరం క్యాంప్ కార్యాలయంలోనే ఉన్న మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కాల్చేందుకు అనుమతి ఇవ్వాలని ప్రయత్నించడంతో పోలీసులు వారిని నిలువరించారు. దీంతో కొద్దిసేపు ఇక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

# పోలింగ్ ముగిసింది.. గెలిచేదెవరు.?

మొదటి పేజీ తరువాయి...

ఈ ఇద్దరూ విజయంపై ధీమాగా ఉన్నారు. పార్టీ కేడర్‌తో పాటు ఆర్థికంగా బలవంతులు కావడంతో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండటం తమకు కలిసొస్తుందని బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉండటం తమకు కలిసొస్తుందని కాంగ్రెస్ అంచనా వేస్తున్నాయి. అదే సమయంలో బీఎస్పీ మద్దతుతో పోటీలో ఉన్న ప్రసన్న హరికృష్ణ సైతం పట్టభద్రులు తనను గెలిపిస్తారనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ ముగిసినప్పటికీ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్లు ఎవరివైపు మొగ్గుచూపారనేది ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. తుది ఫలితం ఎలాఉన్నా.. మొదటి మూడు స్థానాల్లో మాత్రం నరేందర్ రెడ్డి, అంజిరెడ్డి, ప్రసన్న హరికృష్ణ నిలిచే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ ముగ్గురిలో రెండు, మూడు ప్రాధాన్యత ఓట్లు అధికంగా పొందిన అభ్యర్థి విజయం సాధించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు ఈ ఎన్నికల్లో బీసీ వాదం గట్టిగా వినిపించింది. బీసీ సామాజికవర్గానికి చెందిన పట్టభద్రులు తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని డిసైడ్ అయితే మాత్రం ప్రసన్న హరికృష్ణ మొదటి లేదా రెండో ప్రాధాన్యత ఓటుతో గెలిచే అవకాశం ఉంది. కాంగ్రెస్ టికెట్ ఆశించి.. టికెట్ రాకపోవడంతో బీఎస్పీ నుంచి బరిలోకి దిగిన ప్రసన్న హరికృష్ణ వైపు పట్టభద్రులు మొగ్గుచూపారనే ప్రచారం ఎక్కువుగా జరుగుతోంది. ప్రధానపోటీ మాత్రం బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, ప్రసన్న హరికృష్ణ మధ్య ఉండొచ్చని, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి మూడోస్థానానికి పరిమితమయ్యే ఛాన్స్ ఉందనే చర్చ జరుగుతోంది.

**రెండో ప్రాధాన్యత ఓటుతో..**

ప్రసన్న హరికృష్ణ ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ సానుభూతిపరుడిగా ఉన్నారు. ఎన్నికల్లో గెలిస్తే ఆయన అధికారపార్టీ వైపే ఉంటారనే ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లో కొందరు ప్రసన్న హరికృష్ణకు లోపాయికారిగా సహకరించారనే ప్రచారం జరిగింది. దీంతో నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన కాంగ్రెస్ సానుభూతిపరులు తప్పకుండా రెండో ప్రాధాన్యత ఓటును ప్రసన్న హరికృష్ణకు వేసే అవకాశం ఉంది. అలాగే అంజిరెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసిన ఓటర్లు రెండో ప్రాధాన్యత ఓటును ప్రసన్న హరికృష్ణకు వేయడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ నుంచి పోటీచేస్తున్న శేఖర్ రావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన ఓటర్లలో ఎక్కువమంది ప్రసన్న హరికృష్ణకు రెండో ప్రాధాన్యత ఇచ్చే ఛాన్స్ ఉంది. దీంతో రెండో ప్రాధాన్యత ఓటుతో ప్రసన్న హరికృష్ణ గెలుస్తారనే ప్రచారం గట్టిగా వినిపిస్తోంది.

# ముఖ్యమంత్రికి కేంద్రమంత్రి సవాల్

మొదటి పేజీ తరువాయి...

"కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన విధానం, విధానం ప్రకారం పనిచేస్తుంది. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నాడు. బెదిరింపుదారుడిగా వ్యవహరిస్తున్నాడు" అని కిషన్ రెడ్డి ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో అన్నారు. బుధవారం దేశ రాజధానిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సమావేశమైన తర్వాత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం ఇవ్వకుండా కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. "హైదరాబాద్ మెట్రో రైలు రెండవ దశ ప్రాజెక్టు ను క్యాబినెట్‌కు వెళ్లనివ్వలేదు. రేవంత్ రెడ్డికి క్రెడిట్ వస్తుందని భావించి ఆయన ఇలా చేశారు. నాకు రాష్ట్ర ప్రయోజనాల కంటే క్రెడిట్ ముఖ్యం కాదు. కిషన్ రెడ్డి కోరుకుంటే, ఆయన ప్రాజెక్టులకు అనుమతులు, రాష్ట్రానికి నిధులు పొంది క్రెడిట్ పొందవచ్చు" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఐదు ప్రాజెక్టులను పూర్తి చేయడంలో సహకరించాలని ప్రధానమంత్రిని అభ్యర్థించినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేంద్ర మంత్రులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ఈ ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు పొందాలని లేదా గుజరాత్ లేదా మరేదైనా రాష్ట్రానికి మారాలని కూడా రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.



గళం మీది కలం మాది

మీ ప్రాంతంలో ఏ సమస్యనైనా పరిష్కరించడానికి 'ప్రజాకలం' మీకు తోడుగా ఉంటుంది. మీ సమస్యల వివరాలను, పోటోలను మాకు వాట్సప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

జగిత్యాల: 94403 52123
పెద్దపల్లి :9849007793,9121348522
మెట్‌పల్లి : 95535 39999
రుద్రంగి : 86888 05981
బుగ్గారం : 99897 94948
గోదావరిఖని : 99899 35750
సిరిసిల్ల : 9014368563

◆ కరీంనగర్ ◆ జగిత్యాల ◆ పెద్దపల్లి ◆





ప్రజాకలం




# జిల్లా పరిధిలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

## - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్



జగిత్యాల క్రైమ్, ఫిబ్రవరి 27 (ప్రజాకలం ప్రతినిధి) : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నట్లుగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు మరియు ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారుల కు మరియు సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి ఇన్స్పెక్టర్ అరిఫ్ అలీ ఖన్, టౌన్ ఇన్స్పెక్టర్‌లు వేణు గోపాల్, కృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా రథోత్సవ వేడుకలు



గొల్లపెల్లి ఫిబ్రవరి 27 ప్రజాకలం ప్రతినిధి గొల్లపెల్లి మండలంలోని లోత్తునూర్ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా గురువారం రోజున రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుండే ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నరసింగోజు సాయి చరణ్ చారి ఆధ్వర్యంలో రాజరాజేశ్వర స్వామి విగ్రహ ఉత్సవ మూర్తులను రథం పై ఊరేగింపు నిర్వహించారు. శివ



స్వాములు భక్తి పాటలతో భక్తులతో కలసి రథాన్ని లాగుతూ ముందుకుసాగారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు భక్తులకు రేగొండ కళావతి – వైకుంఠం వారి కుమారులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోనాల రత్నయ్యా,రేగొండ సత్యనారాయణ,పుట్టాపాక సత్యం, పొన్నం స్వామిగౌడ్, ఎన్ లక్ష్మీకాంతం,చిరుత తిరుపతి,శేఖర్, శ్రీనివాస్,తిరుపతి ,తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన చిట్నేని రఘు

మెట్ పల్లి: ప్రతినిధి ఫిబ్రవరి 27 (ప్రజా కలం)పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ – 2025ను మెట్ పల్లి డివిజన్ కేంద్రంలో గురువారం బీజేపీ సీనియర్ నేత డాక్టర్ చిట్నేని రఘు పరిశీలించారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మెట్ పల్లి డివిజన్ కేంద్రంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్




కేంద్రాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను పూర్తి చేసేలా పోలీసు అధికారులు అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. అనంతరం మెట్ పల్లి డీఎస్పీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో బీజేపీ సీనియర్ నేత డాక్టర్ చిట్నేని రఘు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధమని పేర్కొన్నారు. అర్హులై ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతీ ఒక్క పట్టభద్రులు తమ విలువైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా కన్వీనర్ ఒడ్డేపల్లి శ్రీనివాస్, కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ దొనికెల నవీన్, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్ రెడ్డి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ చెట్లపల్లి మీనా సుకెందర్ గౌడ్, నాయకులు డాక్టర్ వెంకట్ రెడ్డి, మిట్టపల్లి కృష్ణమూర్తి, బొడ్ల రమేశ్, సుంకెట విజయ్, రాజ్ పాల్, 15వ వార్డు బీజేపీ ఇంఛార్జి అరిగేల రాకేశ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా రథోత్సవం

బుగ్గారం ప్రజాకలం ప్రతినిధి ఫిబ్రవరి 27:
బుగ్గారం మండల కేంద్రంలోని సాంబుని గుట్ట వద్ద గల సంతాన సాఫల్య శ్రీ సాంబ శివ నాగేశ్వర ఆలయంలో గురువారం రోజున అంగరంగ వైభవంగా రథోత్సవం జరిగింది. మండలం తో పాటు వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వివిధ పార్టీల నాయకులు, స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మణ్ కుమార్ తో పాటు కాంగ్రెస్ పార్టీ, వివిధ పార్టీల ప్రముఖులను, నేతలను సత్కరించారు. హమాలీ సంఘం ఆధ్వర్యంలో చేసిన రుచి కరమైన వంటకాలతో భక్తులకు, శివ దీక్షా స్వాములకు అన్నదానం చేశారు. ఒగ్గు కళాకారులు తమదైన శైలిలో నృత్య – కలా ప్రదర్శణలు నిర్వహించారు. శివ శక్తులు, శివ దీక్షా పరులు శివ తాండవంతో ఆలయం చుట్టూ రథాన్ని తిప్పుతూ భక్తులను ఎంతగానో ఆకట్టు కున్నారు. వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన ఆధ్యాత్మిక ప్రముఖులు, భక్తులు స్వామి వారిని దర్శించు కొని మొక్కులు



తీర్చుకున్నారు. చిన్నారులు, మహిళలు, భక్తులు స్వయంగా స్వ హస్తములచే స్వామి వారి రథాన్ని లాగి సంతృప్తి చెందారు. కాగా బుధ వారం రాత్రి శివ పార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ అధ్యక్షులు మాసర్తి రాజిరెడ్డి, కోశాధికారి కట్కూరి ఆంజినేయులు, కమిటీ సభ్యులు కొత్తపేల్లి గంగాధర్, పొలంపెల్లి మల్లేశం, శివ దీక్ష స్వాములు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ దే విజయం

- కుట్రలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్ - డబ్బులు పంచినా కాంగ్రెసును నమ్మని ఓటర్లు
- బీజేపీ కార్యకర్తలపై దాడులను ఖండిస్తున్నాం - పోలీసుల ఏకపక్ష వైఖరి ఆక్షేపణీయం
- మూడు స్థానాల్లో విజయం కమలానిదే - బీజేపీ నేతలు గోమాసే శ్రీనివాస్,దుగ్యాల ప్రదీప్ కుమార్



పెద్దపల్లి,ఫిబ్రవరి27:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)
కుట్రలు చేయడంలో,మోసానికి పాల్పడటంలో, దగాకు దిగడంలో కాంగ్రెసును మించిన పార్టీ మరొకటి లేదని భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పార్లమెంటు కంటెస్టెడ్ నేత గోమాసే శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ తో కలిసి మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన రెండు పట్టాభద్రులు,ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తూ కాంగ్రెస్ పార్టీ డబ్బులు పంచినప్పటికీ, పట్టాభద్రుల ఓటర్లు ఆ పార్టీని తిరస్కరించారని ఎద్దేవా చేశారు. డబ్బులతో ఎన్నికల్లో గెలవాలని చూసిన కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టారని సెటైర్లు వేశారు.

**రేవంత్ సర్కారుపై వ్యతిరేకత**

420 హామీలు,ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని,కానీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలం అయ్యిందని ఇరువురు మండిపడ్డారు. 12యేళ్ళ క్రితం దేశంలో ప్రధాని నరేంద్రమోదీ ద్వారా అభివృద్ధి శకం మొదలయ్యిందన్న ఆయన,మోదీ పాలనతో రేవంత్ రెడ్డి సర్కారు పాలనను ప్రజలు పోల్చి చూస్తున్నారని పేర్కొన్నారు. రూ. 12లక్షల 70వేల వరకు ఆదాయపు పన్ను నుండి మినహాయింపు నుండి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ఒక మైలురాయిగా వారు స్పష్టం చేశారు.

**జైళ్ళపాలయ్యింది బీజేపీ కార్యకర్తలే**

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యల పట్ల నిజాయతిగా ఉద్యమాలు చేసింది భారతీయ జనతా పార్టీ కార్యకర్తలేనని,ఉద్యమాల్లో భాగంగా అనేకమంది కార్యకర్తలను పోలీసులు హింసించి,కేసులు పెట్టి జైళ్ళకు పంపించారని గుర్తు చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకొని చేసే అరాచకాలకు బీజేపీ కార్యకర్తలు భయపడరని, ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాలో పోలీసులు చేసిన ఓవర్ యాక్షనుకు ప్రతిఘటన తప్పదని వారు హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తమకు ఓటు వేసిన ఓటర్లకు,సహకరించిన అభిమానులకు,కష్టపడ్డ పార్టీ నాయకులకు,కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఆరుముళ్ళ పోషం,శిలారపు పర్వతాలు,మేకల శ్రీనివాస్,కావేటి రాజగోపాల్,తంగెడ రాజేశ్వరరావు,వేల్పుల రమేష్, ఎర్రోళ్ళ శ్రీకాంత్,ఉప్పు కిరణ్,రాకేష్ పెంజర్ల,ఈర్ల శంకర్,పోల్సాని సంపత్ రావు,గాదాసి సతీష్,వొల్లె తిరుపతి,బొడ్డుపల్లి అంజి,తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఛత్రపతి శివాజీ యువసేన మహా శివరాత్రి జాగరణ ఉత్సవాలు

పెద్దపల్లి,ఫిబ్రవరి 27:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)
పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని అంగడి బజార్ సెంటర్లో ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మహా శివరాత్రి జాగరణ ఉత్సవాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. కమాన్పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలో నుండి మాత్రమే కాకుండా 8వ కాలని, గోదావరిఖని నుండి పాఠశాలల విద్యార్థుల నృత్యాలు, ఎగీతాలతో పాటు హైదరాబాద్ భక్తి సంగీత విభావరి బృందం శ్రీనివాస్ యాదవ్ పాడిన పాటలు, నరేష్ ఎంటర్టైలర్ మిమిక్రీ మ్యాజిక్,చిట్టిబాబు కామెడీ చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి,జాగరణ ఉత్సవమే కాకుండా,దేవి నవరాత్రులు,సేవా కార్యక్రమాలు,రక్తదానం,వేసవి కాలంలో చలి వేంద్రం, అంబలి పంపిణీ వంటి సామజిక సేవా కార్యక్రమలను గత 11సంవత్సరాలనుండి నిర్వహిస్తున్న కమాన్ పూర్ ఛత్రపతి శివాజీ యువసేన ఆదర్శంగా నిలుస్తుందని వక్తలు కొనియాడా రు. ఈ జాగరణ ఉత్సవాలను బుధవారం రాత్రి 8నుండి గురువారం తెల్లవార్లూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణ రెడ్డి, సదశయ ఫౌండేషన్ లింగ మూర్తి,బీసీ సంఘం జిల్లా



అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్,అన్ని రాజకీయ పార్టీల నాయకులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి,మచ్చగిరి రాము, గుర్రం లక్ష్మి మల్లు,గడప కృష్ణ మూర్తి,పీల్లి శేఖర్,నీలం సరిత శ్రీనివాస్,గండ్ల మోహన్, జంగపెల్లి అజయ్, మట్ట శంకర్,మల్లారపు అరుణ్,బంపెల్లి రాజయ్య, లాల్లు యూసఫ్,నిల రాజయ్య,కొంతం శ్రీనివాస్, ఛత్రపతి శివాజీ వ్యవస్థాపకులు జంగపెల్లి శ్రీనివాస్, అధ్యక్షుడు సతీష్,ఉపాధ్యక్షులు మోర ప్రశాంత్, నాయకులు రవి,శ్యామ్ లాల్,అనిల్,శ్రీనివాస్,రవి, పార్వతలు,సురేష్,అభి,వినీత్, కుమార్,సంతోష, శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఓసి చెక్ అందజేత..



మెట్ పల్లి: ప్రతినిధి ఫిబ్రవరి 27 (ప్రజా కలం) పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల పట్టణానికి చెందిన శనిగారపు శ్రీనివాస్ కు మంజూరైన రూ. 1,00,000 ఒక లక్ష విలువ గల ఎల్ ఓ సి చెక్కును గురువారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్. అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం కోసం అందిస్తున్న ఎల్ఓసి ఆర్థిక సాయం వరం లాంటివి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పేషెంట్ బంధువులు, స్థానిక నాయకులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు



భీమరం ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి) జగిత్యాల జిల్లా భీమరం మండల కేంద్రంలో పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్నరు యువతి ,యువకులు పట్టభద్రులు ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గ్రాడియట్స్ పట్టబద్రులకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు.

# ఘనంగా బుగ్గ రాజన్న జాతర మహోత్సవం

## పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ

రుద్రంగి, ఫిబ్రవరి 27, (ప్రజాకలం ప్రతినిధి)
రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో అడవిలో వెలసిన



శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రతియేటా నిర్వహించె మహాశివరాత్రిని పురష్కరించుకొని గురువారం జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఇట్టి మహోత్సవానికి ప్రభుత్వ విప్, ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చెల్మెడ లక్ష్మీనరసింహరావు లు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ఆలయ కమిటి ఆద్వర్యంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ.. బుగ్గ రాజరాజేశ్వర స్వామి అశీస్సులు ప్రజలపై ఉండాలని, అలాగే సకాలంలో పాడిపంటలు సంవృద్ధిగా పండాలని స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. జాతర మహోత్సవం ఘనంగా జరిపించిన ఆలయ కమిటికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చెర్మెన్ చెలుకల తిరుపతి, ఆలయ చెర్మెన్ లు కొమిరె శంకర్, పుట్కపు రాజిరెడ్డి, మాజీ ఎంపిపి గంగం స్వరూప మహేష్, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్ మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే



మెట్ పల్లి: ప్రతినిధి ఫిబ్రవరి 27 (ప్రజా కలం) పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం 233 పోలింగ్ స్టేషన్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగిచుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఏస్ పార్టీ అభ్యర్థి లేదని ప్రచారం కొనసాగుతుందని, కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపార్టీ అభ్యర్థి ఉండడన్నారు. ప్రచారంలో ఒకటి గమనించానట్లు, రెండు ప్రధాన పార్టీలు మోదీ ఏ కులం.., రాహుల్ గాంధీ ఏకులం పరస్పరం ఆడగుతున్నారన్నారు. బాధాకరం ఏమంటే ఇది పట్టభద్రుల ఎలక్షన్లో పట్టభద్రుల కు ఏంచేస్తాం వారి అభ్యున్నతికి,అభివృద్ధికి ఎం చేస్తాం అని చెప్పాల్సిన ప్రధాన పార్టీలు కనీసం దాని గురించి మాట్లాడకుండ కులాలు, మతాలు అనే పిచ్చి మాటలు మాట్లాడారని విమర్శించారు. పట్టబద్రులకు మన రాష్ట్రానికి అభివృద్ధి కి తోడ్పడే విధంగా ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే కోరారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎంపిపి దంపతులు

రుద్రంగి, పిబ్రవరి 27, (ప్రజాకలం ప్రతినిధి)పట్టబద్రుల ఎంఎల్సి ఎన్నికల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఓటింగ్ జరుగుతున్న నేపద్యంలో పట్టబద్రులు, మాజీ ఎంపిపి దంపతులు గంగం స్వరూప మహేష్ లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మాజీ ఎంపిపి మాట్లాడుతూ.. ఎటువంటి ఎన్నికలైన ఓటు వేయడం మన భాద్యత అని, ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది ఓ పెద్ద ఆయుదమని, అందరూ భాద్యతతో ఓటు వేస్తేనే చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి నాంది పలుకుతామని అన్నారు.



## ఒక్క నిమిషం లేటు అయినందున పోలింగ్ బూత్ లోకి అనుమతించని అధికారులు

ఎండపల్లి, ఫిబ్రవరి 27 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ ఎండపల్లి మండల కేంద్రం లో ఒక్క నిమిషం లేటు కావడంతో ఓటు వేయడానికి అధికారులు అనుమతించలేదని ఓటర్ తెలిపిన వివరాల ప్రకారం ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన భూసారపు రాజేశం నిజామాబాద్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులు నిర్వహిస్తారు ఎన్నికల సందర్భంగా ఓటు వేయడానికి నిజమాబాద్ నుంచి ఎండపల్లి చేరుకోగా ఒక నిమిషం ఆలస్యం కావడంతో ఓటు వేయడానికి అధికారులు అనుమతించలేదని అంత దూరం నుండి ఓటు వేయడానికి వచ్చిన ఫలితం లేదని భూసారపు రాజేశం తెలిపారు.




# ప్రజాకలం

◆ ఉమ్మడి కరీంనగర్ ◆

శుక్రవారం, ఫిబ్రవరి 28, 2025

కరీంనగర్ ◆ జగిత్యాల ◆ పెద్దపల్లి




## శివ కళ్యాణ మహోత్సవంలో చల్మెడ

మేడిపల్లి ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)



మేడిపల్లి మండలం తొం బరావుపేట్, పొరుమల్ల గ్రామాలలో శివ పార్వతుల కళ్యాణ మహోత్సవంలో బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు గారు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. వారి వెంట మాజీ జెడ్పీ చైర్పర్సన్ తుల ఉమ లక్ష్మరెడ్డి, తిరుపతిరెడ్డి, గంగారెడ్డి, నర్సారెడ్డి, మండల అధ్యక్షుడు క్యాతాం సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు అజిత్ రావు, రాజేశ్వర్ రెడ్డి, భూమారెడ్డి, మకిలి దాసు, రవీందర్రావు, దేశవేని కృష్ణ, మధు, సాయి యాదవ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

## అక్రమ ఇసుక రవాణా ఐదుగురుపై కేసు నమోదు

### - ఎస్సై దీకొండ రమేష్



ఓదెల,ఫిబ్రవరి 27:(ప్రజాకలం ప్రతినిధి) ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ ఉంచి అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్న దుండగులను బుధవారం రాత్రి పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ వారి ఇబ్బందితో కలిసి గుర్తించారు.గుంపుల భారత్ పెట్రోలియం బంక్ పక్కనగల రైస్ మిల్లు స్థలంలో అక్రమంగా ఇసుకను నిల్వ చేసి హైదరాబాద్ కు తరలించడానికి లోడ్ చేస్తుండగా ఒక కంటైనర్ లారీని,లోడర్ని సీజ్ చేయడం జరిగింది ఎస్సై తెలిపారు.నిల్వ చేసి ఉన్న దాదాపు 20 ట్రాక్టర్ల ఇసుక కొరకు ఓదెల తహసిల్దార్ కు సమాచారం ఇవ్వడం జరిగింది అన్నారు.నేరస్తులైన పెద్దిరెడ్డి జనార్దన్ రెడ్డి,మణిదీప్, పొన్నగంటి సురేష్,కోరి భాస్కర్,రాజన్ కుమార్ లు ఉనుక,ఇసుక ను కలిపి కంటైనర్ లో తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు.ఇసుక ను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిలువచేసి హైదరాబాదుకు తరలించడానికి సిద్ధం చేస్తున్న నేరస్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు.ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను నిలువ చేసిన, తరలించిన చట్టరీత్యా కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

### - ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు



కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి27:(ప్రజాకలం ప్రతినిధి)కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు యువతి,యువకులు వినియోగించుకున్నరు.పట్టభద్రులు ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ,ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గ్రాడియట్స్ పట్టబద్రులకు విజ్ఞప్తి చేశారు.స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

### -మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని,ఫిబ్రవరి 27:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కోరారు.మంథని మండలం గుంజపడుగు గ్రామంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన శివ శంకర్ కిరాణ దుకాణంను గురువారం ఆయన పరిశీలించి బాధితుడు ఊదరి శివ శంకర్ కుటుంబాన్ని పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు.ఈ సందర్బంగా పుట్ట మధు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో జీవనాధారమైన కిరణ దుకాణంలోని సామాన్లు,వస్తువులు కాలి బూడిదయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఆధారం కోల్పోయిన బాధితుడికి సాయం అందించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ ప్రమాదంపై అధికారులు స్పందించి ప్రభుత్వపరంగా ఆదుకునే విదంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.




### ప్రతి ఒక్కరూ పొదుపు చేయటం అలవాటు చేసుకోవాలి..

## నేటి పొదుపే రేపటి భవిష్యత్తుకు ఆర్థిక పునాది

### - జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్



జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి):

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా "ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు" నిర్వహిస్తున్న తరుణంలో ఈరోజు జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత మరియు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొదుపు అలవాటు చేసుకోవాలని అలాగే ఆదాయ, వ్యయాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నేటి పొదుపే భవిష్యత్తులో ఎటువంటి అత్యవసర పరిస్థితి వచ్చినా తట్టుకుని నిలబడడానికి ఉపయోగ పడుతుందని పొదుపు ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్, మెసేజులకు ఎవరూ స్పందించవద్దని, ఎటువంటి లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. అవగాహన సదస్సుకి హాజరైన మహిళలందరికీ జిల్లా లీడ్ బ్యాంక్ తరపున ఉచితంగా టిఫిన్ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ కోట మధుసూధన్, ఎపిఎం గంగాధర్, సిసిలు గంగారాం, మరియా, మండల సమాఖ్య అధ్యక్షురాలు సత్తవ్వ,విఓఏలు రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్..

### - ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మహేష్ దత్ ఏక్కా

### - పట్టభద్రుల స్థానానికి 68.50%, ఉపాధ్యాయుల స్థానానికి 94.42% పోలింగ్ నమోదు

### - రామగుండం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు

గోదావరిఖని, ఫిబ్రవరి 27: (ప్రజా కలం ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లాలో పట్ట భద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి సభ్యుల ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మహేష్ దత్ ఏక్కా అన్నారు. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మహేష్ దత్ ఏక్కా, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి రామగుండం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉన్న పట్టభద్రులు, టీచర్స్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మహేష్ దత్ ఏక్కా మాట్లాడుతూ.. జిల్లాలోని 50 పోలింగ్ కేంద్రాలలో పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసాయని, సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షించామని అన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరిగిందని, గ్రాడ్యుయేట్స్ ఎన్నికలలో పురుషులు 13098 మంది, మహిళలు 8160 మొత్తం 21259 మంది ఓటర్లు అనగా 68.50% శాతం, టీచర్స్ ఎన్నికలలో పురుషులు 611 మంది, మహిళలు 438 మొత్తం 1049




మంది ఓటర్లు అనగా 94.42 శాతం పోలింగ్ జరిగిందని ఆయన తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత కరీంనగర్ లో ఉన్న రిసెప్షన్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్ లను తరలించామని అన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ రామగుండం లోని సేక్రెడ్ హార్ట్ హై స్కూల్ లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ పర్యటనలో రామగుండం తాహసిల్దార్ కుమారస్వామి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### సీఐ దురుసు ప్రవర్తన పై రెండో రోజు

## కొనసాగిన న్యాయవాదుల నిరసన



### - పలువురు మద్దతు

గోదావరిఖని ఫిబ్రవరి 26: (ప్రజా కలం ప్రతినిధి)

గోదావరిఖని కి చెందిన జూనియర్ న్యాయవాది నామతాబాద్ కిరణ్ జీ పై గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేన రెడ్డి దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ ఖని న్యాయవాదులు చేస్తున్న నిరసన గురువారం రెండో రోజుకు చేరుకుంది.ఈ మేరకు గోదావరిఖని బార్ అసోసియేషన్ పిలుపుమేరకు న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. గోదావరిఖనిలోని మూడు మున్సిఫ్ కోర్ట్ ల తో పాటు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అదనపు జిల్లా న్యాయస్థానంలో కోర్ట్ కార్యకలాపాలు నిలిచిపోయాయి.

ఐలు ఆధ్వర్యంలో...వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి దురుసు ప్రవర్తనను నిరసిస్తూ అఖిలభారత న్యాయవాదుల సంఘం (ఐలు)రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చందాల శైలజ ఆధ్వర్యంలో న్యాయవాదులు మున్సిఫ్ కోర్ట్ కాంప్లెక్స్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న సీఐ న్యాయవాదులపై దురుసు గా ప్రవర్తించడం హేయమైన చర్య అని అన్నారు. ఈ నెల 19 నా మైనర్ బాలున్ని పోలీసులు తీసుకెళ్తే అడిగినందుకు వెళ్లిన న్యాయవాదిపై ఈ విధంగా మాట్లాడడం సిఐ కి తగదని గతంలో ఇదేవిధంగా ప్రవర్తించి న్యాయవాదుల సమక్షంలో క్షమాపణ చెప్పిన సీఐ తిరిగి ఇదేవిధంగా ప్రవర్తించడం దారుణం అన్నారు. ఇప్పటికైనా సీఐ తన ప్రవర్తను మార్చుకోవాలని పోలీస్ స్టేషన్ లకు వచ్చే న్యాయవాదులతో పాటు సామాన్య ప్రజలు సైతం న్యాయం కోసం వస్తారని.. అలా వచ్చిన వారిపై దురుసుగా ప్రవర్తించరాదన్నారు. ఇప్పటికైనా సీఐ తన తీరు మార్చుకోవాలని లేనట్లయితే ఆయన బదిలీ అయ్యేంతవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఉమర్,టౌన్ అధ్యక్షులు ఆసంపల్లి రవీందర్ కార్యదర్శి రామ టెంకి శ్రీనివాస్,కోశాధికారి షానా వాజ్,శ్రీలత,రేష్మ తో పాటు సీనియర్ జూనియర్ న్యాయ వాదులు సీతకారి చంద్రశేఖర్,గుడికందుల భూమయ్య,సానం మురళిచెలికల శ్రీనివాస్ ,దాదా సలాం,పులిపాక రాజ్ కుమార్,రజిత,తిలక్ తదితరులు ఉన్నారు.

బి ఆర్ ఎస్ నాయకుల మద్దతు

కాగా న్యాయవాదులు చేస్తున్న నిరసనకు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే,జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ రాష్ట్ర నాయకులు కౌశిక్ హరి లు సంఘీభావం తెలుపుతూ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ప్రజా పాలన పేరుతో ప్రజలకు అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం అని తెలిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సొంత ప్రయోజనాలను కోసం అధికారులను వాడుకుంటున్నారని,ఈనెల 19వ తారీఖున మైనర్ బాలున్ని పోలీసులు అదుపులోకి తీసుకుంటే అడిగేందుకు పోలీస్ స్టేషన్ కి వెళ్లిన కిరణ్ న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించడం దారుణం అని అన్నారు,ఇప్పటికైనా అధికారులు తమ ప్రవర్తన మార్చుకోవాలని వారు హెచ్చరించారు,బి ఆర్ ఎస్ లీగల్ సెల్ నాయకులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు సి సత్యనారాయణ రెడ్డి,వేల్పుల మురళీధర్ యాదవ్,రాకాం దామోదర్, ఎంచర్ల మహేష్, గొట్టె నరేష్,దాదా సలాం పులిపాక రాజకుమార్,బొల్లి శ్రీకాంత్, టి బి జి కె ఎస్ నాయకులు మాదాసు రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

## ఘనంగా శంకర్ దాసయ్య ఉత్సవాలు



పెద్దపల్లి,ఫిబ్రవరి 27:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) మేరు సంఘం ఆధ్వర్యంలో మేరు కులదైవమైన శ్రీ శంకర్ దాసయ్య స్వామి వారి ఉత్సవాలు మహా శివరాత్రి సందర్భంగా ఘనంగా జరిగాయి.ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని,పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పెద్దపల్లిలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.ముత్యాల పోచమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలతో ప్రారంభమైన శోభాయాత్ర శివాలయం మీదుగా సాగింది.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మేరు కుల సభ్యులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.భక్తులు శంకర్ దాసయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.ఈ కార్యక్రమంలో మేరు సంఘ సభ్యులు,కుల బాంధవులు పాల్గొన్నారు

## ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



బుగ్గారం ప్రజాకలం ప్రతినిధి ఫిబ్రవరి 27 : బుగ్గారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా మొత్తం 481 గ్రాడ్యుయేట్ ఓటర్లకు గాను 348 మంది ఓటును అనగా 72.3శాతం మంది వినియోగించుకున్నారు. మొత్తం టీచర్స్ 13 ఓటర్లకు గాను 13 మంది ఓటును ఓటును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ప్రశాంతమైన వాతావరణంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు అయింది. ఈ పోలింగ్ లో గంగాపూర్ మాజీ సర్పంచ్ సర్నేని సుజాత- మల్లేశం దంపతులు,ఓటును వినియోగించుకున్నారు.

## భోలేనాథ్ కార్బల్ అనాధ శరణాలయం ప్రారంభం

### అనాధ శరణాలయం నిర్మించిన మేస్త్రి ప్రారంభకులు..

### ఉదారత చాటుకున్న ట్రస్ట్ అధ్యక్షులు భోలేనాథ్ కార్బల్ సొంతి మోహన్ యోగి..



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 27( ప్రజా కలం ప్రతినిధి) అనాధల బాబు కోసం అక్కున చేర్చుకోవాలని లక్ష్యంతో లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన ట్రస్టు నిర్వాహకులు అంగుహార్ భాటలకు పోతున్న ఈ రోజుల్లో మంచి నలుగురికి చేరాలని తద్వారా మరి కొంతమంది సత్మార్గంలో నడిచే వారవుతారని ఆదర్శంగా నిలిచి అనాధ శరణాలయం నిర్మించిన మేస్త్రి ఆ అనాధ శరణాలయాన్ని ప్రారంభోత్సవనికి అతిథిగా రావడం అందరిని అబురపరిచింది.జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని బర్దిపుర్ గ్రామంలో శ్రీ బోలేనాథ్ కార్బల్ ట్రస్ట్ ద్వారా నిర్మించిన అనాధ శరణాలయాన్ని గురువారం ట్రస్ట్ అధ్యక్షుడు సోంతి మోహన్ యోగి ఆధ్వర్యంలో అనాధ శరణాలయాన్ని నిర్మాణం చేసిన మేస్త్రి వెంకటేష్ ,భక్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్ యోగి మాట్లాడుతూ అందర్నీ సమానంగా చూడాలనేది తమ ట్రస్టు యొక్క ముఖ్య ఉద్దేశమని పరమశివుని ఆశీస్సులతో ఈ ట్రస్ట్ కు ఎవరైనా అనాధ పిల్లలు ఉంటే వారిని హత్తుకునీ హక్కును చేర్చుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అఖిల్,కిరణ్, వినోద్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ధ్యేయం

### షాద్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### బుగ్గోనిగూడా గ్రామంలో డ్వాక్రా మహిళ భవనానికి భూమి పూజ

(నందిగామ ఫిబ్రవరి 27 ప్రజాకలం ప్రతినిధి) నందిగామ మండల పరిధిలోని బుగ్గని గూడ గ్రామంలో ఈరోజు మహిళల డ్వాక్రా నూతన భవనానికి 10 లక్షల నిధులతో భూమి పూజ నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసింది అన్నాడు మహిళలకు అండగా నిలిచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుగ్గ సాలయ్య.బుగ్గ నరసింహ.బుగ్గ శ్రావణ్ బుగ్గ నరేష్ గుల్ల రామచంద్ర బుగ్గ శ్రీనివాస్ బుగ్గ యాదయ్య బుగ్గ కుమార్, డ్వాక్రా మహిళలు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మహాకుంభ్ 2025లో రికార్డు స్థాయిలో 17000 రైళ్లు



# చికెన్,ఎగ్ తినొచ్చు

## ఆల్వాల్ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ చికెన్,గుడ్ల పంపిణి, వినియోగ దారులకు అవగాహన

కంటోన్మెంట్: ఫిబ్రవరి27 ప్రజాకలం ప్రతినిధి

వదంతులు నమ్మొద్దు, గుడ్డు చికెన్ లో శరీరానికి కావలసిన పోషకాలు లభిస్తాయని



అల్వాల్ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.స్థానిక లక్ష్మి కళామందిర్ థియేటర్ వద్ద అసోషియేషన్ ఆధ్వర్యంలో చికెన్ మేళ నిర్వహించారు. వినియోగ దారులకు ఉడకబెట్టిన గుడ్లను, ఫ్రై చేసిన చికెన్ పదార్థాలను పంపిణీ చేశారు. తాజాగా బర్డ్ ఫ్లూ వచ్చిందని గుడ్లు చికెన్ తినడం మంచిది కాదని వార్తలు రావడం పై వారు స్పందించారు. తక్కువ ఖర్చు తో అధిక ప్రోటీన్ చికెన్ గుడ్లలో మాత్రమే లభిస్తుందని అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి తెలిపారు.వదంతులు నమ్మొద్దని సూచించారు. కోవిడ్ సమయంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు గుడ్లు చికెన్ తినాలని వైద్యులు సూచించిన విషయం మరువద్దని సందర్భంగా వారు గుర్తు చేశారు.డాక్టర్లు సైతం చికెన్ గుడ్లు ప్రతిరోజు ఆహారంలో తీసుకోవాలని సూచిస్తున్నారని పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూ సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో ఎటువంటి కేసులు లేవన్నారు. వినియోగదారులు గుడ్లు చికెన్ తినడంలో ఎటువంటి భయం చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్ నరేందర్ రెడ్డి, యాదవ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, మహేష్, పిరాజుద్దీన్, మహిపాల్ రెడ్డి, మురళీధర్ రెడ్డి,బలవంత రెడ్డి, నాగేశ్వరరావు, అల్వాల్ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.







## ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో రైల్వే కర్మయోగులు చేసిన అసాధారణ కృషికి కృతజ్ఞతలు తెలిపిన రైల్వే మంత్రి ! -శ్రీ అశ్వినీ వైష్ణవ్ ప్రయాగ్‌రాజ్‌ని సందర్శించి , మహాకుంభ మేళా సమయంలో అసాధారణ పని చేసినందుకు రైల్వే కుటుంబంలోని ప్రతి ఒక్కరినీ అభినందించారు!

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)

ఉదయం మహాకుంభ్ 2025 కోసం భారత రైల్వేలు విస్తృతమైన సన్నాహాలను వ్యక్తిగతంగా సమీక్షించడానికి ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించారు. ఈ గొప్ప మతపరమైన సమావేశం పరిధి మరియు ప్రాముఖ్యతను గుర్తించి, ఆయన నార్త్ సెంట్రల్ రైల్వే (ఎన్. సి. ఆర్ ), నార్త్ ఈస్టర్న్ రైల్వే (ఎన్. ఈ. ఆర్. ), మరియు ఉత్తర రైల్వే (ఎన్. ఆర్ ) పరిధిలోని వివిధ స్టేషన్లను సందర్శించి ప్రత్యక్ష కార్యకలాపాలను అంచనా వేశారు. ఈ పర్యటన సందర్భంగా, ఆయన రైల్వే సిబ్బందితో సంభాషించారు, కీలక ఏర్పాట్లను పరిశీలించారు మరియు అపూర్వమైన భక్తుల ప్రవాహాన్ని నిర్వహించడానికి అన్ని వ్యవస్థలు సజావుగా పనిచేస్తున్నాయని నిర్ధారించారు. వివిధ విభాగాల మధ్య సజావుగా సమన్వయాన్ని శ్రీ వైష్ణవ్ ప్రశంసించారు మరియు అన్ని యాత్రికులకు సురక్షితమైన, సమర్థవంతమైన మరియు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని సులభతరం చేయడంలో భారత రైల్వే నిబద్ధతను పునరుద్ఘాటించారు. రైల్వే మంత్రి గౌరవ ప్రధానిగారి నిరంతర మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు మరియు గౌరవనీయ హోంమంత్రి శ్రీ అమిత్ షా, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ మోహన్ యాదవ్ మరియు పొరుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు యాత్రికుల భారీ ప్రవాహాన్ని నిర్వహించడంలో అచంచలమైన సహకారాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే కర్మయోగుల విశిష్ట అంకితభావాన్ని రైల్వే మంత్రి ప్రశంసించారు. ఈ పర్యటన సందర్భంగా, గౌరవ రైల్వే మంత్రి స్వయంగా సమావేశమై, ఇంత పెద్ద ఎత్తున జరిగిన ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన రైల్వే సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణీకులకు సహాయం చేసే ఫ్రంట్‌లైన్ సిబ్బంది నుండి ఆర్.పి.ఎఫ్., జి. ఆర్. పి. మరియు భద్రతను నిర్ధారించే పోలీసు సిబ్బంది వరకు, సజావుగా రైలు కార్యకలాపాలను నిర్వహించే ఇంజనీర్ల నుండి పరిశుభ్రతను కాపాడే సఫాయి కర్మీల వరకు, వైద్య సహాయం అందించే వైద్యులు మరియు పారామెడిక్స్ నుండి సహాయ కేంద్రాల అధికారులు మరియు ప్రయాణాన్ని సులభతరం చేసే బుకింగ్ సిబ్బంది వరకు – ప్రతి సహకారాన్ని గుర్తించారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని సజావుగా అమలు చేయడంలో సమన్వయంతో కృషి చేసిన టి.టి.ఈలు, డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్లు, సిగ్నల్ మరియు టెలికాం సిబ్బంది, టి. ఆర్. డి మరియు విద్యుత్ బృందాలు, సహాయక స్టేషన్ మాస్టర్లు, నియంత్రణ అధికారులు, ట్రాక్‌మెన్ మరియు రైల్వే నిర్వాహకులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మొదటి నుండి చివరి వరుస వరకు ప్రతి ఉద్యోగికి ఆయన వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలిపారు. మొదటి నుండి చివరి వరుస వరకు, స్టేషన్ల గుండా నడుస్తూ, ప్రోత్సాహకరమైన మాటలు పంచుకుంటూ, లక్షలాది మంది యాత్రికులకు సజావుగా మహాకుంభ మేళా 2025 అనుభవాన్ని నిర్ధారించడానికి 24 గంటలూ అవిశ్రాంతంగా పనిచేసిన వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

రైలు కార్యకలాపాలలో అపూర్వమైన స్థాయి

2025 మహాకుంభ మేళా కోసం భారత రైల్వేలు తన ప్రారంభ కార్యాచరణ ప్రణాళికను గణనీయంగా అధిగమించాయి. మొత్తంగా 17,152 రైళ్లు నడపబడ్డాయి, ఇది మొదట ప్రణాళిక చేయబడిన 13,000 రైళ్లను అధిగమించింది. ఇది గత కుంభమేలాతో పోలిస్తే నాలుగు రెట్లు పెరుగుదలను సూచిస్తుంది. ఇందులో 7,667 ప్రత్యేక రైళ్లు మరియు 9,485 సాధారణ రైళ్లు ఉన్నాయి, యాత్రికులు తమ గమ్యస్థానాలకు సజావుగా మరియు సమర్థవంతంగా చేరుకునేలా చూసుకున్నారు. మహాకుంభ్ కు హాజరైన మొత్తం యాత్రికుల సంఖ్య 66 కోట్లు. ప్రయాగ్ రాజ్ లోని తొమ్మిది కీలక రైల్వే స్టేషన్లలో మాత్రమే 4.24 కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణించారు.

ప్రయాగ్‌రాజ్ ప్రాంతంలో మెరుగైన ప్రయాణీకుల సౌకర్యాలు

భారీ సంఖ్యలో యాత్రికులకు వసతి కల్పించడానికి, భారత రైల్వేలు ప్రయాగ్‌రాజ్‌లోని తొమ్మిది కీలక స్టేషన్లలో విస్తృతమైన మౌలిక సదుపాయాలు మరియు కార్యాచరణ మెరుగుదలలను అమలు చేశాయి, రెండవ ప్రవేశ ద్వారాలు, 48 ప్లాట్‌ఫారమ్‌లు మరియు 21 పాదచారుల వంతెనలను (ఎఫ్.ఓ.బిలు) జోడించి, కదలికను క్రమబద్ధీకరించాయి. ముఖ గుర్తింపు సాంకేతికత మరియు జనసమూహ నియంత్రణ కోసం డ్రోన్ పర్యవేక్షణతో సహా 1,186 సి. సి. టి. వి కెమెరాలతో నిఘాను బలోపేతం చేశారు. అత్యంత రద్దీ సమయాల్లో రద్దీని నిర్వహించడానికి, 23 శాశ్వత హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశారు, 23 భాషలలో బహుభాషా ప్రకటనలు మరియు కరపత్రాలు ప్రయాణీకుల కమ్యూనికేషన్‌ను మెరుగుపరిచాయి. 151 మొబైల్ యూ.టి.ఎస్కౌంటర్లు మరియు క్యూఆర్ –ఆధారిత వ్యవస్థతో సహా 554 కౌంటర్లతో టిక్కెట్ సౌకర్యాలు విస్తరించబడ్డాయి. అదనంగా, సజావుగా అనుసంధానాన్ని నిర్ధారించడానికి 21 రోడ్ ఓవర్ మరియు అండర్ బ్రిడ్జిలు (ఆర్. ఓ బి. లు /ఆర్. యూ. బి లు) నిర్మించబడ్డాయి.

వైద్య మరియు అత్యవసర సంసిద్ధతను బలోపేతం చేయడం

భారతీయ రైల్వేలు ప్రయాణీకుల భద్రత మరియు సౌకర్యాన్ని నిర్ధారించడానికి బలమైన వైద్య మరియు అత్యవసర సహాయ వ్యవస్థను అమలు చేశాయి. జిల్లా అధికారుల సమన్వయంతో కేంద్రీకృత సహాయక కేంద్రాలు, వైద్య సౌకర్యాలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక దళాలు మరియు మొబైల్ టాయిలెట్‌లను ఏర్పాటుచేశారు. స్టేషన్లలో అదనపు క్యాటరింగ్ సేవలను ఏర్పాటు చేశారు. ప్రయాణీకుల కదలికను సజావుగా నిర్వహించడానికి, పార్శిల్ ట్రాఫిక్‌ను పరిమితం చేశారు మరియు సమర్థవంతమైన సిబ్బంది విస్తరణ మరియు వసతి కోసం యాప్ ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టారు. రేక్‌లు, కోచ్‌లు మరియు లోకోమోటివ్‌ల నిరంతర పర్యవేక్షణ కార్యాచరణ సామర్థ్యాన్ని నిర్ధారిస్తుంది, అయితే కేంద్రీకృత ప్రయత్నాలు వారణాసి–ప్రయాగ్‌రాజ్ విభాగంలో చివరి 34 కి.మీ. ట్రాక్ లింకింగ్‌ను ఒక నెలలోపు వేగంగా పూర్తి చేయడానికి వీలు కల్పించాయి.

భారతీయ రైల్వేల నిబద్ధతకు నిదర్శనం

భారతీయ రైల్వేలు మహాకుంభమేళా 2025 కార్యకలాపాలను సజావుగా నిర్వహించడం వారికి ప్రజా సేవ పట్ల అచంచలమైన అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుంది. బహుళ స్థాయి సమన్వయం మరియు అధునాతన జనసమూహ నిర్వహణ ద్వారా, రైల్వే వ్యవస్థలో లక్షలాది మంది భక్తులను విజయవంతంగా రవాణా చేసింది. గౌరవ రైల్వే మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ ఈ అసాధారణ ప్రయత్నాన్ని అభినందిస్తూ, వ్యక్తిగతంగా మొత్తం రైల్వే సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వారి అవిశ్రాంత అంకితభావం అందరికీ సజావుగా మరియు సమర్థవంతంగా ప్రయాణించేలా చేసింది. వారి నిబద్ధత మరియు జట్టుకృషి మరోసారి పెద్ద ఎత్తున కార్యాచరణ శ్రేష్ఠతలో నూతన ప్రమాణాలను నెలకొల్పాయి. తద్వారా దేశ రవాణా వ్యవస్థకు వెన్నెముకగా భారతీయ రైల్వే పాత్రను బలోపేతం చేశాయి.

## దళిత కుటుంబాలకు అండగా కాంగ్రెస్ పార్టీ యువనేత నారపోగు వెంకట్

### - గొల్లగూడెంలో బాధిత కుటుంబాలకు 35వేలు ఆర్థిక సాయం
### - వెంకట్ కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామ యువకులు, బాధిత కుటుంబాలు

తల్లాడ, ఫిబ్రవరి 28 (ప్రజాకలం న్యూస్):

ప్రార్థించే పెదవుల కన్నా..సాయం చేసే చేతులు మిన్నా అన్న స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ యువనేత, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు నారపోగు వెంకట్ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. స్వగ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు నేనున్నానని అండగా ఉండి ఆపద్బాంధవుడయ్యాడు. ఈ సందర్భంగా అనారోగ్యం తో బాధపడుతున్న పాస్టర్ దేవ సహాయంకు 10వేలు, తడికమళ్ళ ప్రవీణ్ కు 10వేలు, తోటపల్లి సాయమ్మకు 10వేలు, ఇస్నేపల్లి వరమ్మకు 5వేలు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గురువారం గ్రామంలో దళిత కుటుంబాలను పరామర్శించి, ఆయన తన వంతు సాయంగా నగదును అందించారు. గ్రామ మాజీ సర్పంచిగా విధులు నిర్వహించ టంతో పాటు ప్రస్తుతం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ప్రధాన అనుచరుడుగా హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తల్లాడ మండలానికి, స్వగ్రామానికి వచ్చినప్పుడల్లా సేవా కార్యక్రమాలు చేస్తూ జన్మభూమికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇటీవల



గ్రామంలో అయ్యప్ప పడిపూజకు 50 వేలు, దళితుల సభకు సుమారు 2లక్షల రూపాయలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేసిన సంగతి విధితమే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి సరిగా లేక ఇబ్బందులు పడటంతో గ్రామస్తులు తనకు తెలియ జేయడంతో స్పందించినట్లు తెలిపారు. తల్లాడ మండలానికి, గ్రామానికి ఎప్పుడు తన సేవలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు, బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్నపల్లి వెంకటేశ్వర్లు, సాధం మల్లయ్య, పగిడిపల్లి గోపయ్య, లక్ష్మణ్, గొల్లమందల సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలలో ప్రతిభా కనబరిచిన మహిళలకు బహుమతుల ప్రధానం

ఫిబ్రవరి 27, ప్రజాకలం ప్రతినిధి. (వరంగల్ /పర్వతగిరి) బుధవారం రోజున రోళ్లకల్ శంభుని గుడిలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా క్రీ.శే. నాగపురి సత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో



ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో చాలామంది మహిళలు ఉత్సవంగా పాల్గొనడం జరిగింది. ఈ ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు క్రీ, శే ,నాగపూర్ సత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నాగపురి రాజా గౌడ్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. మహా శివరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకోవడానికి మూడు గ్రామాల ప్రజలు పాల్గొనడం జరిగింది. ఈ ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి నాగపురి రాజా గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యాన్ని నిర్వహించడానికి సహకరించిన రోలకళ్ గ్రామపంచాయతీ కార్యదర్శి సుమన్ కి ధన్యవాదాలు తెలుపడం జరిగింది. ఈ పోటీలలో ప్రథమ బహుమతులు మూడు దేవి, సంకినేని లలిత, మడ్డి అక్షయ, మూడు సుష్మిత, గాజుల హన్సిక, మూడు అఖిల, ద్వితీయ బహుమతి పొందిన మహిళలు మడ్డి దీక్ష, మూడు అర్చన, బొమ్మెర అశ్విని, గుగులోత్ శాంతి, మడ్డి శారద, బానోత్ అనిల్ బహుమతులు పొందడం జరిగింది.

## నీతి, నిబద్ధత, విలువలు తప్పిన ఉపాధ్యాయులు

### - ప్రలోభాలకై పరుగులు - డబ్బుల పంపకాల్లో క్యాడర్ల మధ్య ఒకే సంఘంలో గొడవలు
### - ఎంఎల్సీ ఎన్నికల్లో గురువుస్థానం గంగలోకే

ఎండపల్లి, ఫిబ్రవరి 27 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లాలో ఆకాశమంత ఎత్తుగా ఉండవల సి న ఉపాధ్యాయ గౌరవం కాస్త అధః పాతాళంలోకి పడిపోతున్నది సాధారణ ఎన్నికల్లో సగటు ఓటర్ల

కన్నా నీచానికి దిగజారి ఉపాధ్యా యలోకం ఓటుకు నోటు కోసం అర్రులు చాస్తున్నది నిస్సిగ్గుగా బడి, బడి తిరిగి పంచుతున్న పైసల కథ గతితప్పిన ప్రజా స్వామ్య విలువల్ని సూచిస్తున్నది రాజకీయ పార్టీలు పవిత్రమైన ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికల్లో వారివారి పెట్టుబడిదారుల్ని నిలబెట్టి అడ్డదారి లో పైకి తీసుకురావాలని గురువులకు తెగుల్లు పుట్టిస్తున్నాయి కనీవినీ ఎరుగని రీతిలో పార్టీలు డబ్బులు విచ్చలవిడిగా ప్రవహిస్తున్నాయి సాధారణ ఎన్నికల్లో కంటే ధర ఎక్కువ పలుకుతుండడం గమనార్హం హుజురాబాద్ ఉప ఎన్నిక మాదిరిగా ఉపాధ్యాయ ఓటర్లు అభ్యర్థుల కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్న వైనం ఉపాధ్యాయ హక్కులు సమస్యలు విద్యారంగ శ్రేయస్సు కోసం గొంతు విప్పడం, ప్రాతినిధ్యం చెయ్యాల్సి న శాసనమండలి సభ్యులు కనీస అవగాహన లేకుండా అంగట్లో సరుకులు కొనుక్కునే మాదిరిగా రావడం, స్ఫూర్తిని మరిచి ఓటరు మహాశయులు ఎక్కడ పడితే అక్కడ తలా ఓ చెయ్యి చాపడం విడ్డూరం సగటున జీతం ఎవరికి లక్షకు తక్కువలేదు అందు లో సుమారు నలభైశాతం పైగా ఇద్దరు భార్యా భర్త ఉపాధ్యాయులే రెండు కార్లున్నవారు, పిల్లలు విదేశాల్లో చదువుతున్న వారు కూడా ఇదే కోవలోనికి రావడం బాధాకరం నిస్సిగ్గు గా ప్రలోభాలు తీసుకోవడంలోనూ నిజాయితీ తప్పారు టీచర్లు. ఒక అభ్యర్థి 5000 ఇస్తే తీసుకొని అతనికి ఓటు వెయ్యవలసి ఉండగా, మరో అభ్యర్థి ఇచ్చే 3000 తీసుకోవడం, మూడో అభ్యర్థి ఎప్పుడిస్తారా? అని ఎదురు చూడడం దారుణం. ఒక సంఘం మండల, జిల్లా నాయకుడు వారి అభ్యర్థి బరిలో ఉన్నా మరో అభ్యర్థి వద్ద తీసుకోవడం చర్చనీయాంశంగా

మారింది. జాతి నిర్మాతల ఆదర్శం రేపటి ఫలితాల్లో తేటతెల్లమవు తుంది ఓ ఇరవైశాతం ఉపాధ్యా యులు డబ్బులు వద్దని నిరాక రిస్తున్నారు ఇది ఆనందం తో ప్రశంసించవలసిన అంశం మహి ళా టీచర్లను బస్సుల్లో విహార యాత్రలకు తీసుకెళ్ళడం పురుషులకు మందు విందు ఇవ్వడం సర్వసాధారణ అంశం కార్పొరేటు రియల్ ఎస్టేట్ వ్యక్తులు బరిలో ఉండడం చూసి కొందరు పోటీనుండి తప్పుకున్నారంటే డబ్బు ప్రభావం ఎంతగా పనిచే సిందో అర్థం చేసుకోవచ్చు కేజీబీవీ, కాంట్రాక్టు టీచర్లు తక్కువ జీతం తో సరిగ్గా జీతాలు రాక ఉద్యోగ భద్రత లేక డబ్బు తీసుకోవడం కొంత ఆలోచించవచ్చు ఒక పీజీ హెచ్ఎం వారి స్పాజ్ స్కూల్ అసిస్టెంట్ లాంటి వారు కూడా 5000 లతో పాటు 3000 తీసుకో వడం గమనార్హం రేపు ఉపాధ్యా యుడి విలువ ఏ స్థాయికి పడి పోతుందా హక్కుల గురించి ప్ర శ్నించే నైతికత ఉ పాధ్యాయులు ఎలా కోల్పోతారో అంచనా వేసుకోవాలి. తప్పేముంది? దేశమంతా తీసుకోవడం లేదా ఇదేమైనా సక్రమమైన రీతిగా సంపాదించిన డబ్బా అని ఎదురు ప్రశ్నిస్తున్నారు జిల్లా నాయకులకు రాష్ట్ర నాయకుల కు మాకు డబ్బులు రాలేదని ఎప్పుడి స్తారని కాల్ చేసి ప్రశ్నిస్తున్నారంటే

టీచర్ల మానసికస్థితిని అర్థం చేసుకోవాలి ఒక అభ్యర్థి 5000 పట్టుకొని ఒక మహిళా టీచర్ వద్దకు వెళ్తే నేను ధర్మానికే ఓటు వేద్దాం అనుకున్నాను మీరు కూడా నీతి తప్పి డబ్బు పంచుతున్నా రంటే మీ పార్టీకి ఓటు వేయనని డబ్బును తిరిగి కొట్టిన కథ ఒక్కటే కాస్త ఓదార్పుగా మిగిలింది. వివిధ సంఘాల జిల్లా నాయకులు సహితం రెండవ ప్రాధాన్యత ఓటు మా సంఘం నుండి మీకు వేయిస్తామని బేరసారాలు ఆడుకొని డబ్బులు తీసుకున్న సంఘటనలు, కాల్ రికార్డు తో సహా దిగజారుడుతనానికి పరాకాష్టగా కనిపించింది గత దశాబ్దకాలంగా సమస్యల చిట్టా అపరిష్కృతంగా ఉంది సాధించు కోవలసిన సమస్యలు అనేకానేకం

ఉండగా అమ్ముడుపోయే స్థితి సమస్యలను ఎంతలోతుగా పాతిపెడుతుందోనని సగటు నిబద్ధత గల టీచర్లు ఆందోళన చెందుతున్నారు. డబ్బు సంచులే గెలిస్తే సమాజంలో ఎలా తలెత్తు కోవాలని సాధారణ టీచరు బెంబేలెత్తిపోతున్నాడు. నీతి, నైతికత, విలువలు మరచిన ఉపాధ్యాయులే అధికంగా ఉన్న స్థితిలో సమాజ పయనమెటో తలచుకుంటే భయంగా ఉన్నది

మాకు ఓటు లేదని బ్రతికిపోయా మని ఎస్జీటీ కేడర్ మిగతావా రంతా ఊపిరిపీల్చుకుంటున్నారు రేపటి ఎన్నికల్లో ఉపాధ్యాయేతర కార్పొరేటు డబ్బు శక్తులు గెలిస్తే ఇక ఈ సమాజాన్ని బాగుచేసే నాథుడే ఉండరు. డబ్బు కంటే విలువ ముఖ్యం అని ఎందరో ఉపాధ్యాయులు బతికి చూపించి న జాడ మరచి నేటి ఉపాధ్యాయ లోకం డబ్బు వెంట పరుగెత్తడం చూస్తుంటే సిగ్గుగా ఉంది తినడాని కే తిండి లేని స్థితిలో కూడా ఆత్మాభిమానం తాకట్టు పెట్టని ఎందరో త్యాగమూర్తులు మనకు చరిత్రలో సాక్ష్యంగా కనపడతారు. అసలు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులుగా పనిచేసిన వారికి సహితం మరణించేవరకు సొంత ఇల్లు లేని నిబద్ధత మన చరిత్ర పుటల్లో పదిలంగా ఉంది. ఇంతటి సాంకేతిక యుగంలో ఉపాధ్యాయ సంఘాలు రాజ్యాంగ స్ఫూర్తి మరచి అలాంటి అభ్యర్థులకు సీటు ఇవ్వడం బలపరచడం ఒక ఎత్తు అయితే, ఉపాధ్యాయులు డబ్బులు తీసుకునే వ్యవహారంలో ఒకరి కంటే ఒకరు ముందు అని పోటీ పడుతుండడం శోచనీయం ఈ రోజు జరిగిన ఓటింగ్ ఉపాధ్యాయ విలువలను, స్థాయిని, మర్యాదను నిబద్ధతను లెక్క స్పష్టంగా తేల్చి చెప్పబోతున్న అంశం అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు అందరూ అనుకున్న విధంగా డబ్బు గెలిస్తే ఒక ఉపాధ్యాయ విలువ సమాజం లో అడుగంటి పోవడం ఖాయం సాధారణ జనం డబ్బు డబ్బు అని ఎన్నికల సమయంలో అనడంలో ఎలాంటి తప్పు ఉండదు.

– నిబద్ధత కలిగిన సగటు ఉపాధ్యాయుడు రాష్ట్ర ఉపాధ్యక్షులు

# జిల్లా స్థాయి వాలిబాల్ పొట్టిలో విజేతలకు జాటోత్ చేతన్య నాయక్ జ్ఞాపకార్థం 10,000/- అందజేత

**- కాంగ్రెస్ మండల పార్టీ 'అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్**



ఫిబ్రవరి 27, ప్రజాకలం ప్రతినిధి. ( వరంగల్/ పర్వతగిరి)

పర్వతగిరి మండల కేంద్రంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రతాప్ యూత్ అద్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలిబాల్ పొట్టిలో పర్వతగిరి టీమ్ జాఫర్‌గడ్ టీమ్ పై విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్ వీక్షించడానికి ముక్య అతిదిగా కాంగ్రెస్ మండల పార్టీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్.టి సెల్ అద్యక్షులు బాణోత్ భాస్కర్ నాయక్, పర్వతగిరి పట్టణ అధ్యక్షులు కుసం రాంచందర్, పుర ప్రముఖులు హాజరైనారు. మోదటి భాహుమతిగా పర్వతగిరి బృందనికి జాతోత్ చేతన్య నాయక్ జ్ఞాపకర్థం 10,000/- రూపాయల నగతు, కప్పు మండల పార్టీ అధ్యాక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ అందించి యువతకు ఎల్లవేళలా అండగా వుంటానని సహాయ సహకరలు ఆంధిస్థానని క్రీడలను ప్రోత్సహిస్తాన మీ క్రీడాకారులకు నావంతు సాయం ఎప్పుడు వుంటుంధని తేలిపారు. రెండవ భహుమతి జాఫర్‌గడ్ బృందం 5000రూపాయల నగదు, కప్పు ప్రతాప్ యూత్ సీనియర్ ప్లేయర్స్ అందించారు ముడవ భహుమతి పంథిని టీమ్ 2000రూపాయల నగదు, కప్పు మండల ఎస్ టి అధ్యాక్షులు బాణోత్ భాస్కర్ నాయక్ ప్రధానం చేసారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఎర్రం సిద్దార్థ్ 500 నగతు పట్టన అధ్యక్షులు కుసం రాంచందర్ అందించారు. ఈ కార్యక్రమంలో ముక్కెర సుధాకర్, వంగ సాయికృష్ణ కొమ్ము రమేష్, జంగా సారంగపాణి, మురళి, శ్రీశైలం, గరుగు రాజు, శ్రీకాంత్, భాస్కర్, మల్లేశం యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో ఐదుగురు గల్లంతు..

రాజమండ్రి : తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలో విషాదం జరిగింది. గోదావరిలో స్థానాన్ని దిగి ఐదుగురు యువకులు గల్లంతు అయ్యారు. తిరుమల శెట్టి పవన్ (20), పడాల దుర్గాప్రసాద్ ( 19), అనిశెట్టి పవన్ (19), గర్రె ఆకాష్ ( 19), పడాల సాయి (19) లు గల్లంతు అయ్యారు. పోలీసులు ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు ఐదు మృతదేహాలు లభ్యమయ్యాయి. జిల్లా కలెక్టర్ ప్రశాంతి తాళ్లపూడి ఘటన వద్దకు చేరుకున్నారు

## మొక్కలకు ఆధార్

అదిలాబాద్ : మొక్కల కోసం "డిజిటల్ ట్రీ ఆధార్" భారతదేశంలో పౌరులుగా గుర్తింపుకోసం, ప్రభుత్వ పథకాల లబ్ధిపొందేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి. అదే తరహాలో చెట్ల పరిస్థితిపై డేటాబేస్ ను సమీకరించడానికి 'డిజిటల్ ట్రీ ఆధార్' కార్యక్రమాన్ని ప్రారంభించారు ముఖరా కె సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఇందులో భాగంగా ముఖరా కె గ్రామంలో ప్రతి చెట్టును జియో ట్యాగింగ్ చేసి, క్యూఆర్ కోడ్ ను కేటాయించడం జరుగుతుంది అని , క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే ఆ మొక్క యొక్క ఆరోగ్యం, వయస్సు మరియు పెరుగుదల క్రమం, ఆ మొక్క నుంచి ఎంత అక్సిజన్ వస్తుందో తెలుస్తుంది ఆ వృక్షం ఉన్న నిర్దిష్ట ప్రాంతం పెరుగుదల క్రమం,మరియు ఆ మొక్క యొక్క లొకేషన్ ఇస్తుంది ఇలా చేయడంతో ప్రతి మొక్క బ్రతుకుంది అని మనిషికి ఏ విధంగా ఐతే ఆధార్ కార్డు ఉంటుందో అలాగే మొక్కలకు కూడా డిజిటల్ ట్రీ ఆధార్ ఇవ్వడం జరిగింది. గ్రామంలో నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి, క్యూఆర్ కోడ్ ను కేటాయించడం తెలంగాణ లోని తొలి గ్రామం ముఖరా కె అని సర్పంచ్ గాడ్గే మీనాక్షి అన్నారు,ప్రతి ఒక్కరు నాటిన మొక్కకు జియో ట్యాగింగ్ చేసి, క్యూఆర్ కోడ్ ను కేటాయిస్తే నాటిన ప్రతి మొక్క బ్రతుకుతుంది అని సర్పంచ్ గాడ్గే మీనాక్షి అన్నారు.

## ఆధ్యాత్మిక విద్యా బోధన ఉచితంగా రాదు

ఆళ్లగడ్డ : ఇహ పర లోకాలలో సాఫల్యం పొందేందుకు ప్రతి ఒక్క ముస్లిం సోదర సోదరీ మణులు ఆధ్యాత్మిక విద్యా కలిగి ఉండాలని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఖాజి మహమ్మద్ జాఫర్ సాదిక్ పేర్కొన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని డాక్టర్ రామలింగ రెడ్డి ఫంక్షన్ హాల్ లో హదియా ఇంటర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ వారి అధ్వర్యంలో జిల్లా స్థాయి ఇస్లామిక్ ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఖురాన్ సూక్తులు,ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిపై కీర్తనలు తదితర అంశాలపై జిల్లా స్థాయిలోని 12 మండలాలకు చెందిన ఇస్లామిక్ విద్యార్థిని విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ మండల ప్రభుత్వ ఖాజి మహమ్మద్ జాఫర్ సాదిక్, పుంగనూరు దారుల్ హుదా ప్రిన్సిపాల్ మౌలానా శర్ఫుద్దిన్,20వ వార్డు కౌన్సిలర్ హుసేన్ భాష,ఆపుస్మ ఆళ్లగడ్డ యూనిట్ అధ్యక్షుడు టి.అమిర్ భాష లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్లామిక్ ధార్మిక విద్యా ఉచితంగా రాదని పరలోకంలో ఉన్నత స్థానం పొందేలా బోధించే ఇస్లామిక్ ధార్మిక పండితులు(హాఫిజ్ , ఆలిం )లకు వేతనాలు సరిపడ చెల్లించి ఇస్లామిక్ విద్యను పొందాలని సూచించారు. అనంతరం పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ట్రోఫీలు అందజేశారు. అలాగే ప్రముఖ సామాజిక కార్యకర్త జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బిరువాల భాష మాట్లాడుతూ ఇస్లామిక్ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న హదియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ వారు నిర్వహిస్తున్న ఇస్లామిక్ ధార్మిక కార్యక్రమాల వల్ల ఎంతోమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇస్లామియా విద్యతోపాటు ఇస్లామిక్ సాంప్రదాయాలు పద్ధతులు నేర్చుకొని సమాజానికి ఉన్నతమైన పౌరులను అందజేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా లోని పలువురు ఇస్లామిక్ ధార్మిక పండితులు మౌలానా ఇర్షాద్ అహ్మద్, హాఫీస్ సద్దాం హుస్సేన్, హాఫీస్ ఉస్మాన్ భాష, హాఫీస్ కందుకూరు సాదిక్ తదితర ఆలింలు, హాఫీజ్ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విజయ పేరును వాడుతున్నారు

హైదరాబాద్ : కొంతమంది ప్రైవేట్ డైరీ వారు విజయ పేరు తో తమ విజయ తెలంగాణ పాల ప్యాకెట్లను విక్రయిస్తూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని అలాంటి పాలను కొనుగోలు చేయవద్దని తెలంగాణ డైరీ డెవలప్మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం లాలాపేట్ లోని విజయ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డైరీ ఎండి చంద్రశేఖర్ రెడ్డి తో కలిసి చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు విజయ తెలంగాణ అని బ్రాండ్ ఉంటేనే పాలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా తెలంగాణ నకిలీ పాలను డిస్ట్రిబ్యూటర్స్ వెండర్స్ కొనుగోలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే తాము కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. ఇలాంటి నకిలీ విజయ పాల తో వచ్చిన ఉత్పత్తులను కొనుగోలు చేయవద్దని సూచించారు ఇవి ప్రజల ఆరోగ్యానికి సంబంధించినవి కాబట్టి తమ లోగోను పరిశీలించి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు

# వరంగల్ ఎన్ఐటిలో 'స్ప్రింగ్ స్ప్రీ 2025 వేడుకలు



హనుమకొండ ఫిబ్రవరి 27 ప్రజా కలం ప్రతినిధి

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ లో ప్రతిష్టాత్మక సాంస్కృతిక ఉత్సవం 'స్ప్రింగ్ స్ప్రీ 2025' ఫిబ్రవరి 28 నుండి మార్చి 2, 2025 వరకు నిర్వహించబడుతుంది. 1978లో ఆవిర్భవించిన స్ప్రింగ్ స్ప్రీ దక్షిణ భారతదేశంలో అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇది వినోదం, మేధోపరమైన స్ఫూర్తిని కలిగించే కార్యక్రమాలు,అద్భుతమైన ప్రో షోలు కలయికగా జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిని అందిస్తుంది. స్ప్రింగ్ స్ప్రీ కళ,సాహిత్యం, నాటకం, నృత్యం, సంగీతం, క్విజ్,ఫోటోగ్రఫీ,పెయింటింగ్, ఫ్యాషన్ షోలు,రాక్ మ్యూజిక్ పోటీలు,మోడల్ యునైటెడ్ నేషన్స్,మినిట్ మేడ్ వంటి విభిన్న రంగాల్లో ఆసక్తికరమైన కార్యక్రమాలను ప్రదర్శిస్తుంది. విద్యార్థులకు వారి ప్రతిభను ప్రదర్శించేందుకు గొప్ప వేదికను అందించడంతో పాటు కొత్త కళా ప్రదర్శనలను ప్రోత్సహిస్తుంది. ప్రో షోలు స్ప్రింగ్ స్ప్రీలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అంశాల్లో ఒకటి ప్రో షో ఇందులో ప్రముఖ కళాకారులు ప్రదర్శనలు ఇస్తారు. పాల్గొనే విద్యార్థులతో పాటు వరంగల్ నలుమూలల నుండి ప్రజలను ఆకర్షిస్తుంది. ఫిబ్రవరి 28, 2025 (మొదటి రోజు):గిన్నిస్ వరల్డ్ రికార్డు పద్మశ్రీ డా.కె. బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించనున్నారు. మార్చి 1,2025 (రెండవ రోజు)భారతీయ రాక్ బ్యాండ్ 'వార్టెక్స్' వారి విభిన్నమైన ఫ్యూజన్ మ్యూజిక్‌తో ప్రేక్షకులను అలరించనుంది. అలాగే,రెండు సినిమా బృందాలు విద్యార్థులతో ప్రత్యక్షంగా ముఖాముఖి చర్చలో పాల్గొంటాయి. మార్చి 2,2025 (మూడవ రోజు)ప్రముఖ గాయకుడు అమిత్ త్రివేది తన సంగీత ప్రదర్శనతో సందడి చేయనున్నారు. ప్రధాన కార్యక్రమాలు నృత్య పోటీలు సోలో మరియు గ్రూప్ డాన్స్ సంగీత పోటీలు కవర్ సాంగ్స్,రాక్ బ్యాండ్ పోటీలు,ఫ్యాషన్ షో,అల్లూర్

డ్రామా,నాటకం,నుక్కడ్ నాటక్

కాస్ప్లే పోటీలు వివిధ పాత్రల అవతారాలలో పోటీదారులు ఫిల్మ్ మేకింగ్ పోటీలు,గేమింగ్ పోటీలు హిస్పాల్ క్విజ్, స్ట్రీట్ బ్యాటిల్,సైలెంట్ DJ,సాహిత్య చర్చలు చిత్రాలు సంగీతంపై వాదోపవాదాలు ప్రత్యేక ఆకర్షణలు బైక్ స్టంట్స్,మేజిక్ షో క్యాంపస్ మొత్తం వినోదకరమైన, మస్తీతో కూడిన కార్యకలాపాలు స్ప్రింగ్ స్ప్రీ 2025 విద్యార్థులకు ఒక అద్భుతమైన అనుభూతిని అందించేందుకు,సృజనాత్మకతను వెలికితీసేందుకు గొప్ప జ్ఞాపకాలను అందించేందుకు సిద్ధమైందని ప్రొఫెసర్ బిద్యధర్ సుబుధి నీట్ డైరెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు,సంబంధిత ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ తో 5 లక్షల మందికి లబ్ది



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అనధికార లేఅవుట్లు, అందులోని ప్లాట్ల క్రమబద్ధీకరణ మరోసారి లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎల్ఆర్ఎస్ కోసం ప్రభుత్వం నుంచి 25 శాతం స్పెషల్ డిస్కౌంట్ కూడా ప్రకటించారు. ఈ ఏడాది మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ ఫీజుతో పాటు ఓపెన్ స్పేస్ ఛార్జీలు చెల్లిస్తే ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. కాగా, ఈ పథకం ద్వారా కొత్తగా మరో 5 లక్షల మందికి లబ్ధి చేకూరే ఛాన్స్ ఉంది. రాష్ట్రంలో స్థలాల క్రమబద్ధీకరణకు తొలిసారిగా 2020లో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ సమయంలో 25.67 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వివిధ కారణాలతో వచ్చిన అప్లికేషన్లలో ఇప్పటివరకు సుమారు 9 లక్షల దరఖాస్తులను మాత్రమే పరిష్కరించగలిగారు. ఒకేసారి పరిష్కరించేందుకు 25 శాతం స్పెషల్ డిస్కౌంట్ ఇస్తూ ఇటీవల రేవంత్ ప్రభుత్వం ఓటీఎస్‌ను ప్రకటించింది. ఇదే కాకుండా ఏదైనా లే అవుట్‌లో 10 శాతం స్థలాలు మాత్రమే అమ్మైడై.. మిగతా 90 శాతం ఖాళీగా ఉన్న ప్లాట్లకు కూడా నిర్ధారిత ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకునే ఛాన్స్ కల్పించారు. దీనివల్ల దాదాపు 5 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇలాంటి స్థలాలను కొన్నవారు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు వెళ్లి నేరుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని చెప్పారు. ఇక ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లలో ప్రస్తుతం 16 లక్షల వరకు పెండింగ్‌లోనే ఉన్నాయి.

## తెలంగాణలో విచిత్ర వాతావరణం

హైదరాబాద్ : తెలంగాణలో భిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయం పూట చలి, పది గంటల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. గత కొద్ది రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. మరో మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మార్చి నెల వస్తుండటంతో ఎండల తీవ్రత మరింత ఎక్కువవుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో ప్రజలు ఉదయం ఎనిమిది గంటలు దాటితే బయటకు రావడానికి భయపడిపోతున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకూ ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గడం లేదు.. తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సాధారణ ఉష్ణోగ్రతలు కంటే రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం 35 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ప్రధానంగా ఆదిలాబాద్, మంచిర్యాల, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలోనూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. రానున్న కాలంలో ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత గతంలో కంటే ఎక్కువగా ఉంటుందన్న అంచనాలు వినపడుతున్నాయి. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని, లేకుంటే వడదెబ్బ తగిలే అవకాశముందని కూడా హెచ్చరికలు జారీ అవుతున్నాయి. వృద్ధులు, చిన్నారులు ఎండలకు బయటకు రాకుండా ఉండటమే మంచిదని సూచిస్తున్నారు. విద్యాసంస్థలకు కూడా ఒంటిపూట నిర్వహించాలన్న డిమాండ్ వినిపడుతుంది. పరీక్షల సమయంలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు వైద్యులు సూచిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు.

## ఉప్పల్ పిఎస్ పరిధి గాంధీ నగర్ లో దోపిడీ దొంగల హల్చల్...


ఉప్పల్ : గాంధీ నగర్ లోని నామన్ మార్కెటింగ్ హోల్ సేల్ కిరాణా షాపు షటర్ తొలగించి 7లక్షల రూపాయల నగదు దొచుకెళ్ళిన దోపిడీ దొంగలు. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నామన్ మార్కెటింగ్ హోల్ సేల్ కిరాణా షాపును గ్యాన్ చండ్ శర్మ, రామ్ కిషోర్ అనే ఇద్దరు 8సంవత్సరాలనుండి గాంధీనగర్లో నడిపిస్తున్నారు. ఈ నెల శనివారం 22న రాత్రి 9 గంటలకు రామ్ కిషోర్ షాప్ క్లోజ్ చేసి వెళ్లారు. 23 ఆదివారం తెల్లవారుజామున 5:30 హమాలి రాజు అనే వ్యక్తి నుండి షట్టర్ ఓపెన్ చేసి ఉందని ఫోన్ రావడం జరిగింది..షాప్ కి వచ్చి చూసే వరకు షాపులోని ఉన్న ఏడు లక్షల రూపాయల నగదును దొం గలు ఎత్తుకెళ్లారు...22వ శనివారం తేది అర్ధరాత్రి తరువాత, ఆదివారం 23న తెల్లవారుజామున షట్టర్ తొలగించి గుర్తు తెలియని దుండగులు ఏడు లక్షలు చోరీ చేశారు..షాప్ లోకి వెళ్లే ముందు దొంగలు షాప్ ముందు ఉన్నటువంటి సీసీటీవీ ని ఉంది బెండ్ చేసి, ఒక వ్యక్తి లోపలికి ప్రవేశించాడు... దొంగ షాప్ లోనికి ప్రవేశించి, నగదు దొంగలిస్తున్నటువంటి దృశ్యాలు షాపులో ఉన్నట్టు సీసీ కెమెరాలు రికార్డు అయ్యాయి.

## ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు

మలక్ పేట : ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు మలక్ పేట లోని పిన్ బదిరుల ఆశ్రమ పాఠశాలలో రమణ సింగ్ ఘనంగా నిర్వహించారు,కొండా విశ్వేశ్వరరెడ్డి సతీమణి డాక్టర్ కొండా సంగీత రెడ్డి హాజరై ఆశ్రమ చిన్నారుల మధ్యకేక్ కట్ చేశారు,అనంతరం చిన్నారులకు భోజనం ఏర్పాటు చేసి వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు.

# చిన్నారుల ట్రాఫికింగ్.. గాంధీనగర్ టూ హైదరాబాద్

హైదరాబాద్ : చిన్న పిల్లలతో వ్యాపారం చేసే ముఠాలు ఈ మధ్య కాలంలో రెచ్చిపోతున్నాయి. సంతానం లేని దంపతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని చేయకూడని నీచమైన పనులు చేస్తున్నారు కొందరు కేటుగాళ్లు. ఇలాంటి వారంతా ముఠాలుగా ఏర్పడి పెద్ద పెద్ద నెట్‌వర్క్‌లను ఫామ్ చేసి అప్పుడే పుట్టిన పసికందులను కిడ్నాప్ చేస్తూ దందాలు సాగిస్తున్నాయి. చైతన్యపురి పోలీసుల, మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులతో కలిసి ఓ స్టింగ్ ఆపరేషన్ చేశారు. ఈ ఆపరేషన్‌లో సంచలనం సృష్టించిన ఓ చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా గుట్టు రట్టు అయింది. అంతర్‌రాష్ట్ర గ్యాంగ్‌కు చెందిన 11 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అప్పుడే పుట్టిన శిశువులను తీసుకొచ్చి అవసరమైన తల్లిదండ్రులకు అమ్మకాలు చేస్తున్నారు. అప్పుడే పుట్టిన నలుగురు పిల్లల అమ్మకాలు చేయనీయకుండా అడ్డుకున్నారు. వీళ్లంతా కలిసి ఓ నెట్‌వర్క్‌గా ఏర్పడి వివిధ రాష్ట్రాల్లో టీంలను ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు తాజాగా గుజరాత్ నుంచి పిల్లలను తీసుకొచ్చి అమ్మకాలు సాగించారు. విషయం ముందే తెలుసుకున్న పోలీసులు స్టింగ్ ఆపరేషన్ చేపట్టారు. అంతే ముఠా గుట్టు వీడింది. వీళ్లతోపాటు చట్ట విరుద్ధంగా పిల్లలను కొంటున్న తల్లిదండ్రులను కూడా అరెస్టు చేశారు. ఈ ముఠాకు చెందిన వారు గుజరాత్‌లో పిల్లల్ని పోషించలేని తల్లిదండ్రులను పట్టుకుంటారు. వారికి డబ్బులను ఎర చూపించి అప్పుడే పుట్టిన పిల్లల్ని కొనుక్కొని తీసుకొస్తారు. హైదరాబాద్‌లో ఉన్న ముఠా సభ్యులు ముందుగానే ఇక్కడ కొనే వ్యక్తులను గుర్తించి వారితో మాట్లాడి పెడతారు. అలా తీసుకొచ్చిన బిడ్డల్ని వాళ్లకు ఇచ్చి డబ్బులు తీసుకుంటారు. గుజరాత్ నుంచి తీసుకొచ్చే ఆడ శిశువును రెండున్నర లక్షలకు, మగ శిశువు అయితే నాలుగున్నర లక్షల రూపాయలకు అమ్ముతున్నారు. ముందుగా కొంత డబ్బులు ఇచ్చిన తర్వాతే వీళ్లకు బిడ్డల్ని తీసుకొచ్చి ఇస్తారు. గుజరాత్ నుంచి హైదరాబాద్ వరకు ఇదో పెద్ద నెట్‌వర్క్ అనిపోలీసులు చెబుతున్నారు. ఇంకా ఇందులో ఉన్న వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు అంటున్నారు. ప్రస్తుతం చిక్కిన వారిని విచారించి మరిన్ని వివరాలు రాబడతామన్నారు. చిన్న పిల్లలు ఉన్న తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పార్కులు, సినిమా థియేటర్లు వంటి జన సంచారం ఎక్కువగా ఉండే పబ్లిక్ ప్లేసుల్లో ఈ ముఠాలు తిరుగుతుంటాయని తెలిపారు. ఒంటరిగా ఉండే చిన్న పిల్లల్ని టార్గెట్ చేసి ఎత్తుకుపోతుంటారని.. వేరే రాష్ట్రాల్లో ఆ పిల్లల్ని విక్రయిస్తుంటారని తెలిపారు. కాబట్టి పిల్లల్ని ఒంటరిగా వదలొద్దని.. వారిపై ఓ కన్నేసి ఉంచాలని సూచిస్తున్నారు. మరీ ముఖ్యంగా జన సంచారం ఎక్కువగా ఉండే పబ్లిక్ ప్లేసుల్లో అపరిచత వ్యక్తులకు పిల్లల్ని ఆడించేందుకు ఇవ్వొద్దని పోలీసులు చెబుతున్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.



# రూ. 3 కోట్ల యంత్రాలు మూలకు...

**మూలకు పడ్డ రూ.లక్షల విలువైన వెంటిలేటర్లు**

**- రెండేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం**

**- మరమ్మతు చేస్తే వినియోగంలోకి వైద్య యంత్రాలు, పరికరాలు**

**- రూ. 20 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు**

**- నిధుల కోసం ఎదురుచూస్తున్న జనరల్ ఆసుపత్రి అధికారులు**



మహబూబ్‌నగర్ : ఉమ్మడి జిల్లా నిరు పేదలకు వరం గా ఉన్న మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో రూ. 3 కోట్ల వైద్య పరికరాలు, యంత్రాలు, పనిము ట్లు మూలకు చేరాయి. గత రెండేళ్లుగా అవి మర మ్మతులకు నోచుకోవడం లేదు. వాటిని బాగు చే యించాలంటే దాదాపు రూ. 20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కానీ ఆ నిధులు లేక కోట్ల రూపాయల విలువైన యంత్రాలు పాడైపోయే స్థితికి చేరుకున్నా యి. ఇందుకోసం తమకు నిధులు కావాలని జనరల్ ఆసుపత్రి అధికారులు ఇటు ప్రజాప్రతినిధులకు, అటు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు మొర పెట్టు కుంటూనే ఉన్నారు. అయినా ఎవరు కూడా స్పం దించడం లేదు. ఫలితంగా యంత్రాలు మూలకు చేరడంతో పేద ప్రజలు నాణ్యమైన వైద్యానికి దూరమవుతున్నారు.

**యంత్రాలు మూలకు...**

జనరల్ ఆసుపత్రికి అత్యవసర పరిస్థితి కోవిడ్ సమయంలోనే కాకుండా ఇతర సమయాలలో కూ డా కొన్ని కోట్ల విలువైన యంత్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే రోగుల తాకిడి ఎక్కువగా ఉండటం, వాటి వినియోగానికి మించి వాడ టంతో కొన్ని మూలకు పడ్డాయి. అందులో ప్రధానం గా వెంటిలేటర్లు, సిపాప్ మిషన్లు. ప్రస్తుతం 30 వెంటిలేటర్లు, 40 సిపాప్ మిషన్లు మూలకు పడి ఉన్నాయి. అదేవిధంగా ఒకటి 400 ఎంఏ ఎక్స్‌రే యంత్రం, 8 ఎలక్ట్రిక్ ఓటి టేబుళ్లు, 8 గైనిక్ ఓటి టే బుళ్లు, 25 ఐసీయూ పడకలు, సర్జికల్ మైక్రోస్కోప్, బీపీ ఆపరేటర్లు, 3 అల్ట్రాసౌండ్ మిషన్లు ఉన్నాయి. వీటి ఖరీదు బయటి మార్కెట్‌లో దాదాపు రూ. 3 కోట్లకు పైనే ఉం టుందని జనరల్ ఆసుపత్రి అధి కారులు చెబుతున్నారు.

**రూ. 20 లక్షలతో ప్రతిపాదనలు...**

ఆసుపత్రిలో కాంటాప్ట్ కింద వేసిన వైద్య పరి కరాలను బయటకు తీసి బయోమెడికల్ ఇంజనీ రింగ్ అధికారుల తో ప్రతిపాదనలు తయారు చే యించారు. ఆ ప్రతిపాదనలను ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు పంపించారు. రూ. 3 కోట్ల విలువైన వైద్య పరికరాలు కేవ లం రూ. 20 లక్షలతో బాగు చేయిస్తే ప్రభుత్వా నికి రూ. 3 కోట్లు మిగులుతాయని భావించి ఈ ప్రతిపాదనలు రూపొందించారు. అయితే కొన్ని చిన్న చిన్న పరికరాలను ఆసుపత్రి అభివృద్ధి కమి టీ నిధులతో బాగు చేయించి అందుబాటులోకి తెచ్చారు.

**మరమ్మతులేవీ?**

జనరల్ ఆసుపత్రికి వచ్చిన ఈ మిషన్లు ఎక్కువ గా వాడటంతో అవి పనిచేయకుండా ఉన్నాయి. అ యితే గత రెండేళ్ల క్రితం ఉన్న బయోమెడికల్ ఇం జనీర్లు వాటిని మరమ్మతులు చేయించకుండా ప క్కన పెట్టేశారు. దీంతో అవి మూలకు చేరాయి. వా స్తవానికి అవి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వాటిని స్క్రాప్ కిందకు వేశారు. ప్రభుత్వ ధనాన్ని వృథా చేయకుండా సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్ వాటిని మరమ్మతులు చేయించే అవకాశం ఉందని గుర్తించారు. బయోమెడికల్ ఇంజనీర్‌తో పాటు సర్వీస్ కాంట్రాక్టరుతో వాటిని చెక్ చేయించారు. దీంతో అవి బాగు చేయిస్తే వినియోగంలోకి వస్తాయని చెప్పడంతో అన్నింటిని బయటకు తీయించారు.

**వినియోగంలోకి వస్తే ఎంతో మేలు...**

మూలకు పడ్డ యంత్రాలలో ప్రధానమైనవి వెం టిలేటర్లు 30. సి పాప్ మిషన్లు 40 వరకు ఉన్నా యి. వాటిని బాగు చేయిస్తే ఐసీయూతో పాటు ఇ తర వార్డుల్లో కూడా వెంటిలేటర్ సౌకర్యాన్ని కల్పిం చే అవకాశం ఉంది. దీంతో పాటు 400 ఎంఏ సా మర్థ్యం గల ఎక్స్‌రే మిషన్ ను బాగుచేయిస్తే రోజుకు వందల ఎక్స్‌రేలు చేసేందుకు అవకాశం ఉంటుంది. దీని వలన రోగులకు వేగవంతంగా వైద్యసేవలు అందించవచ్చు. అదేవిధంగా ఆపరేషన్ థియేటర్‌లో ఉండే ఎలక్ట్రిక్ ఓటీ టేబుళ్లు బాగుచేయిస్తే గైనిక్‌తో పాటు జనరల్ సర్జరీలు కూడా రోజుకు వందల్లో చేయవచ్చు. సర్జికల్ మైక్రోస్కోప్‌తో కూడా ఎన్నో ఈఎన్‌టీ సర్జరీలు చేయవచ్చు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి నిధులు మంజూరు చేస్తే పేద ప్రజలకు మేలు జరిగే అవకాశం లేకపోలేదు.

# భారీ డిమాండ్లతో భార్యా బాధితుల సంఘం

విజయవాడ : సమాజంలో ఇటీవల భార్యాబాధితుల సమస్యలపై చర్చ జరుగుతోంది. భార్యలకు ఏ సమస్యల వచ్చినా.. వారి తరపున నిలబడేందుకు మహిళా సంఘాలు ఉన్నాయి. భర్తలకు వచ్చిన సమస్యలను తీర్చేందుకు ఏ సంఘం ముందుకు రాదు. ఈ నేపథ్యంలోనే భార్యాబాధితుల సంఘం ఏర్పడింది.దేశంలోని మొదటి సారిగా భార్యాబాధితుల సంఘం 2010లో ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో పురుడు పోసుకుంది. అనంతరం దేశ వ్యాప్తంగా విస్తరించింది. తాడేపల్లిగూడెం, నందిగామ, హైదరాబాద్, ఖమ్మం లో బలమైన కమిటీలతో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. 2010లో 35 మందితో భార్యా బాధితుల సంఘం ఏర్పడింది. ఈ సంఘంలో ప్రస్తుతం సుమారు 10 వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. 25 మంది క్రియాశీలకంగా కోర్ కమిటీగా ఏర్పడి సంఘం తరపున న్యాయం కోసం గళం విప్పుతున్నారు. అమెరికా , మలేషియా, దుబాయ్‌ల నుంచి కూడా భార్యా బాధితులు

**- 15 ఏళ్ల కిందట పురుడు**

ఫోన్‌లో సంప్రదిస్తున్నారని.. జాతీయ అధ్యక్షుడు జి.బాలాజీ రెడ్డి తెలిపారు. భార్యా బాధితుల రక్షణ కోసం చట్టాలు రావాల్సిందేనని అంటున్నారు. గౌరవం కోల్పోతున్నామని, మనశ్శాంతి ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందరో బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, తప్పు లేకుండా పరిహారాలు కోరవద్దని అన్నారు. తమ ఆస్తులకు తమను దూరం చేస్తున్నారని, భార్యలతో ఇబ్బంది పడే భర్తల తరపున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

13 డిమాండ్లు..

1. భార్యలు ఎన్ని రకాల కేసులు పెడితే అన్ని రకాల కేసులకు.. భర్తలు, భర్తల కుటుంబాలందరికీ కూడా కౌన్సెలింగ్‌లు ఇచ్చి సరైన న్యాయం జరిగేలా చూడాలి.
2.భార్యలు ఎన్ని రకాల కేసులు పెడితే అన్ని రకాల కేసులకు హాజరుకావాలి. అలా రెండుసార్లు హాజరుకాని పక్షంలో ఆ కేసులను పూర్తిగా రద్దు చేయాలి.
3.498 (ఏ) గృహ హింస కేసు పెట్టిన ఏడాది తరువాత కేసు తేలినా, తేలకపోయినా కోర్టు విడాకులు మాంజూరు చేసి.. రెండో వివాహానికి అనుమతి ఇవ్వాలి.
4.498 (ఏ) గృహ హింస తప్పుడు కేసు అని తేలితే.. భార్య, భార్య తల్లిదండ్రులకు మూడేళ్ల జైలు శిక్ష, భర్తలకు నష్టపరిహారం, పరువు మర్యాదలు ఇప్పించాలి.
5.ఎంసీ, డీవీసీ (డొమెస్టిక్ వైలన్స్)లను చట్టం నుంచి పూర్తిగా రద్దు చేసి.. పెండింగ్‌లో ఉన్న కేసులను రద్దు చేయాలి. జైలు శిక్షలు అనుభవిస్తున్న వారిని వెంటనే విడుదల చేయాలి.
6. పూర్వం ఈ కేసుల వల్ల నష్టపోయిన వారికి భార్యలతో ఆ నష్టపరిహారాన్ని ఇప్పించాలి. ఏడాది పాటు భార్యలకు, భార్యల తల్లిదండ్రులకు జైలు శిక్ష విధించాలి.
7. గృహ హింస కేసు పెట్టిన తరువాత.. భార్యా భర్తలిద్దరి శాంపిల్స్ డీఎన్ఏ టెస్ట్‌లకు పంపాలి.
8. భార్యలు కేసులు పెట్టిన తరువాత ఒక వేళ పిల్లలు ఉంటే.. భార్యల వద్ద నాలుగు రోజులు, భర్తల వద్ద మూడు రోజులు ఉండేటట్లు అనుమతి ఇవ్వాలి.
9. భర్తలు అవసరం లేదని వెళ్లిన భార్యలకు నష్టపరిహారం చెల్లించకూడదు.
10. భార్యలు పెట్టిన కేసుల వల్ల భర్తలకు ఉద్యోగాలు పోకుండా చూడాలి. భర్తలు, వారి తల్లిదండ్రులు కష్టపడి సంపాదించుకున్న ఆస్తిపాస్తులు భార్యా పిల్లలకు చెందకూడదు.
11. పెళ్లి అయిన ఏడాది తరువాత నుంచి భార్యలు పుట్టింటికి చూడటానికి వెళ్తే.. నెల రోజుల లోపు భర్తల దగ్గరకు రావాలి. అలా రాకపోతే భర్తలకు విడాకులు మంజూరు చేయాలి.
12. భర్తల దగ్గర నుంచి భార్యలు విడాకులు తీసుకున్న తరువాత.. భార్యలు, పిల్లలు భర్తల ఇంటి పేర్లను ఎటువంటి వాటిలో ఉపయోగించకూడదు. అలా ఉపయోగించిన పక్షంలో కోర్టు శిక్ష విధించాలి.
13. మహిళలకు ఎటువంటి చట్టాలు, పథకాలు ఇచ్చారో.. అలాంటి చట్టాలు, పథకాలు పురుషులకు కూడా ఇవ్వాలి.

# కుంకీ ఏనుగులు ఎప్పుడొస్తాయి...

తిరుపతి : ఏపీలో ఏనుగుల దాడుల్ని నివారించేందుకు కర్ణాటక నుంచి శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల్ని తెచ్చేందుకు ఆ రాష్ట్రంతో ఒప్పందం చేసుకుని ఐదు నెలలు దాటింది. గత ఏడాది ఆగస్టు 8న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వయంగా బెంగుళూరు వెళ్లి కుంకీ ఏనుగుల కోసం సీఎం సిద్ధరామయ్యను అభ్యర్థించారు. ఆ తర్వాత కర్ణాటక అటవీ శాఖతో గత ఏడాది సెప్టెంబర్ 27న కుంకీ ఏనుగుల కోసం విజయవాడలో ఒప్పందం చేసుకున్నారు. కర్ణాటకలో శిక్షణ పొందిన ఏనుగులతో ఏపీకి చెందిన అటవీ సిబ్బంది శిక్షణ కూడా ఇప్పిస్తున్నట్టు ప్రచారం జరిగింది. ఐదు నెలలు గడిచినా కుంకీ ఏనుగుల జాడ మాత్రం లేదు. కర్ణాటక నుంచి 8 కుంకీ ఏనుగులను ఆంధ్రప్రదేశ్ పంపేందుకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య సెప్టెంబర్ 27న విజయవాడలో అవగాహన ఒప్పందం జరిగింది. దీంతో కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు వచ్చేస్తాయని అటవీ శాఖ చెప్పింది. దీంతో చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రలతో తరచూ ఏనుగుల దాడులకు ముగింపు లభిస్తుందని భావించారు. కుంకీ ఏనుగుల కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవడంతో వీలైనంత త్వరగా ఏనుగులు ఏపీకీ వచ్చేస్తాయని భావించారు. అయితే అటవీ శాఖ నియమనిబంధనలు ఏనుగుల తరలింపుకు అడ్డంకిగా మారాయి. వన్య ప్రాణుల తరలింపు, వాటి సంరక్షణ విషయంలో ఉన్న నిబంధనలతో ఏపీకి కుంకీ ఏనుగుల తరలింపు ఆలస్యమైనట్టు తెలుస్తోందిఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, కడప జిల్లాలకు పొరుగు రాష్ట్రాలతో సరిహద్దులు ఉన్నాయి. చిత్తూరు జిల్లాకు తమిళనాడు, కర్ణాటక అటవీ ప్రాంతాల నుంచి వచ్చే ఏనుగులు తరచూ దాడులు చేస్తున్నాయి. ఇటు ఉత్తరాంధ్రలో ఒడిశా అటవీ ప్రాంతం నుంచి వచ్చే ఏనుగులు తరచూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. అటవీ ప్రాంతాలకు దగ్గర్లో ఉన్న గ్రామాల్లోని పంట పొలాలు, ఊళ్లపై ఏనుగుల మందలు తరచుగా దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ప్రాణ నష్టం జరుగుతోంది. గ్రామస్తులు కొన్ని సార్లు ఏనుగులు అదలించి, శబ్దాలు చేసి తరిమి కొడుతున్నా తరచూ గాయపడటమో, ప్రాణ నష్టమో తప్పడం లేదు. ఏనుగులు గుంపు, గుంపులుగా దాడులు చేస్తే భారీ నష్టం వాటిల్లుతోంది. ఏనుగులు మందలుగా పంటల్ని సర్వనాశనం చేస్తున్నాయి. కనిపించిన మనుషుల్ని తొక్కి చంపేస్తున్నాయి. ఏపీలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తూ ఉన్నాయి. సాధారణంగా వీటిని ఎదుర్కోవడం, వాటిని అడవుల్లోకి తిప్పి పంపడం కష్టం. అదే శిక్షణ పొంన కుంకీలతో వాటిని కట్టడి చేయడం సులువుగా ఉంటుంది. వాటిలో సుశిక్షుతులైన మావటిలు జనావాసాల్లోకి వచ్చిన ఏనుగుల్ని వెనక్కి తరుముతారు. అడవుల్లో ఒంటరిగా తిరిగి మగ ఏనుగుల్ని బంధించి కుంకీ ఏనుగులుగా లొంగదీసుకుంటారు. ఏనుగుల మందల్ని అడవుల్లోకి తరమడంలో ఇవి సమర్థంగా వ్యవహరిస్తాయి. ఒక్కోసారి వాటితో తలపడతాయి. బలంగా, వయసులో ఉన్న ఏనుగుల్ని పోరాటాల కోసం తయారు చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల కొరత ఉంది. ప్రస్తుతం ఏపీలో జయంత్, వినాయక్ అనే రెండు కుంకీలు ఉన్నాయి. అయితే అవి వయసు పైబడ్డాయి. చిత్తూరు జిల్లా కౌండిన్య అడవుల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ననియాల సంరక్షణ కేంద్రంలో ఈ రెండు ఉన్నాయి. ప్రస్తుతం ఎక్కడకు పడితే అక్కడకు తరలించేందుకు అనువుగా లేవు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఏనుగులు దాడి జరిగినా వీటినే తీసుకు వెళ్లేవారు. వృద్ధాప్యంలో ఉన్న ఏనుగులతో మందలపై యుద్ధాలకు వెళ్లడం సాధ్యం కాకపోవడంతో కర్ణాటకతో ఒప్పందం చేసుకున్నారు. కర్ణాటకతో చేసుకున్న ఒప్పందం మేరకు ఏపీకి 8 కుంకీ ఏనుగులు రావాల్సి ఉంది. అయితే సాంకేతిక కారణాలతో వీటి రాక ఆలస్యమైనట్టు అటవీ శాఖ చెబుతోంది. ప్రస్తుతం కర్ణాటక అటవీ శాఖ మంత్రి వద్ద కుంకీల బదలాయింపు ఫైల్ పెండింగ్‌లో ఉంది. అక్కడ నుంచి కర్ణాటక సీఎం అమోదం లభించాల్సి ఉంటుంది. తొలివిడతలో మార్చిలోగా నాలుగు కుంకీ ఏనుగులు ఏపీకి వస్తాయని చెబుతున్నారు. మరోవైపు కర్ణాటక నుంచి వచ్చే ఏనుగుల కోసం మావటిలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. కొత్త ఏనుగులను అదుపులో ఉంచేందుకు మావటిలను సిద్ధం చేస్తున్నారు. కుంకీల అవసరం, వాటి దాడుల నేపథ్యంలో ఏపీలోనే శాశ్వతంగా కుంకీల తయారీ చేపట్టాలని డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా అటవీ శాఖ సన్నద్ధం అవుతోంది.

# ఉక్కులో ఉద్యోగాల కోత?

## కాంట్రాక్టుకు క్వాలిటీ ఎష్యూరెన్స్ - అండ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ (క్యుఏటీడీ) విభాగం

విశాఖపట్నం : స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడానికి అన్నిరకాల ప్రయత్నాలూ చేస్తోంది. దశల వారీగా ఒక్కో విభాగాన్ని ప్రైవేటుకు అప్పగించేందుకు చర్యలు చేపడుతోంది. తాజాగా ప్లాంటులో అత్యంత కీలకమైన క్వాలిటీ ఎష్యూరెన్స్ అండ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ (క్యుఏటీడీ) విభాగాన్ని కాంట్రాక్ట్‌కు ఇస్తామంటూ మూడు రోజుల క్రితం ప్రకటన జారీచేసింది. ఇది అత్యంత కీలకమైన విభాగం. ఇక్కడ సుమారుగా 100 మంది వరకు శాశ్వత ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్లాంటుకు వచ్చే రా మెటీరియల్ నుంచి వీరు శాంపిల్స్ సేకరించి, నిర్దేశించిన నాణ్యతకు అనుగుణంగా ఉన్నాయా? లేదా? అని పరీక్షించి సర్టిఫై చేస్తారు. అలాగే దశల వారీగా జరిగే ఉక్కు ఉత్పత్తిలో కూడా నమూనాలు తీసి, వాటి నాణ్యతను కూడా నివేదిస్తారు. ఇక్కడ ఎన్ఎంఆర్‌లు కూడా కొంతమంది పనిచేస్తున్నారు. ఇప్పుడు ఈ విభాగం నిర్వహణ మొత్తం కాంట్రాక్టుకు ఇస్తామని, అందుకుగాను ఏడాదికి రూ. 4.2 కోట్లు చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించింది. అంటే ఎంతమందిని పనికి పెట్టుకుంటారనే దానితో సంబంధం లేకుండా నమూనాలు సేకరించి, నివేదికలు ఇస్తే చాలనే ధోరణి కనపడుతోంది. కొత్తగా కాంట్రాక్ట్ తీసుకునే వారికి ఈ పనులన్నీ నేర్పించిన తరువాత ఈ విభాగంలో పనిచేస్తున్న వారిని అక్కడి నుంచి తప్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇది పూర్తయిన వెంటనే రోలింగ్ మిల్స్‌ను కూడా కాంట్రాక్టుకు ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని ఉద్యోగ వర్గాల సమాచారం. ఒకపక్క వీఆర్ఎస్ పేరుతో 1,100 మందిని ఇంటికి పంపించేస్తూ, మరోవైపు మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఉద్యోగులను తగ్గించినప్పుడు పూర్తిస్థాయి ఉత్పత్తి ఎలా సాధ్యమని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఫిబ్రవరి నెలకు సంబంధించి రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 92 శాతం ఉత్పత్తి తీయాలని లక్ష్యం ఇస్తే, ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ దానిని మించి చేశామంటున్నాయి.

**నిర్వాసితులకు ఇక ఉద్యోగాలు రానట్టేనా!?**

స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతులకు ఉద్యోగాలు ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. వారిలో కొందరికే ఇచ్చారు. ఇంకా ఉద్యోగాలు పొందాల్సిన నిర్వాసితులు ఎనిమిది వేల మంది ఉన్నారు. ప్లాంటు విస్తరిస్తే తమకు ఉపాధి దొరుకుతుందని వారి వారసులు ఎదురుచూస్తున్నారు. అయితే యాజమాన్యం ఉన్నవారినే తొలగించుకుంటూ పోతుంటే...ఇక కొత్త ఉద్యోగాలు ఎక్కడ వస్తాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనిని బట్టి భవిష్యత్తులో నిర్వాసితులకు ఉద్యోగాలు దొరికే అవకాశమే లేదనే వాదన వినిపిస్తోంది.

# మూడు, రెండు పద్ధతిలో ఎమ్మెల్సీ సీట్లు

కడప : ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అప్పుడే సందడి మొదలైంది. ఎమ్మెల్సీ సీటు కోసం ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కేవలం ఐదు సీట్లు కావడంతో కూటమి పార్టీల మధ్య బలమైన పోటీ నెలకొంది. ఇందులో జనసేనకు ఒకటి ఖాయమైంది. కాకపోతే బీజేపీ కూడా మాకు ఇవ్వాలని పట్టుబడినట్టు వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే టీడీపీకి కేవలం మూడు మాత్రమే మిగలనున్నాయి. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 3న ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎమ్మెల్యే కోటాలో జరుగుతుండడంతో అవన్నీ ఏకగ్రీవంగా ఎన్నిక జరగనుంది. ముఖ్యంగా కూటమి పార్టీల నుంచి అభ్యర్థులంతా ఎన్నిక కానున్నారు. ఏపీలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు కూటమి నేతల మధ్య పోటీ నెలకొంది. పదవీకాలం ముగిసిన వారిలో జంగా కృష్ణమూర్తి , దువ్వారపు రామారావు, యనమల, అశోక్‌బాబు, తిరుమలనాయుడులకు మార్చి 29న ముగియనుంది. ఇందులో జంగా కృష్ణమూర్తి మినహా అంతా టీడీపీకి చెందినవారు. ఎన్నికలకు ముందు జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరారు. ఎమ్మెల్సీ స్థానాలకు టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి బలమైన పోటీ ఉంది. జనసేన నుంచి నాగబాబు సీటు ఖాయం. ఆ తర్వాత ఆయన్ని కేబినెట్‌లోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇదివరకే చెప్పారు. ఇకపోతే బీజేపీ వంతైంది. మిత్ర ధర్మ ప్రకారం ఒక సీటు కేటాయిస్తారని ఆ పార్టీ నేతలు అంచనాలు పెట్టుకున్నారు. ఒక్కసీటు కోసం గోదావరి జిల్లాల నుంచి సోము వీర్రాజు, ఉత్తరాంధ్ర నుంచి మాధవ్, రాయలసీమ నుంచి ఒకరు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. ఆ సీటును బీజేపీకి కేటాయిస్తే టీడీపీకి నాలుగు ఎమ్మెల్సీ సీట్లు దక్కే అవకాశముంది. ఇక టీడీపీ విషయానికి వద్దాం. ఒకవేళ బీజేపీకి గనుక ఒక్కసీటు కేటాయిస్తే టీడీపీకి మూడు మాత్రమే మిగలనున్నాయి. పిఠాపురం నుంచి వర్మ, బెడవాడ నుంచి వంగవీటి రాధ, దేవినేని ఉమామహేశ్వరరావు రేసులో ఉన్నారు. బీసీ కోటాలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, మైనారిటీ కోటాలో విశాఖకు చెందిన ఎండీ నజీర్ పోటీపడుతున్నారు. వసంత కృష్ణ ప్రసాద్ కోసం మైలవరం సీటును దేవినేని త్యాగం చేశారు. దీంతో ఆయనకు సీటు ఇస్తారన్నది కొందరు నేతల మాట. ఇక వంగవీటి రాధ ఎప్పటినుంచో పార్టీలో కొనసాగుతున్నారు. ఈసారి రేసులో ఆయన ఉన్నట్లు బలంగా సంకేతాలు వస్తున్నాయి. గతంలో చాలా సార్లు ఎమ్మెల్సీ రేసులో ఆయన పేరు వినిపించింది. దీనికితోడు పదవీకాలం ముగియనున్న నేతల్లో జంగా కృష్ణమూర్తి , దువ్వారపు రామారావు, యనమల సైతం రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎలా ముందుకు వెళ్లాలని అనేదానిపై కొందరు నేతలతో అధినేత మంతనాలు జరిపినట్టు సమాచారం. వీరిలో కొందరికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చి పార్టీకి నమ్మినబంటుగా ఉన్నవారికి ఎమ్మెల్సీ సీట్లు ఇస్తారని అంటున్నారు. ఏదిఏమైనా బడ్జెట్ సమావేశాలు పూర్తి అయ్యేసరికి సీట్లపై ఓ కొలిక్కి రావచ్చని అంటున్నారు.

# తునిలో వైసీపీకి దెబ్బ

కాకినాడ : తుని మున్సిపల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక విషయంలో టీడీపీ, వైసీపీ మధ్య రాజుకున్న ఆధిపత్య పోరులో క్రమక్రమంగా వైసీపీ పట్టు తప్పుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా వైసీపీకి చెందిన అయిదుగురు కౌన్సిలర్లు రాజీనామా చేయడంతో వైసీపీ బలం 12 మందికి పడిపోగా టీడీపీ 16 మందితో ఛైర్మన్‌గిరి దక్కించుకోవడానికి సిద్ధ పడుతోంది. దీంతో ముందస్తుగానే తుని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి రాజీనామా చేశారు. మున్సిపాలిటీలో తమకు 18 మంది బలం ఉందని వైసీపీ చెబుతూ రాగా అప్పటికి 15మంది మాత్రమే హాజరు అవుతుండగా అందులో ముగ్గురు మున్సిపల్ సమావేశానికి గైర్హాజరు అయ్యారు. మరో ముగ్గురు టీడీపీ క్యాంప్‌లో చేరారు. దీంతో వైసీపీ బలం 12కు పడిపోయింది. అయితే తన పదవికి రాజీనామా చేసిన ఛైర్‌పర్సన్ సుధారాణి తాను సాధారణ కౌన్సిలర్‌గానే కొనసాగుతానని వెల్లడిరచినట్లు తెలుస్తోంది. తుని మున్సిపల్‌లో 30 మంది కౌన్సిలర్లుకు ప్రస్తుతం 28 మంది వరకు కౌన్సిలర్లు ఉండగా వీరిలో 18 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉండగా మిగిలిన 10 మంది టీడీపీ కౌన్సిలర్లు.. ఇదిలా ఉంటే మున్సిపల్ వైస్ ఛైర్మన్ పదవికోసం టీడీపీ, వైసీపీ పోటీ పడుతున్నాయి. దీంతో ఇటీవల పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఇప్పటికే మూడు సార్లు వాయిదా పడిన తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నాలుగోసారికూడా మళ్లీ వాయిదాపడిండి. దీని వెనుక మాజీ మంత్రి దాడిశెట్టి రాజానే కారణమని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. పది మంది వరకు వైసీపీ కౌన్సిలర్లు వైసీపీను వీడి టీడీపీలో చేరారు. వీరిని మాజీ మంత్రి యనమల రామృకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఒక్కొక్కరూ పార్టీని వీడిపోవడంపై రాజీనామా చేయాలని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కౌన్సిలర్లుపై ఒత్తిడి తెచ్చారని, అయితే తాము రాజీనామా చేయమని తేల్చిచెప్పి టీడీపీలో చేరినట్లు వారు చెబుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద తుని పురపాలక సంఘం టీడీపీ ఖాతాలో ఖరారు కాబోతున్న పరిస్థితి కనిపిస్తోందితుని పట్టణంలో శాంతి భద్రతలు ఉండేందుకే తాను తన ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఏలూరి సుధారాణి అన్నారు. తన రాజకీయ చరిత్రలో మహిళా ప్రజాప్రతినిధిపై కేసు పెట్టిన ఘనత యనమల కుటుంబానికే చెల్లుతుందన్నారు. కౌన్సిలర్లును మేము నిర్భంధించినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తూ తనపైనా, వైసీపీ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజాపై కేసులు పెట్టారన్నారు. వైస్ ఛైర్మన్ ఎలాగూ దౌర్జన్యంతో లాక్కుంటున్నారని, వారికి కావాల్సింది ఇక ఛైర్మన్ పదవి అని, వారికి కావాల్సిన ఎజెండా నెరవేర్చుకునేందుకు అధికారమధంతో తమ కౌన్సిలర్లుపై దాడులకు తెగబడుతున్నారని, అందుకే తానే రాజీనామా చేసినట్లు తెలిపారు.

# ఆ రెండు పథకాలకు గ్రీన్ సిగ్నల్

విజయవాడ : ఏపీ ప్రజలకు మంత్రి నారా లోకేష్ గుడ్ న్యూస్ చెప్పారు. ఏకంగా రెండు పథకాలను అమలు చేసే విషయంపై నారా లోకేష్ శాసనమండలిలో ప్రకటించడం విశేషం. ఎప్పుడెప్పుడా అంటూ ఏపీ ప్రజలు సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురుచూపులు చూస్తున్న సమయంలో, నారా లోకేష్ చేసిన ప్రకటన పెద్ద ఊరట నిచ్చిందని చెప్పవచ్చు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని, వైసీపీ విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో లోకేష్ ప్రకటనతో ఆ విమర్శలకు ఫుల్ స్టాప్ పడినట్లే. ఏపీలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే హామీని గుప్పించి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే దీపం పథకం 2.నీ మినహాయించి మరే పథకం ప్రారంభం కాకపోవడంతో ప్రజలు సైతం ప్రభుత్వ ప్రకటనల కోసం ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి. అయితే ప్రభుత్వం ఏర్పడిన ఉంటేనే వరదలు రావడంతో, ప్రభుత్వ నష్టపోయిన రైతులను ఆదుకుంది. అంతేకాదు గ్రామీణ ప్రాంతాలలో రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించి, గుంతలు లేని రాష్ట్రంగా గుర్తించబడేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. ఓ దశలో సీఎం చంద్రబాబు సైతం గత ప్రభుత్వం చేసిన అరాచకంతో ప్రజలకు త్వరగా సూపర్ సిక్స్ పథకాలను అందించలేక పోతున్నామని నిట్టూర్చారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లో తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ సైతం ఇచ్చారు. ఇటువంటి సమయంలో వైసీపీ, కాంగ్రెస్ పార్టీ లు సూపర్ సిక్స్ ఎక్కడ అంటూ సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటం పెట్టే ప్రయత్నాలకు పూనుకున్నాయి. అందుకే శాసనమండలిలో మంత్రి నారా లోకేష్ సూపర్ సిక్స్ పథకాలపై మంగళవారం కీలక ప్రకటన చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేలు అందించనున్నట్లు, అలాగే రైతన్నలకు అండగా నిలిచేందుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ఏడాదికి రూ. 20 వేలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైందంటూ లోకేష్ ప్రకటించారు. ఈ రెండు పథకాలను ఏప్రిల్, మే నెలలో ప్రారంభిస్తామని, అర్హత గల ప్రతి లబ్ధిదారునికి ప్రయోజనం చేకూరుస్తామన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తుందని, ప్రజలకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని లోకేష్ అన్నారు. గత ప్రభుత్వం పింఛన్ నగదు పెంపుపై దోబూచులాడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట మేరకు పింఛన్ నగదును పెంచిందని లోకేష్ శాసనమండలిలో తెలిపారు. మొత్తం మీద ఏప్రిల్, మే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు రాష్ట్రంలో అమలు కానున్నట్లు లోకేష్ ప్రకటనతో క్లారిటీ వచ్చింది. సూపర్ సిక్స్ లో ఈ పథకాలు అమలైతే, మూడు పథకాలు అమలులోకి వచ్చినట్లుగా భావించవచ్చు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలో తల్లికి వందనం ప్రారంభం కానుండగా, ఆ సమయంలో పథకం అమలు కావడమే మంచిదిగా ప్రజలు భావిస్తున్నారు. అలాగే అన్నదాత సుఖీభవ స్కీమ్ కూడా ప్రారంభం కానున్నట్లు లోకేష్ చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జీవీరెడ్డి బాటలో మరింత మంది...?

విజయవాడ : టీడీపీ అధిష్టానంపై కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారా? ధిక్కార స్వరం వినిపించే సమయం కోసం ఎదురు చూపుల్లో ఉన్నారా? ఆ ప్రభావమే జీవీ రెడ్డి రాజీనామాతో బహిర్గతమైందా? వైసీపీ దారిలో టీడీపీ వెళ్తుందని కార్యకర్తల కామెంట్స్ వెనుక అసలు కారణం ఏమిటి? పాలన తప్ప కార్యకర్తలను పట్టించుకోవడం లేదన్న విమర్శలలో వాస్తవమెంతఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ గా జీవీ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. టీడీపీ అధికారంలో లేని సమయంలో వైసీపీ తన విమర్శలతో ముచ్చెమటలు పట్టించిన వారిలో జీవీ రెడ్డి ఒకరు. జీవీరెడ్డి లైన్ దాటకుండా విమర్శలు గుప్పిస్తారని, అదే ఆయనకు పార్టీలో సుస్థిర స్థానం కల్పించిందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అందుకే సీఎం చంద్రబాబు కూడా జీవీరెడ్డికి ప్రాధాన్యత కల్పిస్తూ, ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ గా నియమింపజేశారు. అలా భాధ్యతలు స్వీకరించారో లేదో ఛైర్మన్ స్థాయిలో ఆయన పూర్తి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఈ దశలో ఎండీగా ఉన్న దినేష్ ఐఏఎస్ కు జీవీ రెడ్డికి విభేధాలు వచ్చాయని టాక్. అందుకే నిరంతరం ఏపీ ఫైబర్ నెట్ వార్తల్లో నిలుస్తూ వచ్చింది. ఆ విభేధాల కారణంగానే జీవీ రెడ్డి రాజీనామా చేశారన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. కానీ ఇక్కడ అందరికీ వస్తున్న ఏకైక డౌట్ ఒక్కటేనట. ఏపీ ఫైబర్ నెట్ లో వివాదం ఉంటే, ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాలి. కానీ ఏకంగా టీడీపీ సభ్యత్వానికి కూడా జీవీ రాజీనామా చేయడమే సంచలనంగా మారింది. ఇదే టీడీపీకి పెద్ద మైనస్ అయిందని విశ్లేషకుల అభిప్రాయం. జీవీ రాజీనామా చేసిన వెంటనే వైసీపీ పెద్ద ఎత్తున విమర్శలు చేస్తుందని అందరూ భావించారు. కానీ ఇక్కడ అంతా వ్యతిరేకంగా సాగింది. టీడీపీకి కరడుగట్టిన సైనికులు సోషల్ మీడియాలో మంచి పని చేశారు జీవీ రెడ్డి అన్నా అంటూ మారుమ్రోగించారు. అంతేకాదు టీడీపీకి వైసీపీ గతేనంటూ సీరియస్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ కామెంట్స్ వెనుక పెద్ద కారణమే ఉందట.రెడ్డి లాంటి నిజాయితీ పరుడైన నాయకుడికి పార్టీ అండగా ఉండలేదన్నది కార్యకర్తల మనోగతం. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు తీరున జీవీ రాజీనామాతో అధిష్టానం అలర్ట్ అయినా అప్పటికే జరిగే నష్టం జరిగిందని కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు. ఎండీ దినేష్ ను బదిలీ చేసినప్పటికీ, ఇదే పని ముందే చేసి ఉంటే జీవీ రాజీనామా ఉండదని కామెంట్స్ వినిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక టీడీపీ అధిష్టానం కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, వైసీపీ దారిలో నడుస్తుందని పలువురు తెలుగు తమ్ముళ్లు బాహాటంగానే విమర్శిస్తున్నారుపార్టీ క్యాడర్ పట్టించుకోకనే వైసీపీకి 11 సీట్లు దక్కాయన్న విషయాన్ని జగన్ ఆలస్యంగా గుర్తించారని, అధికారంలో ఉన్న టీడీపీ మాత్రం నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని లేకుంటే పెను ప్రమాదమే పొంచి ఉందన్న టాక్ నడుస్తోంది. పాలన ఒక్కటే కాదు, పార్టీని కాపాడుకోవాలని టీడీపీ అధిష్టానానికి క్యాడర్ సూచిస్తోంది. జీవీ రాజీనామా పెద్ద మైనస్ గా పేర్కొంటున్న తెలుగు తమ్ముళ్లు, ఇప్పటికైనా అధిష్టానంపై సోషల్ మీడియా వేదికగా ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. మరి క్యాడర్ ను నచ్చజెప్పుకొనే ప్రయత్నాలు టీడీపీ అధిష్టానం చేస్తుందా? లేక సైలెంట్ గా జరిగే పరిణామాలను చూస్తూ ఉంటుందా అన్నది ముమ్ముందు తెలియాల్సి ఉంది.

# 15 వేల మంది ఉద్యోగుల సర్దుబాటు షురూ...

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయాల్లో అదనపు సిబ్బంది లెక్క తేలింది. రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో 15,498 మంది సిబ్బంది అదనంగా ఉన్నట్టు గుర్తించారు. సచివాలయాల్లో జనాభా ప్రాతిపదికన ఎంత మంది పనిచేయాలో ఇప్పటికే ఖరారు చేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో అదనంగా ఉన్న సిబ్బందిని గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో 12,126 మంది అదనంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాల్లో 3,372 మంది ఉన్నారు. సచివాలయ సిబ్బందిని వారి ఆసక్తి మేరకు విధులు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. మిగిలిన సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేస్తారు. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని భావిస్తోంది. మరోవైపు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయడంపై ఉద్యోగులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేయడంతో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమన్వయం చేసి వాటిని పరిష్కరించేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో అదనంగా పనిచేస్తున్న ఉద్యోగుల్లో డిజిటల్ అసిస్టెంట్లు 173, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు 414, గ్రామ మహిళా పోలీసులు 2107మంది, వీఆర్వోలు 2899, గ్రామ సర్వేయర్ అసిస్టెంట్లు గ్రేడ్ 3- 4,722, అగ్రికల్చర్ హార్టి కల్చర్, సెరి కల్చర్ అసిస్టెంట్లు 1154, ఎనర్జీ అసిస్టెంట్లు 405, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్లు 252 మంది ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాల్లో వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శులు 37, మహిళా పోలీసులు 913, వార్డు రెవిన్యూ కార్యదర్శులు 1006, వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులు 1336, వార్డు, ఎనర్జీ కార్యదర్శులు 80 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటికే కొందరిని పట్టణ ప్రణాళిక శాఖకు తరలించారు. గ్రామ, వార్డు సచివాలయాలను మూడు క్యాటగిరీలుగా విభజించారు. 2500లోపు జనాభా ఉన్న సచివాలయాలను ఏ క్యాటగిరీలో, 2501 నుంచి 3500 లోపు జనాభాను బీ క్యాటగిరీగా, 3501పైగా జనాభా ఉన్న వాటిని సీ క్యాటగిరీలో చేర్చారు. 2500లోపు జనాభా ఉంటే ఆరుగురు ఉద్యోగుల పనిచేయాల్సి ఉంటుంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 3015 గ్రామ సచివాయాలు, 547 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 3562 సచివాలయాల్లో 2500లోపు జనాభా ఉంది. 2501 నుంచి 3500 జనాభా ఉన్న సచివా?లయాలకు ఏడుగురు సిబ్బందిని కేటాయిస్తారు. ఈ విభాగంలో 3,884 గ్రామ సచివాలయాలు, 1504 వార్డు సచివాలయాలతో కలిపి మొత్తం 5,388 ఉన్నాయి. 3501కు పైగా జనాభా ఉన్న సచివాలయాల్లో8మంది సిబ్బందిని నియమిస్తారు. ఈ విభాగంలో 4,263 గ్రామ సచివాలయాలు, 1791 వార్డు సచివాలయాలు ఉన్నాయి. సీ క్యాటగిరీలో మొత్తం 6054 సచివాలయాలు ఉన్నాయి. ఏపీలో ప్రస్తుతం 11,162 గ్రామ సచివాలయాలు, 3841 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 15,004 సచివాలయాలను వైసీపీ హయంలో ఏర్పాటు చేశారు.

# అన్ని స్కూళ్లలో తెలుగు కంపల్సరీ



హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో తెలుగు సబ్జెక్ట్ తప్పనిసరిగా బోధించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, ఇతర బోర్డు అనుబంధ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు తెలుగు తప్పనిసరిగా సబ్జెక్టుగా అమలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 9వ తరగతి విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి, పదో తరగతి విద్యార్థులకు 2026-27 నుంచి ఈ అమలు చేసేలా చూడాలని విద్యాశాఖకు సూచించింది.కాగా పాఠశాలల్లో తెలుగును తప్పనిసరిగా బోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2018లో తెలంగాణ చట్టాన్ని తీసుకువచ్చింది. అయితే, గత ప్రభుత్వం వివిధ కారణాల వల్ల పాఠశాలల్లో తెలుగు బోధనను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయింది. రాష్ట్రంలో గతేడాది అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు అమలుకు పూర్తిస్థాయి చర్యలు తీసుకువచ్చింది. తదనుగుణంగా యాజమాన్యంతో సమావేశం నిర్వహించి, రాబోయే విద్యా సంవత్సరం నుంచి అభాఇ, ఎఆూఇ వంటి ఇతర బోర్డు స్కూళ్లలో కూడా 9, 10 తరగతులకు తెలుగు సబ్జెక్టును బోధించాలనే నిర్ణయాన్ని తాజా ప్రకటన ద్వారా వెల్లడించింది.అయితే బోర్డు విద్యార్థులకు తెలుగు సబ్జెక్టును సులభంగా బోధించడానికి 'వెన్నెల' అనే 'సరళ తెలుగు' పాఠ్యపుస్తకాన్ని ఉపయోగించాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి మంగళవారం తెలిపారు. 'సరళ తెలుగు' పాఠ్యపుస్తకాన్ని అమలు చేయడం వల్ల తెలుగు మాతృభాషగాలేని విద్యార్థులకు, ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

సింగిడి స్థానంలో వెన్నల

ఇతర సిలబస్ స్కూళ్లలోనూ 100 శాతం తెలుగు సబ్జెక్ట్ అమలు లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 'సింగిడి' పుస్తకాన్ని తీసుకొచ్చిన విషయం తెల్సిందే. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు 'వెన్నెల' తెలుగు పుస్తకాన్ని బోధించాలని తెలిపింది.ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల విద్యార్థులు తెలుగు సబ్జెక్టును సులభతరంగా అర్థమయ్యేలా 'వెన్నెల' విధానాన్ని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులకు సూచించారు. దీంతో ఈ విధానాన్ని వచ్చే విద్యా సంవత్సరం 2025?26 నుంచి అమలు చేయాలని ఆ శాఖ నిర్ణయించింది. దీని ఆధారంగా పరీక్షను నిర్వహించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం మెమో ద్వారా పాఠశాల యాజమాన్యాలను ఆదేశించింది.ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. రెండో వైపు చూద్దాం. విద్యార్థుల స్కోర్ కోసం సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ వంటి కొన్ని పాఠశాలలు సంస్కృతం సబ్జెక్ట్ పక్కాగా అమలు చేశాయి. దీనివల్ల విద్యార్థుల మార్కులు పెరుగుతుందని భావించారు. చాలామంది స్టూడెంట్స్ దీన్ని ఫాలో అవుతూ వచ్చారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆయా విద్యార్థులు సందిగ్ధంలో పడ్డారు. మధ్యలో తెలుగు సబ్జెక్ట్ అంటే కష్టంగా ఉంటుందని అంటున్నారు.మళ్లీ మొదట నుంచి తెలుగు నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు కొందరు స్టూడెంట్స్. సంస్కృతం సబ్జెక్ట్ తీసుకున్న విద్యార్థుల సంఖ్య ప్రైవేటు పాఠశాలలో ఎక్కువగా ఉందని అంటున్నారు. చాలా పాఠశాలలను ఐదు నుంచి అమలు చేయడం మొదలుపెట్టారు. నార్మల్‌గా అయితే ఇంటర్‌లో స్కోర్ కోసం సంస్కృతం సబ్జెక్ట్‌ను విద్యార్థులు ఎక్కువగా తీసుకున్న సందర్భాలు కనిపిస్తాయి. దీనివల్ల వందకు వంద స్కోర్ వచ్చిన సందర్భాలు ఉన్నాయి.

# కాంగ్రెస్‌లో అంతే... సొంత పార్టీపైనే విమర్శలు

హైదరాబాద్ : అధికారంలో లేనప్పుడు కనీసం కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ఎటువంటి ప్రయత్నం చేయరు. అంతెందుకు తమకు తాము గెలిచేందుకు కూడా వారి సామాజికవర్గంతో పాటు చేసిన పనులు కూడా సహకరించవు. కానీ పార్టీ అధికారంలోకి రాగానే తమకు మంత్రి పదవులు కావాలంటూ గొంతు చించుకుంటారు. అది కాంగ్రెస్ లోనే సాధ్యం. పదేళ్ల పాటు గెలుపునకు దూరంగా ఉన్న నేతలు ఇప్పుడు అధికారంలోకి రాగానే తాము ఇరగదీసే నేతలమంటూ, తమకు అన్యాయం చేస్తున్నారంటూ సొంత పార్టీపైనే విమర్శలకు దిగడం విడ్డూరమన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అధికారంలోకి తీసుకు వచ్చేందుకు మీరు ఏం చేశారన్న ప్రశ్నకు మాత్రం వారి వద్ద సమాధానం ఉండదు.. 2004, 2009 ఎన్నికల్లో వరసగా సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలిచిన అంజనీకుమార్ యాదవ్ ఇప్పుడు సొంత పార్టీ పై విమర్శలకు దిగడం పై సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. 2014 నుంచి మళ్లీ ఆయన గెలవలేదు. అప్పుడు కాంగ్రెస్ గాలివాటంలో గెలిచిన అంజనీకుమార్ యాదవ్ కాంగ్రెస్ 2023 లో అధికారంలోకి రాగానే ఆయన కుమారుడికి రాజ్యసభ పదవిని ఇప్పించుకున్నారు. ఇప్పుడు ఆయనలో మళ్లీ అసంతృప్తి తలెత్తింది. అందుకు కారణం తనకు మంత్రి పదవి ఇవ్వడం లేదనే. ఒకే ఇంట్లో ఇంతమందికి పదవులు ఇచ్చుకుంటూ పోతే ఎలా అని కాంగ్రెస్ శ్రేణులే ప్రశ్నిస్తున్నాయి. అంత ఓటు బ్యాంకు ఉన్న నేత అయితే 2023 ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో ఒక్క సీటును కూడా ఎందుకు కాంగ్రెస్ కు తెచ్చి పెట్టలేకపోయారని కొందరు కాంగ్రెస్ కార్యకర్తలే ప్రశ్నిస్తున్నారు... వనపర్తి మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డి కూడా అంతే. ఆయన 2014లో వనపర్తి నుంచి గెలిచారు. తర్వాత ఆయన ఇక గెలవలేదు. కానీ సొంత పార్టీ ఎమ్మెల్యేపైనే ఆయన విమర్శలకు దిగారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేఘారెడ్డి పై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. చిన్నారెడ్డి సీనియర్ లీడర్. అయితే ఆయన పార్టీలో చర్చించాల్సిన అంశాలు మీడియా సమావేశం పెట్టి మరీ సొంత పార్టీ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడాన్నిపలువురు తప్పుపడుతున్నారు. కేవలం పదవుల కోసమే పార్టీ నాయకత్వాన్ని బ్లాక్ మెయిల్ చేసే ఉద్దేశ్యంతో ఈ సీనియర్లు ప్రయత్నిస్తున్నారని, కాంగ్రెస్ లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ కావడంతో వీరు ఎన్ని మాటలు మాట్లాడినా వీరిపై చర్యలు ఉండవు. ప్రజలు తిరస్కరించిన నేతలు తమకు దొడ్డిదారిన పదవులు కావాలంటూ పార్టీ నాయకత్వాన్ని బెదిరించడంతో పాటు పార్టీ ప్రతిష్టను దిగజార్చడం ఎంత వరకూ సబబని పలువురు కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి

**ఇక చిన్నారెడ్డి...** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వేరే ప్రతిపక్షం అక్కర్లేదు. ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. సీనియర్లు అలుగుతారు. బహిరంగ ఆరోపణలు చేస్తారు. ఈ స్థాయిలో వేరే పార్టీ నేతలు కూడా చేయబోరు. అందుకే కాంగ్రెస్ నిత్యం కుమ్ములాటలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందనే ఆరోపణలు వినిపిస్తుంటాయి. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి వనపర్తిలో మాట్లడుతూ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. ఏకంగా క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడే క్రమశిక్షణ తప్పారని కొందరంటే, ఉన్నది ఉన్నట్లు ధైర్యంగా మాట్లడారని మరికొందరంటున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని సొంత పార్టీ ఏర్పాటు చేసిన ప్రభుత్వంపైనే తీవ్ర ఆవేదనతో మండిపడ్డారు చిన్నారెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్న విధానం అద్దం పడుతోందని ఆరోపించారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డితో 90లక్షల రూపాయలు ఖర్చుపెట్టించారని అన్నారు. ఓట్లు కొనుగోలు చేసే క్రమంలో ఎంపీటీసిలకు, జడ్పిటిసిలకు ఒక్కొక్కరికి 5 నుంచి 10లక్షలు జీవన్ రెడ్డితో ఇప్పించి నిండా ముంచేశారని కామెంట్స్ చేశారు. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రధాన ప్రతిపక్షం అయిన బిఆర్ఎస్‌కు ఆయుధంగా మారాయి. ఇదే అంశంపై మాజీ మంత్రి బిఆర్ఎస్ నేత హరీష్ రావు ఎక్స్ వేదికగా చిన్నారెడ్డి వీడియోను పోస్ట్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కార్నర్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం.. పోలీసు రాజ్యమైంది, మా కార్యకర్తల నుంచి నాయకుల దాకా అక్రమ కేసులు, వేధింపులు సర్వసాధారణమైపోయాయి. ఈ ఆరోపణలు వాస్తవమని కాంగ్రెస్ నాయకుడైన చిన్నారెడ్డి వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతున్నది. అని హరీష్ రావు మండిపడ్డారు. ఆయన పోస్టు చేసిన పోస్టులో ఏముందంటే...'పోలీసులు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇంటి కావలికారుల్లాగా పని చేస్తున్నారు. ఎమ్మెల్యే కేసు పెట్టుమంటే పెట్టాలె, తీసేయమంటే తీసేయాలె అనే స్థాయికి దిగజారారు. గతంలో ఎన్నడూ ఒక ఎమ్మెల్యేకు అధికారులు ఇంతగా భయపడిన దాఖలాలు లేవు. నా 46ఏండ్ల రాజకీయ జీవితంలో ఇంత దారుణంగా పోలీసులు, అధికారులు ఎన్నడూ ప్రవర్తించలేదు" అని చిన్నారెడ్డి బహిరంగంగా ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని బీఆర్ఎస్ ముందు నుంచి చెబుతున్నది నిజమేనని నాడు జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, నేడు వనపర్తిలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు తేటతెల్లం చేస్తున్నాయి.రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులు, అధికారుల తీరు ఇట్లా ఉంటే, రేవంత్ రెడ్డి నాయకత్వంలో నోట్ల రాజకీయం నగ్న తాండవం చేస్తోందని చిన్నారెడ్డే అంగీకరించారు. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డితో రూ.90 కోట్లు ఖర్చు పెట్టించారని, ఓట్లు కొనుగోలు చేసే క్రమంలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు 5నుంచి 10లక్షల వరకు ఇస్తామని హామీ ఇచ్చి, రెండున్నర లక్షలు మాత్రమే ఇచ్చారని చిన్నారెడ్డి చెప్పడం బీఆర్ఎస్‌కు మంచి అస్త్రం ఇచ్చినట్టు అయింది. చిన్నారెడ్డి చేసిన కామెంట్స్‌ను హరీష్ పోస్టు చేస్తూ..."ఈడీలు, సీబీఐలు, ఐటీలు, ఎన్నికల్ కమిషన్లు ఎందుకు ఈ విషయంపై నోరు మెదపడం లేదు? సుమోటోగా తీసుకొని కేసులు ఎందుకు పెట్టడం లేదు? బీఆర్ఎస్ నాయకులపై నిరాధారమైన కేసులు పెట్టటంలో చూపించే అత్యుత్సాహం ఆధారాలున్నా, స్వయంగా క్యాబినెట్ ర్యాంకులో ఉండి, ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ నాయకుడే చెబుతున్నా ఎందుకు పెట్టడం లేదు? కాంగ్రెస్ మార్కు ప్రజాపాలన, రాజ్యాంగ పరిరక్షణ అంటే ఇదేనా? రాజ్యాంగం చేతిలో పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ ఏ విధంగా సమర్థిస్తారు? ఏం సమాధానం చెబుతారు? బడే భాయ్, ఛోటే భాయ్ బంధానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి? బిజేపీ, కాంగ్రెస్ చీకటి ఒప్పందానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? వెంటనే కేసులు పెట్టి, విచారణ జరపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం." అని సోషల్ మీడియా వేదికగా సవాల్ చేశారు.

ఇలా చిన్నారెడ్డి చేసిన కామెంట్స్‌ను ఆయుధంగా చేసుకొని రేవంత్ రెడ్డి సర్కాను మాజీ మంత్రి బిఆర్ ఎస్ నేత హరీష్ రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. మాపై కేసులు పెట్టి, అరెస్టులు చేసే రేవంత్ రెడ్డి , ఇప్పుడు తమ పార్టీ సీనియర్ నేత బహిరంగంగా చేసిన ఆరోపణలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మీపార్టీలో ఓట్లు కొనేందుక కోట్లు ఖర్చు చేసారని మీ పార్టీ నేత చెబుతుంటే ఎందుకు కేసులు కట్టరని నిలదీశారు. బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోరని డిమాండ్ చేసారు హరీష్ రావు. మొత్తానికి సొంత పార్టీలో చిన్నారెడ్డి పెట్టిన చిచ్చుతో బిఆర్ఎస్ అస్త్రాలు సంధిస్తోంది.

# కుంభమేళకు 45 లక్షలు.. అయినా ఫుల్ డిమాండ్

హైదరాబాద్ : ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ ధార్మిక కార్యక్రమం అయిన కుంభమేళ చివరి దశకు చేరుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది.. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. మరికొందరు ఇప్పటికీ ప్రయాణాలు పెట్టుకుంటున్నారు. వారిలో హైదరాబాద్ వంటి సంపన్న నగరాల నుంచి ఉన్నత వర్గం ప్రజలు భారీగానే ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నారు. భారీగా అంటే మామూలు భారీగా కాదు.. ఏకంగా ఒక్కో ట్రిప్ నకు రూ.15 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారంట. ఏంటీ.. ఆశ్చర్యంతో నోరెళ్లబెడుతున్నారా.?. అయితే.. ఇంకో విషయం వీళ్లు ఎన్ని లక్షలు పెట్టినా, ప్రయాగ్ రాజ్ కు వెళ్లేందుకు ప్రైవేట్ జెట్లు, హెలీకాప్టర్లు దొరకడం లేదంటా.. అంటే మధ్యతరగతి జనాని సంక్రాంతికి బస్సులు నిండిపోయినట్లు.. కుంభమేళ పుణ్యమా అని అన్ని ప్రైవేట్ జెట్లు ఫుల్ డిమాండ్ తో నడుస్తున్నాయంట.ఇన్నాళ్లు వివిధ కారణాలతో పవిత్ర సంగమంలో స్నానం ఆచరించలేకపోయిన ధనవంతులు.. ఇక ఇప్పుడు సంగమంలో పవిత్ర స్నానం కోసం డబ్బుల్ని నీళ్లలా ఖర్చు చేసేందుకు సైతం వెనుకాడడం లేదంటా. గత కొన్ని రోజులుగా వరుసపెట్టి వస్తున్న ఆర్డర్ల గురించి ఓ బుకింగ్ ఏజెన్సీ చెప్పిందీ విషయం. కుంభమేళ చివరికి చేరుకునేంటప్పటికి.. డిమాండ్ పెరుగుతుందని చెబుతున్న ట్రావెల్ అండ్ బుకింగ్ ఏజెన్సీలు.. గత కొన్ని వారాల్లో హైదరాబాద్‌లోని వ్యాపార, రాజకీయ, టెక్ రంగాలకు చెందిన ప్రముఖుల బుకింగ్స్ తో 25-30 ట్రిప్పుల వరకు ప్రయాగ్ రాజ్ వెళ్లొచ్చినట్లు చెబుతున్నారు. ఇక.. ఈ రెండు రోజులు అయితే.. ధరలు మరింత పెరగగా.. అయినా ఆయా వర్గాలు వెనక్కి తగ్గడం లేదని సమాచారం. పవిత్ర సంగమంలో స్నానం చేసేందుకు ఎంత ఖర్చు పెట్టేందుకైనా సిద్ధపడుతున్నారంట. ఈ డిమాండ్ ను ముందే అంచనా వేసిన కొన్ని సంస్థలు.. వివిధ రకాల విమానాల్ని లీజుకు తీసుకున్నాయంట.హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయానికి.. ప్రైవేట్ జెట్ లో వెళ్లేందుకు సుమారు 1 గంట 45 నిమిషాలు పడుతుంది. అక్కడి నుంచి సంగమం దగ్గరే కావడంతో.. ఒక్కరోజులోనే త్రివేణి సంగమంలో స్నానం చేసి వచ్చేయొచ్చు. ప్రస్తుతం ఓ ఏజెన్సీ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్



నుంచి 6 సీట్ల టర్బోప్రాప్ విమానం రెంట్ కు తీసుకోవాలి అనుకుంటే.. రూ.15 లక్షలకు పైగానే చెల్లించుకోవాల్సి ఉంటుంది. అదే 8-సీట్ల జెట్ లో ఓ కుటుంబం వెళ్లి రావాలి అనుకుంటే మాత్రం రూ.30 లక్షలు, పన్నులు చెల్లించాల్సిందే అంటున్నారు. అదే.. ఓ రెండు, మూడు కుటుంబాలు కలిసి వెళ్లాలి అంటే మాత్రం.. 13-సీట్ల జెట్ బుక్ చేసుకుంటున్న ఐశ్వర్యవంతులు ఇందు కోసం రూ.45 లక్షలు చెల్లిస్తున్నారు. కుంభమేళ చివరి దశకు చేరుకోవడంతో.. ఈ ధరలు మరింత భారీగా పెరిగే అవకాశాలున్నాయని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు.ధనవంతుల నుంచి వస్తున్న డిమాండ్‌ను బట్టి చూస్తే? ధరలు మరో 20% నుంచి 30% వరకు పెరగడంలో పెద్దగా ఆశ్చర్యం లేదంటున్నారు బెంగళూరుకు చెందిన థంబీ ఏవియేషన్ అఖా గోవింద్ నాయర్. ఆయన సంస్థ మహా కుంభ్ కోసం ప్రభుత్వ అధికారులు, ఫార్మా కంపెనీల అధిపతులు, టెక్ రంగ నాయకులు, రాజకీయ ప్రముఖులకు హెలికాప్టర్లను అద్దెకు ఇస్తోంది. ప్రస్తుత రద్దీ నేపథ్యంలో.. వారి సంస్థ ఒక్క రోజులోనే మూడు నుంచి నాలుగు ట్రిప్పులు నిర్వహిస్తోందని చెప్పారు. హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ఘాట్ హెలిప్యాడ్ (త్రివేణి సంగమం సమీపంలో) వరకు హెలికాప్టర్‌లో తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

## ఏనుగుల దాడి మృతుల కుటుంబాలకు

# రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా

రాయచోటి : అన్నమయ్య జిల్లాలోని కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారి పల్లి మండలంలో జరిగిన ఏనుగుల దాడిలో చనిపోయిన వారికి 10 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటిస్తున్నామని, చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం సహాయంతో నగదు రహిత చికిత్స అందిస్తున్నామని, శివరాత్రి సందర్భంగా భక్తులు ఎవరు అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని, గుండ్లకోన శివాలయం దగ్గరికి కేవలం నలుగురు భక్తులకు మాత్రమే అనుమతి అని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. రాయచోటి కలెక్టరేట్లోని విసి హాల్లో ఉదయం రెండు నుంచి రెండున్నర గంటల మధ్యలో ఓబులవారి పల్లి మండలం, వై కోట దగ్గర జరిగిన ఏనుగుల దాడి, శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు సూచనలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ఉలగట్టు పాడు మరియు కన్నగుంట ఎస్టి కాలనీ లకు చెందిన కొంతమంది శివ భక్తులు... కె.వి బావి బీట్ రేంజ్ నుండి తలకోన శివాలయానికి అడవి గుండా ప్రయాణం చేస్తుండగా వై కోట గ్రామం, కె.వి భవి బీట్ రేంజ్ దగ్గర.మంగళవారం ఉదయం2:00 గంటల నుండి 2:30 గంటల మధ్యలో జరిగిన అడవి ఏనుగుల దాడిలో ముగ్గురు వ్యక్తులు చనిపోయారని, ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయని మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో నుండి వెళ్లడానికి ప్రయత్నం చేసినప్పుడు అటవీ శాఖ అధికారులు వారిని రిజర్వ్ అటవీ ప్రాంతం నుంచి వెళ్లకూడదని హెచ్చరించినప్పటికీ భక్తులు రిజర్వ్ అటవీ ప్రాంతం నుండి వెళ్లడం జరిగిందన్నారు. మార్గమధ్యంలో వారికి పిల్ల ఏనుగులు కనపడినప్పుడు గిన్నెలతో శబ్దాలు చేయడంతో తల్లి ఏనుగులు వారి మీద దాడి చేయడం జరిగిందన్నారు. చనిపోయిన తుపాకుల మణెమ్మ, తుపాకుల చందర్ రాయుడు, వంకాయల దినేష్ ల కుటుంబాలకు ప్రభుత్వం తరపున 10 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ఇవ్వడం జరుగుతుందన్నారు. తీవ్రంగా గాయపడ్డ వరిగల రాజశేఖర్ అమర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పినట్టుగా పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడ్డ మరో వ్యక్తి పాపమ్మ, రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని ప్రాణాపాయం లేదని పేర్కొన్నారు. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారని వారు కోడూరు లోని సిహెచ్సి లో చికిత్స పొందుతున్నారు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరియు ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్లు చికిత్స పొందుతున్న వారి బంధువులతో మాట్లాడి వైద్య సదుపాయాల అందిస్తున్నారు అన్నారు. చికిత్స పొందుతున్న వారందరికీ క్యాష్ లెస్ ట్రీట్మెంట్ను ప్రభుత్వం కల్పించడం జరుగుతుందన్నారు. గాయాలైన వారికి చికిత్స తో పాటు రెండు లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించినట్లుగా పేర్కొన్నారు.అనంతరం శివరాత్రి పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ భక్తులందరికీ వివిధ సూచనలను చేశారు. బుధవారం శివ శివరాత్రి పండుగ సందర్భంగా భక్తులెవరు అడవి లోపలికి వెళ్ళకూడదని, అడవి లోపలికి టపాసులు తీసుకెళ్లరాదని, సూచించారు. శివాలయాలకు వెళ్ళేటప్పుడు అధికారిక రహదారులను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. గుండ్లకోన శివాలయానికి వెళ్లే భక్తులకు సూచనలిస్తూ. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా నలుగురిని మాత్రమే శివుడి ప్రతిమను తీసుకెళ్లేందుకు అనుమతించబడుతుందని తెలిపారు. ఈ పాత్రికేయ సమావేశంలో డిఆర్ఓ మధుసూదనరావు పాల్గొన్నారు.

తీవ్రగ్భ్భాంతి వ్యక్తం చేసిన మంత్రి:

ఓబులవారిపల్లె మండలం, గుండాలకోన వద్ద ఏనుగుల దాడిలో ముగ్గురు భక్తులు మృతి చెందడంపై రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మహా శివరాత్రి సందర్భంగా శివాలయాలకు వెళ్తున్న భక్తులపై మంగళవారం గుండాలకోన వద్ద ఏనుగులు దాడి చేశాయి.ఈ ఘటనలో ముగ్గురు భక్తులు అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి వైద్యాధికారులకు సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

గాయపడిన వారి పరిస్థితిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వైద్యులకు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నారు.

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఫారెస్ట్ అధికారులను కోరారు.

# అతివలకు బీమా.. అవగాహనతోనే ధీమా

**- స్వయం సహాయక సభ్యులకు చేకూరనున్న ప్రయోజనం**

**- ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ. 10 లక్షలు - అంగవైకల్యం కలిగితే రూ. 5 లక్షలు**



వాంకిడి : అతివల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వాలు రుణాలను అందిస్తున్నాయి. సంఘాల ఏర్పాటు ద్వారా సభ్యులు రుణాలను పొందుతూ స్వశక్తితో ఎదుగుతున్నారు. లక్షలాది మంది మహిళలు ప్రగతి మార్గంలో పయనిస్తున్నారు. సంఘాల్లోని మహిళలకు మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రతీమహిళకు బీమా సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించింది. సంఘాల్లో సభ్యురాలిగా ఉండి స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్న మహిళ అనివార్యకారణాల వల్ల మరణిస్తే రెండు లక్షల రూపాయల లోపు రుణాన్ని ప్రభుత్వమే చెల్లించేది. తాజాగా ప్రభుత్వం ఈ విధానాన్ని బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న వారికి కూడా వర్తింపచేస్తుంది.

**- 92,512 మందికి ప్రయోజనం..**

కుమరం భీం జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో 8,275 స్వయం సహాయక సంఘాలకు చెందిన 92,512 వేల మంది సభ్యులు ఉన్నారు. అర్హత కలిగిన ప్రతీ మహిళ స్వయం సహాయక సంఘాల్లో చేరాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించి ప్రోత్సహిస్తుంది. సంఘ సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకొని చిరువ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్, మహిళాశక్తి పథకాల ద్వారా వివిధ రకాల రుణాలు అందజేస్తున్నారు.

**18 నుంచి 60 ఏళ్ల వయస్సు వారికి..**

పొదుపు సంఘాల మహిళలు ప్రమాదవశత్తు మృతి చెందితే అలాంటి వారి కటుంబాలకు రూ. 10 లక్షల ఉచిత భీమా వర్తింపచేయనున్నారు. ఒకవేళ వందశాతం వైకల్యం కలిగినా రూ. 10 లక్షలు అందిస్తారు. 50 శాతం వైకల్యం కలిగితే రూ. 5 లక్షలు చెల్లిస్తారు. మృతి చెందిన మహిళలకు పొదుపు అప్పు ఉంటే అది కూడా మాఫీ చేస్తారు. గాయాలైన మహిళ అంగవైకల్యం తెలుపుతూ సదరం ధ్రువపత్రాలు, చికిత్స పొందిన అసుపత్రి పత్రాలు సమర్పించాలి. 18 నుంచి 60 ఏళ్ల వయసున్న పొదుపు మహిళలకు ఇది వర్తిస్తుంది.

**రుణ బీమా రూ. 2 లక్షలు**

ఒక్కో సంఘానికి ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు ప్రస్తుతం రుణాలు అందిస్తున్నారు. రుణం పొందిన మహిళల్లో ఎవరైనా మరణిస్తే వడ్డీతో కలిపి ఆమె కుటుంబసభ్యులు చెల్లించాల్సి వచ్చేది. అలా చెల్లించకపోతే ఆ ప్రభావం గ్రూపు సభ్యులపై పడేది. ప్రస్తుతం పొదుపు మహిళలకు ప్రభుత్వం రూ. 2 లక్షల వరకు రుణ బీమా వర్తింపుచేస్తుంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణం పొందిన మహిళ చనిపోతే ఆమె కట్టాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేయనుంది.

**అవగాహన అవసరం**

ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు పథకాలలో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపులవారు నెలవారీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి. వీటి వివరాలు ఉండాలి. అయితే ఇలాంటి వాటిపై మహిళల్లో అవగాహన లేదు. రుణం పొందే సమయంలో మాత్రమే వీవోలు నమోదు చేస్తున్నారు. దీనిపై సెర్ప్, మెప్మా అధికారులు దృష్టి సారించాలి.

# ఆర్టీసీ దుకాణాల సబ్‌లీజ్ దందా!

**యాదగిరిగుట్టలోని ఆర్టీసీ బస్టాండ్ - రూ.వేలలో సబ్‌లీజ్‌కు దుకాణాలు**

**ఆర్టీసీకి నామమాత్రం చెల్లింపు - పట్టించుకోని ఆర్టీసీ అధికారులు**

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండ్లలో దుకాణాలు డిపాజిట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(డీవోటీ) ప్రాతిపదికన అద్దెకు తీసుకున్న వాళ్లలో చాలామంది సబ్‌లీజ్ దందా సాగిస్తున్నా రు. సబ్‌లీజ్‌తో భారీగా ఆదాయం వస్తుండగా ఆర్టీసీకి మాత్రం నామమాత్రం అద్దె చెల్లిస్తున్నారు. తామే సొంతంగా వ్యాపారం నిర్వహిస్తామని లీజ్‌కు తీసుకున్న చాలామంది సబ్‌లీజ్‌కు ఇచ్చి చేతులుదులుపుకున్నారు. డీవోటీ పద్ధతిలో ఆర్టీసీకి ముందుగా కొంతడబ్బు డిపాజిట్ చేసి, స్వయంగా దుకాణాలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది.ఇందు కోసం నామమాత్రం అద్దెతో 20ఏళ్ల వరకు లీజ్‌కు ఇచ్చారు. అయితే గడువు ముగిసిన తర్వాత సంస్థ స్వాధీనం చేసుకొని బహిరంగ వేలం వేయాల్సి ఉంటుంది. డిపాజిట్ చేసి లీజ్‌కు తీసుకున్న వారు స్వయంగా దుకాణాలను నిర్వహించాలని నియమం ఉంది. అయితే ఆ నిబంధనను గాలికి వదిలేసీ యథేచ్ఛగా సబ్‌లీజ్‌కు ఇస్తూ రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. యాదగిరిగుట్ట డిపో పరిధిలోని యాదగిరిగుట్ట, ఆలేరు, భువనగిరి, రామన్నపేట బస్టాండ్లలో మొత్తం 101 దుకాణాలను 10 ఏళ్ల కిందట డీవోటీ పద్ధతిలో కేటాయించారు. డీవోటీ దుకాణాలకు నెలకు రూ.3 నుంచి రూ.4 వేల చొప్పున చెల్లిస్తున్న లీజ్‌దారులు సబ్‌లీజ్‌కు నెలకు రూ. 30వేలు, మరికొందరు రోజుకు రూ. 3 వేల నుంచి రూ.5వేల వరకు దండుకుంటున్నారు. అటు ఆర్టీసీకి నామమాత్రంగా చెల్లిస్తున్నారు. మరికొందరు బడా వ్యాపారులు డీవోటీ దుకాణాలు పొందిన వారికి డిపాజిట్ కంటే రెండింతలు ఇచ్చి అక్రమంగా లీజ్ దుకాణాలను అక్రమంగా తమ పేర్ల మీద మార్చుకొని అక్రమదందా కొనసాగిస్తున్నారు. పట్టణంలో నిరుపేదలు, నిరుద్యోగులు ఉపాధి కోసం దుకాణాలను నిర్వహించుకోవడానికి అవకాశం లేకుండా సబ్‌లీజ్ భాగోతం ఆటంకంగా మారింది. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. సబ్‌లీజ్‌కు ఇచ్చిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కిందిస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కొందరు అధికారులకు ముడుపులు ముడుతుండటంతో చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయ.

# రుద్రారంలో రామలింగేశ్వరుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు

## - అన్నదానం నిర్వహించిన మాజీ మున్సిపల్ చైర్మన్ కేఎస్ఎన్



ఎల్లారెడ్డి ఫిబ్రవరి 27 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామ శివారులో కొలువు దీరిన రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సతీ సమేతంగా రామలింగేశ్వర స్వామికి పలు రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, పిల్లా పాపలతో, పాడిపంటలతో ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించేలా చూడాలని ఆ మహా శివుడిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి సామెల్, సొసైటీ డైరెక్టర్ సుఖేందర్ రెడ్డి, అల్మాజిపూర్ మాజీ సర్పంచ్ మాధవి దత్తు, గ్రామస్తులు భాగేష్, రాము, భగవత్ రెడ్డి, పండరి, విట్టల్, సంగమేశ్వర్, మైపాల్ రెడ్డి, సాయి, దుర్గయ్య తదితరులు న్నారు.

అడివిలింగాలలో బ్రహ్మ దేవుడికి పూజలు....

మండలంలోని అడివి లింగాల్ గ్రామ శివారులో గల కుచ్చపైన వెలిసిన బ్రహ్మదేవుడిని గురువారం మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ దర్శించుకునీ తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామ శివారులో గల కుచ్చపైన వెలసిన బ్రహ్మదేవుడిని ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, బండ్ల ప్రదర్శన చేసి జాతరను ఘనంగా జరుపుకుంటామని తెలిపారు... ఆయన వెంట అడవి లింగాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగరాజు, గ్రామ యూత్ అధ్యక్షులు కొరంపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి సామెల్, సొసైటీ డైరెక్టర్ చెన్నంగారి సుఖేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కొక్కొండ గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, మాజీ ఉప సర్పంచ్ జీవన్ గౌడ్, రామానంద్, జీవన్ గౌడ్, సాయిలు, నర్సింలు, బాలరాజు, సంతోష్ తదితరులున్నారు..




# దైవ చింతనతోనే మానషిక ప్రశాంతత

## చింతల కిరణ్ కుమార్ యాదవ్

నాగోల్, ఫిబ్రవరి27(ప్రజా కలం )

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని నాగోల్ యాదవ సంఘం అధ్యక్షులు చింతల కిరణ్ కుమార్ యాదవ్ అన్నారు.నాగోల్ జైపూరి కాలనీ లో కిరణ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవంలో పాల్గొన్న అనంతరం మాట్లాడుతూ.. దైవచింతనతోనే మానసిక ప్రశాంత కలుగుతుందని తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. తన ఆహ్వానం మేరకు విచ్చేసిన ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి మరిన్ని నిధులు చేకూర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# ప్రభుత్వ భూములను కాపాడాలి

## రాయపోల్ ఎమ్మార్వో దివ్యకు వినతి పత్రం అందజేత

సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి ఫిబ్రవరి 27.

శిఖం భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పిఎసిఎస్ వైస్ చైర్మన్ పాల రవీందర్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రం రాయపోల్ ఎమ్మార్వో దివ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలోని కుడి కుంట సర్వే నెంబర్ 9 లో దాదాపు 20 ఎకరాల శిఖం భూమిని అదే గ్రామానికి చెందిన మండల మాజీ కోఆప్షన్ సభ్యులు పర్వేజ్ హైమద్ ఆక్రమించుకొని కబ్జా చేశారన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించిన ప్రభుత్వ శిఖం భూమిని సర్వే చేయించి, హద్దు బందులు ఏర్పాటు చేసి కబ్జా చేసిన వారి నుండి శిఖం భూమికి రక్షణ కల్పించాలన్నారు. తాసిల్దార్ దివ్య మాట్లాడుతూ భూమిని సర్వే చేయించి చికం భూమి కబ్జాకు గురైనట్లయితే స్వాధీనం చేసుకొని హద్దుబందులు ఏర్పాటు చేస్తామన్నారు.



# ఘనంగా శివ పర్వతల కళ్యాణ మహొత్సవాలు

సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి ఫిబ్రవరి 27.

మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాయపోల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో దేవాలయాలలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రతి సంవత్సరం లాగే నిర్వహించే శివపార్వతుల కళ్యాణ మహొత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవాలయాలను విద్యుత్కాంతి దీపాలతో రంగురంగులతో సుందరంగా వైభవంగా తీర్చిదిద్దారు. రాయపోల్ మండల కేంద్రంలో ఉమా పార్టీశ్వరాలయం గురువారం శివపార్వతుల కల్యాయాణ మహొత్సవం ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంం నిర్వహించారు. హొరామారం గ్రామంలో మహా దేవాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాలు రుద్ర హొమం, తదుపరి శివ కళ్యాణం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనం నిర్వహించారు. అనంతరం శివ పార్వతుల కళ్యాణ మహొత్సవం వేదపండితులు మంత్రోచ్ఛారణలతో ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద జాతర జరిగింది. కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలలో రాయపోల్, రామారం, గొల్లపల్లి, ఉదయపూర్ చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఎల్‌బీసీ సొరంగంలో బురద తొలగింపు షురూ..

## రంగంలోకి ఎన్జీఆర్ఐ సిబ్బంది

మహబూబ్‌నగర్ : ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో పేరుకుపోయిన బురదను తొలగించే ప్రక్రియ షురూ అయింది. గురువారం నాడు సహాయక చర్యల్లో భాగంగా ఒక వైపు డీ వాటరింగ్ చేస్తూ, మరో వైపు బురదను లోకో ట్రైన్ ద్వారా బయటికి తీసుకువస్తున్నారు. టీబీఎం మిషన్ సమీపంలో పడిఉన్న సామాగ్రిని కూడా తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే తప్ప సహాయక చర్యలు చేపట్టే అవకాశం లేదని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. బురద తొలగించిఏ పనులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌లు పర్యవేక్షిస్తున్నారు. సొరంగం నుంచి పెద్ద ఎత్తున బురద బయటకు తీస్తున్నారు. లోకో ట్రైన్ వెళ్లి రావడానికి గంట సమయం పడుతుంది. పెద్ద ఎత్తున కూలీలను ఉపయోగించి.. లోపల హిట్యాచి ద్వారా బురదను బయటికి తకలిస్తున్నారు. భారీ యంత్రం సహాయంతో వీటిని తీసి టిప్పర్‌లలో తరలిస్తున్నారు. ఈరోజు మొత్తం ఇదే కార్యక్రమం సాగుతుందని.. బురద తీసాక పరిస్థితిని అంచనా వేసి లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం ఎలా అనేదానిపై ఒక ప్రణాళిక సిద్ధం చేస్తామని చెబుతున్నారు.

టిబిఎం మిషన్ కట్టింగ్ ప్రారంభం..

ఒక వైపు బురద తొలగిస్తూనే మరో వైపు టీబీఎం మిషన్‌ను చిన్న చిన్న బాగాలుగా కట్ చేస్తున్నారు. ఈ భాగాలను కూడా వేరు చేసి బయటకు తీస్తున్నారు. ముందుగా రెండుకిలోమీటర్ల వద్ద బురదను క్లియర్ చేస్తున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

## - తమ ఓటు హక్కు వినియోగించుకున్న గ్రాడ్యుయేట్స్, టీచర్స్

ఎల్లారెడ్డి ఫిబ్రవరి 27 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని మున్సిపల్



కార్యాలయంలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 827 గ్రాడ్యుయేట్స్ ఓటర్లు ఉండగా, 81 టీచర్స్ ఓటర్లు ఉన్నారు. ఇందులో గ్రాడ్యుయేట్స్ 701 (స్త్రీలు 196, పురుషులను 505) మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 76 (పురుషులు 41, స్త్రీలు 35) మంది టీచర్స్ తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కన్నుల పండుగలా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 27 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి పట్టణంలోని సోమార్ పేట్ బేస్ ప్రాంతంలో గల రాజ రాజేశ్వరాలయంలో గురువారం పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహొత్సవం



కన్నుల పండువగా నిర్వహించారు. ఇక్కడ ప్రతి సంవత్సరం మహాశివరాత్రి మరుసటి రోజున ఆలయంలో పార్వతి పరమేశ్వరుల కళ్యాణం జరపడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శివ పార్వతుల విగ్రహాలను పెళ్లి పీటల మీద కూర్చుండ బెట్టి ఆలయ పూజారి కొండంబోట్ల రాజేశ్వర్ శర్మ కుమారులు సిద్దు శర్మ, పవన్ శర్మ లతో పాటు కృష్ణ జ్యోషి పంతులు శాస్త్రోక్తంగా శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్వతి పరమేశ్వరులకు మహిళలు ఒడిబియ్యం సమర్పించారు. అలాగే భక్తులు కట్న కానుకలు సమర్పించారు. అంతకు ముందు ఆలయంలో వేకువ జామున మహన్యాస పూర్వ ఏకాదశ రుద్రాభిషేకం, ఇతర పూజలు నిర్వహించారు. భక్తులకు స్థానిక విశ్రాంత ఉపాధ్యాయులు రాధా కిషన్ అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కళ్యాణ మహొత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

# ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న జర్నలిస్టులు

గజ్వేల్: 27 ఫిబ్రవరి 2025 (ప్రజా కలం ప్రతినిధి )

మెదక్,కరీంనగర్,నిజామబాద్,ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా



గురువారం నాడు గజ్వేల్ పట్టణ కేంద్రంలో జర్నలిస్టులు తమ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటును వినియోగించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును పట్టభద్రులందరూ వినియోగించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. తమ ఓటు హక్కును వినియోగించి సరైన నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో సమీర్, బాబా, నవీన్, ప్రభాకర్, స్వామి, ఎల్లంరాజు, మహేష్ , నర్సింలు, బాలరాజు , ఖాదర్ పాషా లు తదితరులు ఉన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా శివానందలహరి



గజ్వేల్:27 ఫిబ్రవరి 2025 (ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ లో శివరాత్రి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శివానందలహరి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని, శివరాత్రి సందర్భంగా శివానందలహరి కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, భాస్కర్ , లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గోలి సంతోష్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్, లయన్ పరమేశ్వర చారి, లయన్ నేతి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు, రచయిత, కవి, గాయకుడు,విశ్వేశ్వర రావు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ భూములను కాపాడాలి

## రాయపోల్ ఎమ్మార్వో దివ్యకు వినతి పత్రం అందజేత

సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి ఫిబ్రవరి 27.

శిఖం భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పిఎసిఎస్ వైస్ చైర్మన్ పాల రవీందర్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రం రాయపోల్ ఎమ్మార్వో దివ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలోని కుడి కుంట సర్వే నెంబర్ 9 లో దాదాపు 20 ఎకరాల శిఖం భూమిని అదే గ్రామానికి చెందిన మండల మాజీ కోఆప్షన్ సభ్యులు పర్వేజ్ హైమద్ ఆక్రమించుకొని కబ్జా చేశారన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించిన ప్రభుత్వ శిఖం భూమిని సర్వే చేయించి, హద్దు బందులు ఏర్పాటు చేసి కబ్జా చేసిన వారి నుండి శిఖం భూమికి రక్షణ కల్పించాలన్నారు. తాసిల్దార్ దివ్య మాట్లాడుతూ భూమిని సర్వే చేయించి చికం భూమి కబ్జాకు గురైనట్లయితే స్వాధీనం చేసుకొని హద్దుబందులు ఏర్పాటు చేస్తామన్నారు.

# రాష్ట్రపతి నిలయంలో జాతీయ సైన్స్ దినోత్సవ (నేషనల్ సైన్స్ డే) వేడుకలు

సికింద్రాబాద్
ఫిబ్రవరి 27 (ప్రజా కలం ప్రతినిధి)

జాతీయ సైన్స్ దినోత్సవ (నేషనల్ సైన్స్ డే ) సందర్భంగా సికింద్రాబాద్ బొల్లారం లోని రాష్ట్రపతి నిలయంలో ఈనెల 27, 28 తేదీల్లో రెండు రోజుల వేడకలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, ప్రజలకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించి, వారిని సైన్స్ సంబంధిత కార్యక్రమాల్లో పాలుపంచుకునేలా ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమంలో వివిధ సమావేశాలు, పోటీలను నిర్వహిస్తున్నారు. సీసీఎమ్‌బీ మాజీ డైరెక్టర్, ఎస్.ఎస్. భట్నాగర్ పురస్కార గ్రహీత డాక్టర్ చింతకగిరి మోహన్‌రావు, ఐసీఎమ్ఆర్ - జాతీయ పోషకాహార సంస్థ మాజీ డైరెక్టర్ డాక్టర్ శశికిరణ్ బొయిండాల, ఎండీ, ఎఫ్ఎఎంఎస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శాస్త్రీయ పరిశోధన–అభివృద్ధి సంబంధిత ప్రాజెక్టుల ప్రదర్శనను, పుస్తక ప్రదర్శనను వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతకగిరి మోహన్ రావు మాట్లాడుతూ... రామన్ ఎఫెక్ట్ గురించి, వర్ణపటశాస్త్రంలో దాని ప్రభావం గురించి విద్యార్థులకు వివరించారు. కాంతిపుంజం పదార్థ అణువుల గుండా విక్షేపం చెందినపుడు దాని తరంగదైర్ఘ్యంలో వచ్చే మార్పుల



ఆధారంగా రామన్ ఈ దృగ్విషయాన్ని ఆవిష్కరించారని తెలిపారు. ఆకాశం, సముద్రం నీలం రంగులో కనిపించడానికి, వాటిపై పడి విక్షేపం చెందిన కాంతి తక్కువ తరంగదైర్ఘ్యం గల నీలం రంగు కాంతిని వెలువరచడమే కారణమని వివరించారు. డాక్టర్ శశికిరణ్ బొయిండాల మాట్లాడుతూ రోజువారీ అలవాట్ల వెనక గల సైన్స్, వాటి దీర్ఘకాలిక ప్రభావాల గురించి వివరిస్తూ అనేక ఆరోగ్య సమస్యలను ప్రస్తావించారు. సరైన పద్ధతిలో వంట చేయడం ద్వారా ఆహారంలోని పోషకాలను ఎలా పరిరక్షించవచ్చు, తద్వారా ఆరోగ్య సమస్యలను ఎలా తగ్గించుకోవచ్చో బిర్యానీ వంటకాన్ని ఉదాహరణగా తీసుకుని విద్యార్థులకు వివరించారు. పేద కుటుంబాల్లో తల్లి సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల తక్కువ బరువుతో పిల్లలు జన్మిస్తున్నారని పేర్కొన్న ఆయన, చిన్న వయస్సులో గుండెపోటు మరణాలు పెరగడానికి ఇదీ ఒక కారణమని తెలిపారు. అధికంగా ప్రాసెస్ చేసిన, తక్కువ పీచు గల ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల ఆఫ్రికావాసులతో పోలిస్తే ఆసియా దేశాల ప్రజల్లో పెద్దపేగు క్యాన్సర్ ఎక్కువగా విస్తరిస్తోందన్నారు.

ఈ వేడుకల ప్రారంభం సందర్భంగా శ్రీ పుణ్యకీర్తి స్వాగత నృత్యం, సైన్స్ విశిష్టత గురించి హకీంపేట సీఆర్పీఎఫ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి.

ఈ శాస్త్రీయ పరిశోధన–అభివృద్ధి ప్రదర్శనల్లో సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ (సీడీఎఫ్‌డీ), నేషనల్ రివోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ ), సర్వే ఆఫ్ ఇండియా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) వంటి ప్రముఖ సంస్థలతో పాటు జెంట్రిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, నెక్స్ట్ స్కిల్స్ 360, మేకర్స్ వర్స్ వంటి అంకురసంస్థలు సైతం పాల్గొన్నాయి. నేషనల్ బుక్ ట్రస్ట్, జనవిజ్ఞాన వేదిక, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శన అలాగే ఇక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## మున్సిపల్ కార్యాలయాన్ని
# ఆకస్మికంగా తనిఖీ

**- జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



భూదాన్ పోచంపల్లి ఫిబ్రవరి 27, (ప్రజా కలం ప్రతినిధి)

మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పెండింగ్ లేకుండా చూడాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం పోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ మున్సిపాలిటీలో పరిధిలో ఉన్న టాక్స్ కలెక్షన్ ఇప్పటివరకు ఎంత జరిగిందని, 49% పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ తెలుపగా ,టాక్స్ కలెక్షన్ డిమాండ్ సమయానికి నోటీసులు జారీ చేస్తున్నారా లేదా అని అడిగి టాక్స్ కలెక్షన్ స్పీడ్ అప్ చేయాలని కమిషనర్ ను ఆదేశించారు. వార్డ్ ఆఫీసర్ లు ప్రతిరోజు ఎంత టాక్స్ కలెక్షన్ చేస్తున్నరని కలక్షన్ చేసిన డబ్బును బ్యాంకులో జమ చేస్తున్నారా లేదా అని తెలుసుకొని ఎప్పటికపుడు బ్యాంకులో జమ చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్మున్సిపాలిటీలో ఉందా లేదా అని తెలుసుకున్నారు. ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్త వేరు చేసి సేకరిస్తున్నారా లేదా అని అడిగి ప్రజలకు తడి పొడి చెత్త వేరు చేసేలా అవగాహన కల్పించాలన్నారు.మున్సిపాలిటీలో నర్సరీలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఉన్నాయా లేదా అని తెలుసుకొని నర్సరీ టార్గెట్ ఎంత అని అడిగి తెలుసుకున్నారు.టి యు ఎఫ్ ఐ డి సి పనులకు సంబంధించి పనులు ఎలా జరుగుతున్నాయ, పార్క్ పనులు పూర్తి అయిందా అని తెల్సుకుని పనులు పెండింగ్ లో ఉన్నాయి అని తెలుపగా ఎస్ ఈ పబ్లిక్ హెల్త్ తో ఫోన్లో మాట్లాడి వెంటనే రీటెండర్ చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది హెచ్ఎండిఏ కి సంబంధించిన లె ఔట్స్ రిజిస్ట్రేషన్ మెయింటైన్ చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన్నారు.మున్సిపాలిటి పరిధిలో పబ్లిక్ టాయిలెట్స్ ఉన్నాయా లేవని అది తెలుసుకోవడం జరిగింది. మున్సిపాలిటీలో గ్రీన్ బడ్జెట్ సరిపోను ఉందా అని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉండకుండా ఎల్ఆర్ఎస్ అప్లికేషన్స్ , బిల్డింగ్ పర్మిషన్స్ త్వరగా పూర్తి చేయాలనీ కమిషనర్ ను ఆదేశించారు.ప్రతి రోజు ఉదయం వార్డులలో శానిటేషన్ తప్పకుండా చేయాలనీ, వార్డులన్ని పరిశుభ్రంగా ఉంచాలని ,సిబ్బంది అందరు కూడా వార్డు లలో ఉండే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్ కుమార్ రెడ్డి, ఇన్చార్జి తహసిల్దార్ నాగేశ్వరరావు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్యారడైజ్ హలీమ్ ట్రెడిషన్

**- సీఈఓ గౌతమ్ గుప్త**
**- రంజాన్ ప్రత్యేకం జష్న్ ఎ హలీమ్**
**- అందుబాటులోకి ఇఫ్తార్ ప్యాక్**






కంటోన్మెంట్ ఫిబ్రవరి 27 ప్రజాకలం

రంజాన్ మాసం అంటే నోరూరుతుంది, రంజాన్ ప్రత్యేకం హలీమ్. రోజంత ఉపవాసం ఉండి సూర్యాస్తమం తర్వాత ఉపవాసం విడిచి హలీమ్ ను ఆహారంగా తీసుకుంటారు. అందులో ప్యారడైజ్ అంటే ఆహార ప్రియులకు మరింత మక్కువ. సాయంత్రం హలీమ్ ను ఆహారంగా తీసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. గత 29 ఏళ్ల గా హలీమ్ ను అందిస్తున్న వారు ఈ ఏడాది తమ ప్రత్యేకమైన హలీమ్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ సీఈఓ గౌతమ్ గుప్త వెల్లడించారు. కేవలం 299 రూపాయలకే మటన్ హలీమ్, 235 రూపాయలకే చికెన్ హలీమ్ ను అందిస్తున్నట్లు స్పష్టం చేశారు.కాగా ఈ ఏఢాది ఇఫ్తార్ విందు కోసం కావల్సిన ప్యాక్ ను అందుబాటులోకి తీసుకువచ్చారు. సుమారు పది మంది కలిసి ఈ విందును ఆరగించవచ్చన్నారు. హలీమ్ తో పాటు బిర్యాణి, స్వీట్లు సైతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

**హలీమ్ పై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్**

హలీమ్ పై బర్డ్ ఫ్లూ ప్రభావం ఉన్నా భారతీయ వంటకాల విధానంతో వైరస్ బతికే చాన్స్ లేదని గౌతమ్ గుప్త స్పష్టం చేశారు. 100 డిగ్రీల సెల్సియస్ పై గా వేడి చేయడంతో వైసర్ చనిపోతుందన్నారు.ఈ ఏడాది చికెన్ హలమ్ కంటే మటన్ హలీమ్ కు డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు.

ఒక వైపు బర్డ్ ఫ్లూ కూడా కారణం అన్నారు. ప్రతి ఏడాది మటన్ హలీమ్ కు డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్యారడైస్ చెఫ్ స్వతంత్ర గౌతమ్ పాల్గొన్నారు. 29 రకాల ఆహార వస్తువులను హలీమ్ తయా రి కోసం వినియోగించినట్లు తెలియజేశారు.

## ప్రశాంతంగా ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు
## పోచంపల్లి ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లి ఫిబ్రవరి 27, (ప్రజా కలం ప్రతినిధి)

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతరావు ఒకస్మికంగా సందర్శించి పరిశీలించారు .ఎన్నికల ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు మండలంలో మొత్తం 48 ఓటర్లకు గాను 46 ఓట్లు పోలైనట్లు ఇన్చార్జి తహసిల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డిఓ శేఖర్ రెడ్డి అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డి సందర్శించారు.



# ఎలివేటర్ కారిడార్ నిర్మాణం,భూసేకరణ

**- గ్రామ సభ నిర్వహించిన అధికారులు**
**- బాధితుల అపోహన నివృత్తి**

కంటోన్మెంట్ ఫిబ్రవరి 27 ప్రజాకలం

జాతీయ రహదారి 44 ప్యారడైస్ నుండి డైరీ ఫాం వరకు ఎలివేటర్ కారిడార్ నిర్మాణం,భూసేకరణ, పునరుపాది కల్పన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. భూమి కోల్పోతున్న బాధితులకు న్యాయం చేసేందుకు అధికారులు భరోసా ఇచ్చారు. వారి సమస్యలను తెలుసుకున్నారు, వారి అపోహలను సైతం నివృత్తి చేశారు. భూమి కోల్పోయిన వారికి పూర్తి నష్టపరిహారం చెల్లించడంతో పాటు ,డైవర్శన్ తో భూములు కోల్పోతున్న వారికి కూడా న్యాయం చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెల్లుతామన్నారు.మరోవైపు ఎలివేటర్ కారిడార్ నిర్మాణంతో నియోజకవర్గంలో వందలాది కుటుంబాలు నివాస సముదాయాలను కోల్పోతున్నారని భయాందోళనలో ఉన్నారు. గత కొద్ది రోజులుగా భిక్కుభిక్కుమంటూ జీవితాలను సాగిస్తున్నారు.

పన్నెండు రోజులుగా అధికారుల సర్వే ఎలివేటర్ కారిడార్ నిర్మాణం కోసం భూసేకణ ఫనులు ముమ్మరం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, నష్టపోతున్న వారికి పూర్తి స్థాయిలో న్యాయం చేసేందుకు భూసర్వే కార్యక్రమాన్ని చేపట్టింది. నియోజకవర్గంలో 12 రోజులు ప్రజల సమక్షంలో వారి సాయంతోనే సర్వే చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సర్వేలో సేకరించిన వివరాలను ప్రభుత్వం ముందుకు పెట్టి న్యాయం చేస్తామన్నారు. మరో వైపు భూసేకరణతో నష్టపోతున్న వారి కోసం గ్రామ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సభ కార్యక్రమానికి హైదరాబాద్ రెవెన్యూ జాయింట్ కలెక్టర్.. ముకుంద రెడ్డి, ల్యాండ్ అక్రిడేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేష్ కుమార్,సికింద్రాబాద్ ఆర్డీవో పి.సాయిరాం, తిరుమలగిరి తాసిల్దార్ ఎస్.అశోక్ కుమార్ ముఖ్యఅతిధిలుగా హాజరయ్యారు. ఎవరి భూమి ఎంత పోతుందో వివరాలను తెలుసుకున్నారు. ఆ వివరాలను సైతం వారం రోజుల్లో పీడీ ఇస్తాని స్పష్టం చేశారు. ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకున్నట్లు తెలిపిన వారు భూమి అధిక ధర,బేసిక్ ధరను పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు.



యాక్ట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ రెవెన్యూ జాయింట్ కలెక్టర్.. ముకుంద రెడ్డి స్పష్టం చేశారు.2022 నుండే మార్కెట్ వ్యాల్యూ పెరిగిందని గత మూడేళ్లుగా భూముల ధరలు ఎలా ఉన్నాయెూ కూడా వరిగణలోకి తీసుకుంటామన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి మొదలు, డిసెంబర్ ఒకటో తేదీ 2024 నుండి గడిచిన మూడేళ్లలో భూముల ధరలు ఎలా ఉన్నాయెూ కూడా పరిశీలన చేయనున్నారు.

బాధితులు వెనకబడి వర్గాల వారే

ఎలివేటర్ కారిడార్ నిర్మాణంలో వెనకబడిన వర్గాల వారే అధిక సంఖ్యలో ఉన్నారని బాధితులు ఆవేధన వ్యక్తం చేశారు.సుమారు 100 ఇండ్లలో ఎస్సీ ఎస్టీల తలదాచుకుంటున్నారని బోరు విలపించారు. తాజాగా సికింద్రాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో 20 గజాల ఇంటి స్థలాన్ని కూడా కొనులేమని అధికారుల దృష్టికి తీసుకువెల్లారు. భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారంతో పాటు నివాసానికి యోగ్యమైన ల్యాండ్ కూడా చూపాలని అధికారులు దృష్టికి తీసుకువెల్లారు. సర్వం కోల్పోతున్న తమకు ప్రభుత్వమే న్యాయం చేయాలని బాధితులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.భర్తను కోల్పోయిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తుంది, భూసేకరణతో ఇంటిని కోల్పోతున్నట్లు బోరున విలపించింది.తనకు,తన పిల్లలకు సాయం చేయండని అధికారులను వేడుకుంది.ఈ కార్యక్రమంలో సంజీవయ్య కాలనీ జనరల్ సెక్రెటరీ జి ఎస్ యాదవ్, ప్రెసిడెంట్ డి ఏం అశోక్కుమార్, పి ఎల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుంది : ఇన్స్పెక్టర్ శ్రీనాథ్

**శామీర్ పేట / ఫిబ్రవరి 27 ( ప్రజా కలం ప్రతినిధి ) :**

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ క్యాతం క్రిష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు యువనాయకుడు క్యాతం మధు క్రిష్ణ ఆధ్వర్యములో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ..... క్రీడలతో శారీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తునందుకు మధు క్రిష్ణ కు అభినందనలు తెలిపారు. సుమారు 14 టీమ్స్ పాల్గొనగా మొదటి బహుమతి లక్మాపూర్ శివలీల యూత్, రెండవ బహుమతి లక్మాపూర్ తండా యూత్ గెల్చుకున్నారు. ఈ పోటీలలో సుమారుగా 509 మంది యూత్ పాల్గొన్నారు. మధు క్రిష్ణ మాట్లాడుతూ ఇటు పక్క క్రీడా వాతావరణం అటుపక్క శివ పార్వతుల శోభాయాత్ర తో పూర్తిగా సందడి వాతావరణం నెలకొన్నదని చెప్పారు. ప్రతి సంవత్సరం ఈ టోర్నమెంట్ కొనసాగుతుందని, దీనికి సహకరించిన ప్రతిఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పారుపల్లి నాగరాజు, సాయి శ్రీనివాస్ చారీ, మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, ఎస్ ఐ పరుశురాం నాయక్, మాజీ సభ్యులు సత్యనారాయణ, బాలేష్ గౌడ్, పారుపల్లి ఎల్లం, గ్రామా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపి, శ్రీనివాస్ చారీ, షావుకారి, తత్తరి నగేష్, కమ్మరి అశోక్, కరుణాకర్, సంతోష్ గౌడ్, యువజన సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **Kalakonda Ramakrishna**, Printed at M/s. Swetha Offset Printers, H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State and Published from H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State, Editor: **Kalakonda Ramakrishna**, RNI. Regn.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com